హనుమంతరాయకవి, మోచెర్ల

ప్రబోధచింతామణి

కాకినాడ, 1924

Record no. 613

Hanumantarāyakavi, Mōcerla

Prabōdhacintāmaṇi

Kākināḍa, 1924

Record no. 613

Bibliographic Record Target

హనుమంతరాయకవి, మోచెర్ల.
ప్రబోధచింతామణి : ఇది యైదంకముల నాటకము / గ్రంథకర్త మోచెర్ల హనుమంతరాయకవి.- 1. కూర్పు.- కాకినాడ : కోటమర్తి చినరఘుపతిరావు, 1924.
iv, (2), 111 p. ;24 cm.
Record no. 613

Hanumantarāyakavi, Mōcerla.
Prabōdhacintāmaṇi : idi yaidaṅkamula nāṭakamu / granthakarta Mōcerla Hanumantarāyakavi.- 1. kūrpu.- Kākināḍa : Kōṭamarti Cinaraghupatirāvu, 1924.
iv, (2), 111 p. ;24 cm.
Record no. 613

శ్రీ సుకుమారరమణాయ నమః

ప్రబోధచింతామణి.

ఇది యైదంకముల నాటకము.

“హిందీ భాషలోని” బిల్వమంగళ నాటకమున కాంధ్రీకరణము.

గ్రంథకర్త.

మోచెర్ల హనుమంతరాయకవి

మొదటికూర్పు 1000.

కాకినాడ:

కోటమర్తి చినరఘుపతిరావుగారిచే

కాకినాడ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడి

గ్రంథకర్తగారిచే ప్రకటింపబడియె.

1924.

[వెల 1-4-0.

ఉపోద్ఘాతము.

ప్రబోధ చింతామణి యను నీ భక్తిరస ప్రధాన నాటకము హిందీ భాషలోని "బిల్వమంగళ నాటకము"న కాంధ్రీకరణము. సాధ్యమయినంత వఱకు మాతృక ననుసరించియే దీనిని వ్రాసితిని. మొట్టమొదట దీనిని కాశీ పట్టణములో సుప్రసిద్ధనాటకులగు శ్రీ నాగరీనాటకమండలివారు ప్రదర్శించిరి. వీరి ప్రదర్శన మత్యద్భుతముగా నుండుటచేతను నాటకము సహృదయరంజకముగా వ్రాయఁబడుటచేతను దీనిని వంగభాషలోనికిని ఉరదూ భాషలోనికిని కన్నడభాషలోనికి మఱికొన్ని భాషలలోనికిని బరివర్తనము గావించిరి. దీనినే పలువురు కించిద్భేదములతో "సినీమా"లలోఁ జూపుచు లోకుల కమితానందముఁ గూర్చుచున్నారు.

నాలుగేండ్ల క్రిందట నేను కలకత్తా వెళ్లినప్పుడు 'కొరింథీన్' నాటకశాలలో బిల్వమంగళ నాటక ప్రదర్శనము చూచియుంటిని. అప్పటినుండియు నీ నాటకము నాంధ్రభాషలో వ్రాయవలయునను కుతూహలము కలిగియుంటిని. కాని, కార్యాంతర ప్రవర్తినగుటచేత నాతలంపు వెంటనే కొనసాగినది కాదు. ఇటీవల మాపురముననే "ఎలక్ట్రిక్ థియేటరు" లో దీనిని బ్రదర్శించిరి. నేను దీనిని తిరిగి సినీమా రూపకమునఁ జూచుట తటస్థించినప్పుడు లోలోన నణఁగియున్న నాకుతూహలమునకుఁ గ్రొత్తబలము వచ్చి నాటకప్రారంభమునకుఁ బ్రోత్సహించినది. కాని మాపురముననే యొక చింతామణి నేను దీనిని బ్రచురించుటకుఁ జాలఁ బూర్వమే వెలువడినది. తత్ప్రదర్శనమును నేను జూచియుంటిని. అప్పటినుండియు నా నాటకమును సాధ్యమయినంత శీఘ్రముగాఁ బ్రచురింపవలయునన్న కోరిక నాకుఁ గలిగినది. దీనికిఁ గారణము నిజమైన చింతామణీ నాటకము లోకమునకుఁ బ్రచురించుటయే గాని హెచ్చుతగ్గులను గుణదోషములను నిరూపింపఁదలంచుట కాదు.

ఇది భక్తిరస ప్రబోధకమైన నాటకమగుటచే దీనికిఁ బ్రబోధ చింతామణి యని పేరుపెట్టితిని. అసభ్యములైన వర్ణనములును బచ్చి శృంగారమును దీని

యందుఁ గన్పడవు. గ్రంథకర్త మాతృకలో వ్రాసిన యంశములే యథాయోగ్యముగా వ్రాయఁబడినవి.

ఇందు శ్రీనారాయణ తీర్థప్రణీతమైన శ్రీకృష్ణలీలాతరంగిణిలోని తరంగములు రెండు మూఁడు గ్రహించి వ్రాసితిని.

నాటకాంధ్రీకరణమునందు నాకు సర్వవిధములఁ దోడ్పడిన శ్రీయుత అమిరపు సాంబశివరావుగారికిఁ గృతజ్ఞతాపూర్వకమైన వందనము లర్పించుచున్నాను. ఇందలి గుణదోషములను బండితు లనుగ్రహింతురు గాక !

కాకినాడ,
15—4—1924.

ఇట్లు విధేయుఁడు,
మోచెర్ల హనుమంతరాయకవి.

ఆంధ్రపత్రిక.

రుధిరోద్గారి సం॥ ఫాల్గున మాస బ॥ ౯, శనివారము, 29-3-1924.

ప్రబోధ చింతామణి:—బిల్వమంగళనాటకము హిందీభాషనుండి మోచెర్ల హనుమంతరావుగారిచే (కాకినాడ) అనువాదితము. ఈనాటకమును కృతజ్ఞతతో నందుకొంటిమి. ఇది అచ్చులో చిత్రనళీయము సైజున 111 పుటలు గలిగియున్నది. ముద్రణము బాగుగానున్నది. ఇందు అంకములలో రంగవిభజన కూడ కలదు. ఇతరకవులు రచించిన చింతామణి నాటకమునకును దీనికిని భేద మేమనగా ఇందు హాస్య శృంగారములకంటె భక్తి వైరాగ్యములకే ప్రాధాన్య మధికముగ నొసంగబడెను. ఇందులకు గ్రంథకర్తలు ప్రత్యేక ప్రశంసకు పాత్రులు. శైలి మృదుమధురము. రసపోషణము, శ్లాఘనీయము. ప్రారంభమునుండియు భక్తిరసాంకురములు నాటఁబడి కడులలితముగ కడవరకును బోషింపఁబడెను. శ్రీకృష్ణార్పణమని హృదయమాంస సమర్పణ మహాత్యాగమును బిల్వమంగళుని చేతనే కవిచేయించి ఆతని కృతకృత్యునిచేసినాఁడు గాని బిల్వమంగళుని గురువగు సోమగిరిని మాత్రము శరీరాభిమానమగ్నుని గావించినాఁడు. బిల్వమంగళుని భక్తివిశేషము చూపుటయే యిందుల ప్రధానోద్దేశము. నిక్కపు భక్తికిని కపటభక్తికిని గల భేదము చక్కగా నిందు నిరూపింపఁబడినది. భక్తుఁడు భయవిరహితుఁడు మృత్యుంజయుఁడు. భగవంతున కతఁడే ప్రియతముఁడని బాగుగా చూపబడెను. బిల్వమంగళుఁడు కనులు పొడుచుకొనుటకు కల్పింపబడిన అమృతమయీప్రణయగాథ కొంత రసభంగమును కలిగించుచున్నది. హృదయమాంసమును సమర్పింపక పూర్వము మృతబాలుని బ్రదికించుటకు పూర్వము ఈరంగమును ప్రదర్శించిన నంత యౌచిత్యభంగము కలుగదేమో గాని యీరెండును జరిగిన పిమ్మట నీ మోహాంధతను మరల తెచ్చిపెట్టుట వలన రసభంగము కలిగినదని చెప్పకతప్పదు. మఱియొక విశేషమేమన మహాపతివ్రత యగు మాయాదేవిని—బిల్వమంగళుని ధర్మపత్నిని—బలవన్మరణమునకు పాలుచేయక కవి యీమెను భక్తురాలిని గావించి పాతివ్రత్య మహిమాతిశయమును ప్రకటించుట మిక్కిలి శ్లాఘనీయము. మొత్తముమీద నీనాటకము మిక్కిలి ప్రశంసనీయముగా నున్నదని చెప్పగలిగినందులకు చాల సంతసించుచున్నాము.

ఈ నాటకము నందలి పాత్రలు.

పురుషులు.

1. శ్రీకృష్ణుఁడు.
2. మంగళుఁడు—శ్రీకృష్ణుని భక్తుఁడు.
3. బిల్వమంగళుఁడు—కథానాయకుఁడు. మాయాదేవి భర్త.
4. రామదాసు—బిల్వమంగళుని తండ్రి.
5. భ్రమణుఁడు }
6. రమణుఁడు } చింతామణి విటులు.
7. సౌభాగ్యచంద్రుఁడు }
8. సోమగిరి—ఒక సన్యాసి. బిల్వమంగళుని గురువు.
9. సేవకరాముఁడు—అమృతమయి భర్త. ఒక భక్తుఁడు.
10. నిర్లోభరాముఁడు—ఒక సన్యాసి.
11. తానసేనుఁడు—అక్బరు చక్రవర్తి యొద్ద గాయకుఁడు.
12. అక్బరు—చక్రవర్తి.
13. అన్న—చింతామణి పెంపుడు తండ్రి.

మొదలగువారును, బందిపోటు దొంగలు, సేనాపతి, మార్దంగికుఁడు ప్రవేశింతురు.

స్త్రీలు.

1. మాయాదేవి—బిల్వమంగళుని భార్య.
2. చింతామణి—ఒక వేశ్య. బిల్వమంగళుని యుంపుడుకత్తె.
3. అమృతమయి—సేవకరాముని భార్య.
4. మాలతి }
5. గులాబి } మాయాదేవి చెలికత్తెలు.

మఱియు, భక్తిదేవి, కామదేవి, చంచల, మాయ, యనువారు వత్తురు.

నాందీ.

శ్రీమదహార్యశేఖరుఁడు చేసిన సత్తపముల్ ఫలింపఁగాఁ
గాము ననంగుఁ జేసి త్రిజగత్పరిపూతచరిత్ర నద్రిక
న్యామణిఁ గేలుఁబట్టి ప్రమథాధిపుఁడై చెలువొందు భక్తచిం
తామణి శంకరుండు సతతంబుఁ బ్రబోధము మీకొసంగుతన్ ||

[నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి పుష్పాంజలిఁజల్లి]

సూత్ర—నిఖిలపాప నాశంకరుఁడైన శంకరునకు నమస్కారము. ఆహా! ఎవఁడు శంకర భజనానందమగ్నుఁడగునో వాఁడు ధన్యుఁడు గదా!

నటి—(ప్రవేశించి) ప్రాణనాథా! ఎవరిని నేఁడుమీరిట్లు భక్తిరసావేశమునఁ బ్రస్తుతించు చున్నారు?

సూత్ర—ప్రియా! ఎవని ధ్యానమువలన మోక్షప్రాప్తియగునో యట్టిభక్తరక్షకుఁడైన శంకరభగవానుని చరణారవింద భజనమునందు మనస్సు లీనమగుచున్నది. నిజమైన భక్తునకే కదా ప్రభునికృప లభించుట. అట్టి కృపాసంపాదకుఁడే భక్తుఁడు. ఆభక్తుఁడు భగవంతుఁడలిగినను నిజభక్తిచే నాకోపము శాంతినొందింపఁగలఁడు. కాని, భక్తుఁడలిగినప్పుడు భగవంతుఁడు కూడ శరణ్యుఁడు కాఁజాలఁడు. ఇదియంతయు భగవద్విలాసము. అంబరీష దూర్వాసుల కథనీకు జ్ఞాపకములేదా?

నటి—అవును. ప్రాణనాథా! నాకాకథ జ్ఞాపకమున్నది. మాయ ప్రపంచమున బ్రబలినది. దీనిని వదల్చుకొనుట యెవ్వరికిని దరముగాకున్నది.

సూత్ర—ప్రియా! నీస్వరూపమే మాయాస్వరూపము. ఇంతకంటె వేఱొక మాయయేమి కలదు? ప్రపంచమంతయు మాయాధీనమైనది. కాని, ప్రియా! నాకొక్క సందేహము కలుగుచున్నది. ఈమాయ మాయ నేల ప్రేమించుటకుఁ బ్రయత్నింప రాదు? పురుషుల నేల వేధించి జ్ఞానహీను లను జేయవలయును?

నటి—ప్రాణనాథా! మాయస్త్రీయని వచించితిరి కదా! ఎక్కడనైన స్త్రీలు స్త్రీలను బ్రేమింతురా? మహాప్రభూ! నేడు మీరిట్టి తలక్రిందు మా టలాడుచుంటిరేమి?

సూత్ర—నిజమే. నేను నేడు తలక్రిందుమాట లేయాడుచుంటిని. స్త్రీమా యయే. భక్తియు స్త్రీయే. భక్తిని మాయమోహింపలేదు. కాని పురు షరూపమగు జ్ఞానము మాయకు లోఁబడును. ఇందుచేతనే శంకరునివంటి మహానుభావుఁడు సైతము నిరంతరము భక్తినేనమ్మి కొల్చుచున్నాఁడు. సంసారసముద్రముఁ దరించుటకు భక్తియను నావకంటె నితరసాధనము లేదు.

నటి—నిజమే ప్రాణేశా! అట్టిభక్తియే ప్రధానముగాఁగల నాటకరాజముఁ బ్రదర్శించి యీసభ్యుల నేలసంతోష పారావార మగ్నులఁ జేయరాదు?

సూత్ర—ఆలాగే చేయుదము. ప్రియా! ఏభక్తుని గూర్చిననాటకము ప్రదర్శన యోగ్యమో నీవే చెప్పుము.

నటి—నాథా! భక్తులలోఁ దారతమ్యవిచారము చేయలేము. ఒకరికంటె నొకరు మహత్తు గలిగి యున్నారు.

సూత్ర—ప్రియా! నీమాట సత్యము. అట్లయిన మనము "చింతామణిఁ" బ్రద ర్శింతము.

నటి—నాథా! ఇంతకంటె నొండొకటి లభింపనే లేదా? అదియేమోకాని నాకు దాని యందంత గౌరవము లేదు.

సూత్ర—ప్రియా! కలియుగమునందు మహాభక్తుఁడైన సూరదాసు శ్రీకృష్ణ లీలానంద మగ్నుఁడై యనంతపదమునందినవాఁడు. అట్టి భక్తాగ్రేస

రుని చారిత్రము "ప్రబోధ చింతామణి" యనుపేర శ్రీ మోచెర్ల హను మంతరాయకవి విరచించి కృతార్థతఁ గాంచెను. దానియందు నీకంతగౌ రవము లేకపోవుట కసభ్యవర్ణ నాదులేమైనఁ గలవా? భక్తిరసము ప్రచుర మగుటలేదా? ఓసి వెఱ్ఱిదానా! ప్రబోధచింతామణికి దోషమా రోపింపకుము.

ఉ. ఏమని యొంచితీవు? తర । ళేక్షణ! భక్తి నిధానమైన చిం
తామణి నాటకంబన వి । తాకు వహించెద వేల? సుందర
శ్యాముని లీల లందొకటి । యాఁజుమి యయ్యది సర్వముఁ బ్రబో
ధామృత పూరపూరిత మి । హంబుఁ బరంబును జేకుఱాళిన్॥

నటి—నాథా! అట్లయిన ధన్యులము. ప్రబోధ చింతామణిని వేఱొక చింతా మణిగా భావించి పొరబడితిని.

సూత్ర—ప్రియా! నిక్కముగా ధన్యులము. శీఘ్రముగా నాటకులను వారి వారి పాత్రధారణమునందు నియోగింపుము. ఆహా! ప్రపంచమంతయు సర్వేశ్వరుని యనంతలీలావిశేషములచే నిరంతర సంచలనముఁ గాంచు చున్నదిగదా!

సీ. బ్రహ్మసాగరమందుఁ । బడి మున్కలిడువాని
కదియె గంగాస్నాన । మంబుజాక్షి!
ప్రేమసాగరవీచి । కామగ్నుఁడగువాని
కదియే యమృతధార । యలరుఁబోణి!
మాయాతమస్సు వె । లైయెవ్వనికిఁ దోఁచు
నాతఁడే గుర్తింపఁ । డరుణచరణ!
దుఃఖాంధకారమం । దునఁ బ్రకాశముఁగాంచు
నతఁడే జగజ్జ్యోతి । యనుపమాంగి!

గీ. మాయయను వేశ్యనారి కే । మానవుండు
దాసుఁడో వాఁడె మూర్ఖప్ర । ధానుఁడబల!
జగమునం దరిషడ్వర్గ । జయముఁగాంచు
నెవ్వఁడాతఁడె సుజ్ఞాని । హేమగాత్రి!

నటి—నాథా! నేనింకఁబోయి పాత్రలను సంసిద్ధము చేసెదను.

సూత్ర—శీఘ్రముగాఁ జేయుము.

నటి—(నిష్క్రమించు చున్నది.)

సూత్ర—భారతవర్షము భక్తులచేతనే ప్రతిభఁగాంచినది. ధనమునందును ధర్మబలమునందును భుజబలమునందును నిరుపమాన ప్రతిష్ఠఁగాంచిన భారతదేశము కాలగతిచేత నిర్గంధకుసుమముల మగుమమ్ముఁగాంచి పూర్వప్రతిష్ఠ మాపుకొన్నది. భగవంతుని ధ్యానమునే మఱచి పోయితిమి. ప్రమత్తత, ఉపేక్షాభావము ఐకమత్యహీనత, ఈమూఁడును మనలనిట్టి దుర్గతికి దెచ్చినవి. వానినిమనము వదలిపెట్టి యభివృద్ధినొందుమార్గముఁ జూచుకొనవలసియున్నది. అప్పుడే శ్రీకృష్ణభగవానుఁడు భక్తుఁడగు మంగళునితోఁ బ్రవేశించు వేళయైనది. నేనరిగెదఁగాక!

ఇది ప్రస్తావన.

ప్రబోధచింతామణి

ప్రథమాంకము.

1 రంగము:—పరలోకము.

[ప్రవేశము:—శ్రీకృష్ణుఁడు—మంగళుఁడు.]

మంగ—శ్రీకృష్ణా! వైకుంఠవాసా!

సీ. సోమకాసురుఁగూల్చి । యే మహాత్ముఁడు చతు
ర్వేదముల్మాకు సం । ప్రీతినిచ్చె,
క్షీరాబ్ధిమథనంబు । చేయుచో నేస్వామి
కమఠమై మాదర । గ్రివమెత్తె,
నరసింహుఁడగుచు నే । పరమాత్ముఁడు హిరణ్య
కశిపు లోకద్రోహిఁ । గసిమసంగెఁ,
బరశురామసమాఖ్యఁ । బరఁగి యేధీరుఁడు
దుష్టరాట్కులము నె । త్తుటనుముంచె,

గీ. రామకృష్ణావతార ధా । రణముచేత
రావణాసురకంస మ । ర్దనమొనర్చె
నే కృపానిధి యట్టి య । నేకధర్మ
రక్షణార్థశరీరు నిన్ । బ్రస్తుతింతు.

కృష్ణు—మంగళా! ఎప్పుడుకలియుగప్రభావమున ధర్మనష్టమయ్యెనో యెప్పుడు పాపప్రాబల్యముచే జీవులు తమోభావము కలిగి యవిద్యాప్రతిసీరకు వెనుకఁ బడియుందురో యట్టిసమయమునఁ బృథ్వీభాగమంతయు నధర్మవ్యాప సంఛన్నమై కన్పించును.

మంగ—దేవా! వేదములు సత్యమార్గ ప్రదర్శకములై గీతాశాస్త్రము జీవాత్మవిషయబోధకమై యుపనిషత్తులు రాజధర్మ నీతిదాయకములై సదు

పదేశములు సన్మార్గావర్తకములై పృథివియందు వెలయుచుండఁ బాప
మునకుఁ జోటుకలదా! మహాత్మా! ఇది మీసంకల్పమా? లేక
సూచనయా?

కృష్ణు—మంగళా! నీవనుకొన్నవి రెండునుగావు. సన్మార్గావర్తకమైన సాధన
సామగ్రి యెంతయున్నను వివేకహీనులై జనులు ధర్మము నవలం
బింపకున్నారు.

మ. పరమాత్ముండగు నన్నుఁ గొల్వక మహా పాపక్రియల్సేసి వే
మరు హీనక్షణసౌఖ్యవాంఛలను గా మక్రోధమోహాంధులై
నరులెల్లన్ జరియించుచుండిరి సుమా నానాప్రకారంబులన్
ధరణిన్ బాపము చుట్టివైచిన దభే ద్యప్రక్రియన్ మంగళా!

మం—మహాప్రభూ! జనులు సంతతధర్మకర్మావలంబులై ప్రవర్తింపకుం
డుటకుఁ గారణమేమి? అందేమికష్టమున్నది? సర్వదా యధర్మరోగ
పీడితుఁడగువాని కేవేని యౌషధములున్నచో నవి సత్యముఁజెప్పుట
యు సత్సాంగత్యము చేయుటయుఁగదా! ఆయౌషధద్వయము మూల్య
ములేకయే సులభసాధ్యముగా నున్నది. అట్టి పరమౌషధములేల జను
లుసేవించి తమ యధర్మజాడ్యముఁ బాపుకొనరో తెలియదు.

కృష్ణు—మంగళా! నీమాటలు యథార్థములు. వనమునఁ జందనవృక్ష ముండు
టచేఁ దత్సహవాసమున వనవృక్షములన్నియుఁ దాత్కాలికసౌరభము
మాత్రమొంది యలరుట నీవెఱుఁగుదువు కదా!

మంగ—దేవా! అట్లులే సత్సాంగత్యముచే మనుష్యుఁడు సుగుణ సంపాదకుఁ
డగును.

కృష్ణు—మంగళా! నీవిక్కడనే పొరపడుచున్నావు. ఏప్రాణియు నైజగుణ
మును విడువఁజాలదు.

గీ. అధమగుణ సమేతుఁ డైన పూరుషుఁడుసం
త్సంగలబ్ధసుగుణ శాలికాఁడు
చందనావనీజ మందుండి పెక్కేండ్లు
పాపుకొనఁగఁ గలదె పాము విషము.

మంగ—కాని దీననాథా! పూలమొక్క తనయందు మొలిచిన హేతువున

మట్టి దాని సువాసనయుంముఁ బొల్గొనుచున్నది ఆరీతిగనే దుష్టుఁడు
సత్పురుషస్నేహమున సుగుణియగునని నానమ్మకము. కుమతియైనను
సదుపదేశములు సుమతిగాఁ జేయఁజాలునుగదా!

కృష్ణు—కాని యాసుగుణములును సుమతియు స్థిరముగా నిలువవు. సర్పము
శీతబాధకోర్వలేక తత్కాలమందుఁ జచ్చినట్లు పడియుండి కొంచెమెండ
తగులఁగనే పడగయెత్తి బుస్సకొట్టునట్లు అధమాంతరంగసర్పము సాధు
సంసర్గమున క్షణమాత్రము శాంతినొందినను బంగారుచాయగల స్త్రీని
జూచినప్పుడు తొంటిగుణ మవలంబించును. మంగళా! నీకింత
వెఱ్ఱియేల?

గీ. శునకమును గాంగవారి ముంచినను, మంచి
గందపుంబూఁత లిడినను గాడిద కవి
నైజగుణములు వీడనె న్నఁడును నట్లె
కుమతి యుపదేశశతముల సుమతికాఁడు.

మంగ—కాదు దయానిధీ! కాదు. రాత్రులందు దీపము చీఁకటినిమాపి యా
త్రికులకు వారి యెట్లుచూపుచున్నదో యట్లే సాధుమైత్రి దుర్జనులకు
జ్ఞానోద్భవము గావించును. అజ్ఞానాంధకారముఁ బాపును. సాధుమైత్రి
నిష్ఫలము కాఁజాలదు. పూవులేనిదే ఫలముపుట్టదు. సాధుసాంగత్య
మాత్మోద్ధరణమునకు ముఖ్యకారణము.

కృష్ణు—ఓయి వెఱ్ఱిమంగళుఁడా! సర్పమునకుఁ బాలువోసి దానివిషము నాశ
ము చేయఁగోరుచున్నావా? ఈశ్వరుని సృష్టిలో నేమనుష్యునకు
సన్మార్గప్రాప్తి లేదో యాతనిని సత్సంగమున సన్మార్గగామిని జేయఁ
జూచుచుంటివా? ఈశ్వరునియందు భక్తిశ్రద్ధలులేక జ్ఞానహీనులగు
టచేఁ బ్రతి రోమకూపమునందును విషము కలిగియున్న మనుష్యుల
కమృతదానముచేసి విషపరిహారము చేయఁదలంచితివా? అట్లెన్నఁడును
జేయలేవు. కాని, కాలకర్మము లనుకూలమైనప్పుడు దైవకృపచేఁ బర
మనీచుఁడుకూడ నితరులకు జ్ఞానబోధ మొనర్పఁజాలినంత సుజ్ఞానియగు
ను. ఇది యీశ్వరవిలాసము సుమా!

మంగ—మహానుభావా! మీమాటలు నిరాకరింపఁజాలనుగాని సత్సంగ

మహిమ వర్ణనాతీతమైనది. ఎట్టి యధముఁడైనను సాధుమైత్రిచేఁ గుజనత్వమును బాసి సుజనత్వము సంపాదించుకొనునన్న నమ్మిక నాకు దృఢము గాఁగలదు. సత్సంగమహిమ నేను బ్రత్యక్షముగాఁ జూపించెదను. నేను రాతినుండి రసము నుపదేశమూలమునఁ దీయఁగలను.

కృష్ణ — అట్లయిన భూలోకమునకుఁ బోవుదమురమ్ము. నీకచ్చట సర్వమును బోధకాఁగలదు.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

2. రంగము :— చింతామణిగృహము.

[ప్రవేశము. మంగళుఁడు, కృష్ణుఁడు.]

మంగ — దేవా! వాసుదేవా! ఈదివ్యభవనము రామణీయకమున కాటపట్టయి చెలువాఱుచున్నది. ఆహా! వైజయంతప్రాసాదమురీతి సుధాసన్నిభకుడ్యకాంతిసమంచితమై విశాలప్రాంగణవిరాజితమై చిత్రవిచిత్రకుట్టిమసముదయాభిరామమై యనంతకళానిధానమై యున్నమహోద్యానంబున నీదివ్యసుందరభవనము విలసిల్లుచున్నది. ప్రతిద్వారబంధమును మణిరత్నఖచితమై నిగనిగద్యుతుల నీనుచున్నదా యనునట్లు చిత్రకారుని చిత్రలేఖనావైశద్యమును వెల్లడించు రమణీయపుష్పలతారచనలచే శోభిల్లుచున్నది. ఓహో! కోటిచంద్రప్రభాభాసమానమైనగతి నీయానందభవనము విద్యుద్దీపములచేఁ బ్రకాశించుచున్నది. శ్రీకృష్ణా! లక్ష్మీస్థానమైన యీభవనరాజమున కేపుణ్యుఁడు ప్రభువై ధన్యతఁ గాంచెనోకదా!

కృష్ణ — మంగళా! ఈమహాభవనము లోకోత్తరమైనది. ఇది నిజముగా భూదేవికిఁ గంఠాభరణ మనవచ్చును. ఈసుందరభవనము మహాధనసౌందర్యసంపన్నురాలగు చింతామణియను వేశ్యకు నివాసస్థానము.

మంగ — ఓహో! వేశ్యాగారమా యిది! సరిసరి! లక్ష్మి యెచ్చట నివసించుచున్నో యచ్చట ధర్మకర్మలు నాస్తియని చెప్పవచ్చును.

కృష్ణ — మంగళా! నిజమే. లక్ష్మి నాయొక్క మాయ, ఆమాయ యెందుండునో యందే యధర్మముకూడ నుండును. అధర్మదేవత మనుష్యుల నెప్పు

డావేశించునాయని తరుణముఁ గనిపెట్టుచు లక్ష్మిని వెంటాడి తిరుగుచుండును. లక్ష్మీయుతులైనవారు నిజభాగ్యమాయాంధకారమునఁబడి కన్నులుగానక ప్రవర్తించువేళ నధర్మము సులభముగా వారిని బట్టుకొని పీడించును.

శా. మాయాసీత హరించి రావణుఁడు రాణ్మృత్యువుచేఁ గూలఁడే?
మాయామోహినిఁ గాంచుటన్ శివుఁడు కామక్రీడలన్ లోఁగఁడే
మాయాఖ్యప్రతిసీరకాలవిషసంబంధంబునన్ నల్లనా
చాయన్ నాకును నాత్మకున్ నడుమదేశంబందు వ్రేలాడెడిన్॥

మంగ — దేవా! మీపలుకులు నాకు కర్ణోత్సవముగా నున్నవి.

కృష్ణ — ఇట్టి యానందస్వర్గమున నిట్టి మహాభవనసీమను దుష్ప్రవర్తనము హెచ్చుగనున్నది. నీవిచట దాఁగియుండిజరుగఁబోవుయావద్విశేషములను విలోకింపుము. చేతనైన సాధుపరిచారముఁగావించి సన్మార్గమునకుఁ ద్రిప్పుము చూతము— (కృష్ణుఁడు నిష్క్రమించుచున్నాఁడు.)

మంగ — (ఒకచెట్టుచాటున దాఁగియుండును.)

[భ్రమణుఁడు, రమణుఁడు ప్రవేశించుచున్నారు]

భ్రమ — సోదరా! నేఁడాలస్యమైనదేమి?

రమ — నేఁడు కొంచెమాలస్యమే యైనది. గంటలు లెక్కింపఁగా లెక్కింపఁగా సూర్యాస్తమయమైనది. ఈనాఁడెంత సేపటికిని బ్రొద్దుగ్రుంకనే లేదు. ఇప్పటికి సూర్యుని దయచే మనకిల్లు వెలుదేఱుట కనుకూల సమయమైనది.

భ్రమ — అట్లనుకొననేల? మనకనుకూలసమయమైనది. కావుననే సూర్యుఁడు మేఘచ్ఛన్నుఁడైనవాఁడు. ఆహా! భగవంతుఁడు మనకట్టి భోగములగని నిచ్చినందులకు దాని తాళముచెవికూడ మనకిచ్చిన నెంతహాయిగా నుండునోకదా!

రమ — సృష్టికర్తకూడ నొక్కొక్కప్పుడిట్టి యవివేక కార్యములుచేయుచుండును.

భ్రమ — చింతామణితో నీరాత్రియంతయు నానందముగాఁ గడపుదము. అట్టి యానందమునకుఁ బ్రేరకమయిన మధురసమిదిగో నాయొద్దనున్నది.

రమ — అట్లయిన నతిసుఖముగా మనమీరేయి చింతామణిసౌధమునఁ గడపవచ్చును.

భీమ—దానికేమియు సందేహము లేదు.

రమ—మిత్రమా ! మీరు నిత్యమును సేవించు నమృతతుల్యమగు మధువును మఱువక తెచ్చినందులకు మీకు వందనములు. ఏదీ నాకుఁగూడ రుచి చూపింపుఁడు. సురాపానము గర్హ్యమైనను దానిపసందు తెలిసికొన్న తరువాత విడిచిపెట్టలేకున్నాను.

భీమ—ఎవ్వరో తెలివితక్కువవాండ్రు గర్హించినంతమాత్రమున మనవంటి బుద్ధిమంతులు సేవించుట మానుకొందురా ? ఎంత తెలివితక్కువ మాట ! మధువనఁగా నేమో చెప్పెదను వినుము.

సీ. రసికులానంద వా । రాశిలోఁ దూఁగాడు
నప్పు డాస్వాదించు । నమృత రసము,
బలవిహీనుల బలా । ఢ్యులఁ జేయఁగా నాశ్వి
నేయులిచ్చిన దివ్య । పాయసంబు,
కామినీ మోహాంధ । కార సంవృతుల క
త్యంత వికాస సి । ద్ధాంజనంబు,
సురసేవ్యమై జరా । మరణరాహిత్య ప్ర
సిద్ధిఁ జెన్నారు సం । జీవకరణి,
గీ. సుధకు మాఱిటఁ బరఁగెడు । మధువు, సకల
జనమనః క్లేశవారణౌ । షధము, దీని
తత్త్వమెఱుఁగుట లోకమం । తయును గనుట
సేవచేయుట వైకుంఠ । సీమమనుట॥

రమ—సోదరా ! సత్యముఁ జెప్పితివి.

భీమ—(కొంతత్రాఁగి) నిస్సందేహముగాఁ బుచ్చుకొనుము.

(ఇచ్చుచున్నాఁడు)

రమ—(పుచ్చుకొని త్రాఁగి పాఱవేయుచున్నాఁడు).

మంగ—(స్వగతము) ఓదుష్టులార ! మీరుచేయు పాపకార్యములకు సాక్ష్య మిచ్చుటకై భగవంతుఁడనేక శత సహస్రకోటి తారకలను మింట సృజించియున్నాఁడు. తేజస్స్వరూపుఁడగు నాపరమాత్ముఁడు త్రిలోకవిఖ్యాతుఁడైన యాసర్వవ్యాపకుఁడు ప్రతిజీవియుఁ జేయు సుకృత దుష్కృతము

లను బహురూపముల నరయుచుండును. కీలుబొమ్మలవంటి మీరు భగవంతుని సన్నిధి కేగినప్పు డేమి ప్రత్యుత్తర మీయఁగలరు ?

భీమ—ఇంతవఱకు బిల్వమంగళుఁడు రాలేదే !

రమ—అతఁడే చూడుము. మాటలోనే వచ్చినవాఁడు.

బిల్వ—సోదరులారా ! నాకంటె మీరు ముందుగావచ్చితిరే ! ఎంతసేపైనది మీరువచ్చి ?

రమ—పది నిముసములింకను గాలేదు-ఇంకఁ జింతామణిమాత్రమే రావలసియున్నది.

భీమ—అది కూడవచ్చిన మనమేళము పూర్తియైనట్లే.

బిల్వ—నేఁడు చింతామణి సంగీతమా ! ఆహా ! ఇంతకంటె మనకుఁ గావలసినదేమున్నది ? చింతామణిలేనిదే క్షణసుఖముకూడ లేదు. ఎన్నిసుఖములున్నను ఎంతధనమున్నను చింతామణిలేనిదే సర్వశూన్యముగాఁ దోఁచును.

రమ—జన్మమున కెందైన సాఫల్యము కలదా యన్న నది యిందేయున్నది. ఇంద్రలోకానంద మెందున్నది ?

భీమ—ఇందేయున్నది.

బిల్వ—ఆహా ! ఇట్టి మహాభోగ సుఖానందములుగాంచు మనయదృష్టము నేమని పొగడుదును !

మంగ—(స్వగతము) అవివేకులారా ! తుచ్ఛమగు క్షణసుఖాపేక్షచే మిమ్ము మీరు మఱువకుఁడు. సర్పము నింటఁబెట్టుకొన్న విశ్రాంతియెక్కడిది ?

బిల్వ—చింతామణి యింతవఱకు రాలేదేమిచేయుచున్నదో !

రమ—ఏమిచేయుచున్నదా ! పెంపుడు కూఁతురైన బాలామణిని సాన పట్టుచున్నది.

భీమ—కత్తికిఁ బదను పట్టుచున్నదికాఁబోలు ?

రమ—పదను బెట్టనిచో మనగొంతుకలు కోయుటెట్లు ? అలుగుట-వశపఱచుకొనుట-ఒయ్యారముగా నడచుట-వింతనిట్టూర్పులు నిగుడ్చుట-కాముకులను దనయౌవన రూపముచే వలపించుట-పెదవులు కఱచుట-విఱుచుట తాంబూలమిచ్చు వేళ నులికిపాటున వస్త్రము సవరించుకొని వెనుకకు

మఱలుట-నేత్రములనుండి యశ్రుబిందువులు రాల్చుట-తలత్రిప్పుట-నవ్వుట-మొదలగు విటవశీకరణ విద్యలన్నియు నేర్పుచున్నది కాఁబోలు.

భీమ—కొలఁది దినములలో నాచిన్నదికూడ రాతినుండి రసముఁ గ్రక్కింపఁ గలదు.

రమ—అందులకు సందేహమా! తల్లికంటె పిల్ల రెట్లు జాణయగును.

బిల్వ—దీనికేమిగాని యద్దిగోఁ జూడుఁడు.

(వ్రేలితోఁ జూపుచు)

ఉ. ఏమొపయింట విరాళిఁ దపికె యించుచు నుంటిమొ రేలునుంబవ
ళ్ళామె ససంభ్రమంబుగ నొకె యారముగాఁ జనుదెంచుచున్నదే
కాము నిశాతబాణమనఁ గా నయనోత్సవముఁ ఘటించు చిం
తామణి దీనిఁబోలిన లకె తాలలితాంగులఁ గానమెచ్చటన్.

భీమ—ఓహో! చింతామణీ! అహ్హాహ్హా! ఒహ్హోహ్హో! ఎవరిరాకకై గ్రుడ్లు తెఱచుకొని వేచియుంటిమో యాసుందరియే వచ్చుచున్నది. ఆహా! ఏమిచింతామణి! ఏమిచింతామణి! నిజముగానాకు—

రమ—ఇదిగోఁ జింతామణి వచ్చినది.

మంగ—అవును. సుందరవేశ్యాభూతము వచ్చినది. విషపూరితమైన దృష్టిచే మిమ్ము బుద్ధిహీనులఁ జేయుచున్నది.

[చింతామణి, మార్దంగికుఁడు, గురువు ప్రవేశించుచున్నారు]

చింతా—ఆర్యులారా! నమస్కారములు.

బిల్వ—నిత్యసౌభాగ్యమస్తు!

మార్ద—మీవంటిబాబులు నిత్యము వత్తురుగాక!

బిల్వ—చింతామణీ! మంచిసమయమునకే వచ్చితివి.

చింతా—మీయాజ్ఞయగుటయు సమయమునకు రాకపోవుటయునా?

బిల్వ—చింతామణీ! దీనికేమిగాని నేనుబంపిన ముత్యాలహారమును ధరించి రాలేదేమి?

చింతా—ఆర్యా! క్షమింపుఁడు. నేను స్నానముచేయఁబోవుచు బాలామణి మెడలోవైచితిని. తిరిగి ధరించుట మఱచితిని.

బిల్వ—ఆలాగా! ఒకవేళ నీకది రుచింపలేదేమోయని యట్లడిగితిని.

[సౌభాగ్యచంద్రశ్రేష్ఠి ప్రవేశించుచున్నాఁడు]

సౌభా—సోదరులారా! వందనములు.

అందఱు—సోదరా! వందనములు-రమ్ము. కూర్చుండుము.

చింతా—సెట్టిగారు! వందనములు.

సౌభా—దండాలోయి చింతామణీ!

భీమ—సెట్టిగారు! దండాలోయి యనుచున్నారే!

సౌభా—అన్నగారు! అందులోఁ దప్పున్నదా యేమి? ప్రేమకొలఁది నాలా గన్నాను.

చింతా—సెట్టిగారిప్రేమ యింతటిదని చెప్పఁదరముకాదు. నన్ను నేఁడు మగవానిగాఁ జేసినారు.

సౌభా—అందులోఁ దప్పేమున్నది? ముద్దుముద్దుగా దండాలోయన్నాను. పోనీలే. నీకిష్టము లేకపోయిన మానివేయుదును.

చింతా—సెట్టిగారు! మీరిట్టివారని తెలిసియున్న రత్నాలహారమునుగూర్చి మీతోఁ జెప్పియుండను. మీరానాటినుండియు దర్శన మిచ్చుటయే మానినారు.

సౌభా—ఓసి వెఱ్ఱిమొగమా! ఒక్కరత్నాలహారమేకాదు. మాప్రాణములే యర్పించుటకు సిద్ధముగానున్నాము. ఏమిచేయుదును? కాలము కర్మము రెండును ఆలాగుకూడినవి. నేను రత్నాలవర్తకుఁడైన ముత్యాలసెట్టిగారి పినతండ్రితో బృందావనయాత్రకై పోయితిని. అందుచేత—

చింతా—ఓహో! సెట్టిగారు బృందావనయాత్రకై వెళ్లియుండిరా! అట్లయినఁ బాపములన్నియు యమునాస్నానముతోఁ గొట్టుకొనిపోయెనుగాఁబోలు!

సౌభా—అవునవును. కొట్టుకొనిపోయినవి. ఇప్పుడు నీదగ్గఱఁ గ్రొత్తపుణ్యము గడింపవచ్చితిని.

బిల్వ—[స్వగతము] ఆహాహా! ఏమిసుందరస్వరూపము! ఏమియద్భుతరూపము!! ఇట్టిలావణ్యగాత్రి యీలోకములో వేఱొకతె లేదు. ఈలోకములోనే కాదితరలోకములందుఁగూడ లేదు.

మంగ—[స్వగతము] ఔరా! జాలరునివలలో నీ మత్స్యము లెట్లుచిక్కినవి!

బిల్వ—[స్వగతము] ఆహా! చంద్రకాంతినిబోలు మన మానందరూపమగు

స్వర్గము నాకర్షించుచున్నది. లక్ష్మీసమానమగు నీసుందర విగ్రహమును జూచి నే నానందవారాశిమగ్నుఁడనైతిని. నిర్జీవలతిక యట్లుల్లాసమునొందు నామది దీనిదర్శనమున శాంతిసుఖ మనుభవించుచున్నది.

మార్థం—బాబులారా! కాలహరణమెందులకు? అశ్వపతిచక్రవర్తి రాణివలె మెప్పుచున్న యీమె నేఁడుమిమ్ము సంగీతవిద్యచే సేవింపఁదలఁచియున్నది.

బిల్వ—ఆలాగా! ధన్యులము. ఆహా! అశ్వరుమాకు రాజు-తండ్రితో సమానుఁడు. [చింతామణితో మెల్లఁగా] నీవుమాకుఁ దల్లివంటిదానవుసుమా!

చింతా—[కోపముతో] చాలుఁజాలు! బాగుగానన్నారు. నేనేమి అశ్వపతి కుంపుడుకత్తెనా? వానిరాణినా!

బిల్వ—ఆహా! ఏమిసౌభాగ్యము! ఏమివిలాసము!

గీ. వెలఁది సహజంబుగాహర్ష । వేళలందు
వదనము వికాససదనమై । పొదలు, నీవు
కోపగించినవేళలఁ । గూడ నీదు
మోమువిలసిల్లు వింతపొ । ల్పునువహించి.

గురు—ఈమె నిత్యసౌభాగ్యవతి. మీదయయున్న నీమెకు లోపమేమియుండును

రమ—అవును. అంగడిలోని మిఠాయి యెవఁడు డబ్బుపెట్టికొనునో వానికి లభించునుగదా!

మంగ—[స్వగతము] ఎవఁడుదానినిదినునో వాఁడు మృత్యుముఖంబునఁబడును.

భీమ—ఇప్పుడక్కఱలేని మహాభారతము విప్పుచున్నా రెందులకు? సంగీతము పాడనిండు. చింతామణీ! దయచేసి పాడుము.

సౌభా—అవునవును. మాటాడకుఁడు. ఓయీ! మద్దెల వాయింపుము. చింతామణీ! ఏదైన ముద్దయిన గీతమో ఒకజావళీయో చేతనైన నొక మంచి తరంగమో పాడు. పాడుమణీ! అబ్బా!! పాడవేమి!!!

చింతా—తొందరపడకుఁడు సెట్టిగారు. ఇంతతత్తరపాటుకూడదు.
[వీణశృతి వేసిపాడుచున్నది]

ముఖారీ (వరాళీ) రాగము—ఆదితాళము.

పల్లవి—శ్రీనిలయం సఖి శ్రీనిలయం । ధీమహిగోపీమానసనిలయం

1. గగనపవనముఖభూతనిధానం । ప్రియతమమాగమమృగితమహైనం॥ శ్రీ

2. యదభిసృజతి జగదవనపునాతి । గ్రసతిచిదాత్మతయాసువిభాతి॥ శ్రీ॥
3. దివ్యతనుమజరమమరమసంగం । అంతర్బాహ్యాతతంజగదంగం॥ శ్రీ॥
4. అనుకలితశ్రుతివాచమధీశం । దినకరశశధరలోచనదేశం॥ శ్రీనిలయం॥

అందఱు—ఆహాహా! ఎంతచక్కని పాట.

సౌభా—పాటలో నేమున్నది? చింతామణి స్వరములో నున్నది. ఆహా?

బిల్వ—ఆహా! వీణారవమో కంఠస్వరమో తెలియకుండ రెండును మేళవించి పాడినది.

సౌభా—ఓహోహో! సంగీతము! సంగీతము రాని పశువును నేనుగూడ నానందింపఁగల్గితిని.

రమ—నాకు సంగీతము తెలియకపోయినను తెలిసినవారికంటె నానందించుట లోభునుఁడను.

భీమ—నాకీసంగతి మొన్నటి గానసభలో నీతలత్రిప్పులు చూచినప్పుడు తెలిసినది. అవును. మీరు బాగుగా నానందింతురు.

మంగ—[ప్రవేశించి] సోదరులారా! ఇదియంతయు నేమో నాకుఁజెప్పవచ్చునా?

భీమ—[కోపముతో] ఆఁ! ఎవరునీవు?

రమ—ఈముష్టివాఁడెవ్వఁడు? ఓరీ! నీవెవ్వఁడవురా?

మంగ—మీరందఱు నిక్కడ నేమిచేయుచున్నారు?

సౌభా—తిని పాటలు పాడుకొనుచున్నాము.

మంగ—శ్రీకృష్ణతరంగములా పాడుచున్నవి?

బిల్వ—ఓరీ! శ్రీకృష్ణుఁడెవఁడురా? ఇక్కడఁ బ్రేమసంభాషణములెక్క నితరము లేదు. మాకురాత్రిలు ప్రేమగాథములు న ఆనందస్వరూపములుగను నున్నవి. చింతామణిపాట సకల చింతాపహారిణియై శ్రవణానందమిచ్చుచున్నది.

మంగ—అవునవును. నాకుఁ దాత్పర్యమైనది. ఇప్పుడీమె పాడినది శ్రీకృష్ణలీలా తరంగమే.

రమ—అరే! కృష్ణుఁడెవఁడురా? ప్రియతమయు నఖండసౌందర్యవిలాసినియునైన చింతామణి మృదు మధురగానము చేయుచుండుట కంటికగపడుట లేదా? గుడ్డివాఁడవా?

మంగ—ఛీ! ఛీ! ఇది వేశ్యయగు చింతామణియా! మూర్ఖులారా! చింతామణియనఁ బరబ్రహ్మము. ఎవని యనంతకరుణావలోకనములలో నానంద స్వర్గమున్నదో యట్టి పరమేశ్వరునకే చింతామణి నామ మన్వర్థము. ఏమి యుత్తమ పదార్థమున్నదని నేతిబీరకాయవంటి దీనిని మీరు ప్రేమించుచున్నారు. ఈ మాయారూప ధారిణికి వశ్యులై దాసులై సంచరించుచున్నారా? మీయంత మీరు యమాగారమున కతిథులగుచున్నారు. ఈమాయను దొలఁగించుకొనుఁడు. పరమాత్మయందు దృష్టి నిలుపుఁడు.

సాభా—స్వామీ! ఈమెను చింతామణి యని పిలువకున్న నింకేమని పిలుచుట? అమ్మమ్మయనియా-అమ్మయనియా-కూఁతురాయనియా-అవ్వాయనియా-పెదతల్లియనియా-పినతల్లియనియా-

మంగ—ఓరి మూర్ఖుఁడా! వేశ్యాప్రేమను విడిచి బ్రదుకుము. కోమలముగా నున్నదని పామును ముద్దువెట్టుకొనకుము.

బిల్వ—ఓహోహో! ఏమి ఘనోపన్యాసము! స్వామీ! ఈయుపన్యాసార్థమేమి?

మంగ—అర్థమా! మీకుఁ దెల్పుట వ్యర్థమే. అయినను జెప్పెదను. మాతుల మీఁద మీసములు మగవారికుండునా యాఁడువారికుండునా!

బిల్వ—నీయుపదేశము లిఁకఁ గట్టిపెట్టుము.

మంగ—ఓయి మూర్ఖుఁడా! నామాటవిని సుఖపడుము.

బిల్వ—మాటలు మిగిలినఁ దన్నులు తిందువు. జాగ్రత్తసుమా!

రమ—సోదరా! వీనితోనేమి? వీఁడుపిచ్చివాఁడు. ఓరీ! నీవిచ్చట గూర్చుండి గానమువినుము. చింతామణీ! కానీ.

చింతా—(గానముచేయును)

శ్రీనిలయం సఖ శ్రీనిలయం । ధీమహిగోపీ మానసనిలయం ॥పల్లవి॥

1. విశ్వహృదయ మవనీ పదమాదిం । ప్రాణితయా పరిపీత మనాదిం ॥శ్రీ॥
2. విశ్వనగర వరరాజ మరాజం । వివిధ కలాకృత జీవ సమాజం ॥శ్రీ॥
3. మహదపరపరం బృంహితభావం । నిజకలయా పరిహృత భవభావం ॥శ్రీ॥

4. వ్రజయువతీ జనకృత పరిహాసం । వనభువి మునివర హృదయ నివాసం ॥శ్రీనిలయం॥

అందఱు—వహ్వా! వహ్వా! ఏమిగానము! ఏమిగానము!

మంగ—ఆహాహా! ఓహోహోహో! ఏమి శ్రావ్యగానము! శ్రీకృష్ణచింతామణీ గానామృతము వర్ణనాతీతము కదా! (నవ్వుచున్నాఁడు).

భీమ—ఏమిరా! బికారీ! మొట్టమొదట దీని నిందించితివే. ఇప్పుడేమయినది నవ్వుచున్నావు!

అందఱు—(నవ్వుచున్నారు.)

మంగ—సోదరుఁడా! నానవ్వున కర్థము వేఱు.

బిల్వ—అర్థము వేఱా! అదేమో తెల్పుము?

మంగ—ఇదిగోఁ దెల్పుచున్నాను వినుము. మహామాయా పేటికయైన యీవేశ్యాంగన ప్రేమయందు మోహితులై మీరెల్లు కాలము వృథచేయుచున్నారు. దీనికేదో గొప్పప్రీతిఫల మున్నదనుకొని మతిలేక కొట్టుకొనుచున్నారు. వేశ్యయైన చింతామణి నిజమైన కామదేవతకాదు. ఏమహామాయ మీకొకసుందర పుష్పమువలెనగపడుచున్నదో యదియే నిజముగు నరకప్రదాయిని. పయోముఖ విషకుంభమని చెప్పవచ్చును. దీనిసంసర్గమున నరకప్రాప్తి తప్పదు. దీనిదుర్గుణ వ్యాధులకేమియు మందులులేవు.

బిల్వ—ఆఁ! ఏమిది! మరల రసభంగసంభాషణమా! ఏమిరా! మూర్ఖా!

భీమ—ఓరి పరమమూర్ఖుఁడా! నరకముపేరుచెప్పి మమ్ముబెదరించుకొనఁ జూచుచున్నావా?

రమ—జేబులు చూచుకొనుఁడు-వీఁడు దొంగవలె నున్నాఁడు.

మంగ—అధములార! మోహాగ్రహ పీడితులారా! ఏమి ప్రేలుచున్నారురా! పాపాత్ములారా!

బిల్వ—ఆఁ! ఏమని ప్రేలుచున్నావు! పాపాత్ములమా! అధములమా! ఓరి చండాలుఁడా! నోరుమూయుము.

మంగ—ఓరి యజ్ఞానీ! ఒక్కదానిలోఁగాదు, మీరన్నిటను బాపాత్ములే. వర్షము-మాసము-దినము-గంట-క్షణము-వీనిలో భేదమేమైన మీకుఁదెలి

యుచున్నదా? సంసారము స్వప్నమువంటిది. అందేమియు సుఖము లేదు. శ్రీకృష్ణ పరమాత్మను మఱచి కామక్రీడలందేలు పాపునకు-నీ వంటి నిర్భాగ్యున కెండయేకాని నీడయెంతమును లేదు. అజ్ఞానాంధకార పరివృతుఁడవైన నీకు నా జ్ఞానబోధామృతము విషప్రాయమగును. సన్నిపాత జ్వరపీడితునకుఁ దీయని పంచదార చేదగునట్లు నీకు రుచింపదు.

బిల్వ—వెళ్ళు వెళ్ళు నీయుపదేశ మెవ్వరికి నక్కఱలేదు. శీఘ్రముగాఁ బొమ్ము. లేదేని.—

మంగ—ఓరి మూర్ఖుఁడా! వీరందఱు నీకు సరిపడినమిత్రులు. జ్ఞానబోధ చేయు నేను నీకుఁబనికివత్తునా? ప్రపంచమంతయు మాయావృతము. వీరందఱును స్వార్థపరులై ధనము చేతనున్నంతవఱకును మిత్రులమని యెప్పటి కేది ప్రియమో దానికనుకూలముగాఁ బ్రవర్తించుచుందురు. ఆధనము తొలఁగినపిమ్మటఁ గంటికెవ్వరును గనపడరు. నోటితోనొక్క చల్లని మాటకూడ మాటాడరు. నామాటవిని బాగుపడుము. ఈదుస్సాంగత్యము విడువుము.

రఘు—వీఁడు నీచుఁడు-పరమనీచుఁడు ఈగ్రష్టుని గొట్టుఁడు-

సౌభా—కొట్టుఁడు! కొట్టుఁడు!! తన్నుఁడు! తన్నుఁడు!!

(కొట్టుచున్నారు.)

మంగ—అయ్యో! చంపివేయుచున్నారు. చంపివేయుచున్నారు. శ్రీకృష్ణా! వ్రజవల్లభా!

అందఱు—(లాగికొని పోవుచున్నారు.)

3. రంగము—బిల్వమంగళుని గృహము.

[మాయాదేవి ప్రవేశించుచున్నది.]

మాయా—ఆహా! పుష్పోద్యానము వసంతఋతువు నందెంతపరిమళవంతముగా నున్నది. వసంతుఁడు నిక్కముగా ఋతుసార్వభౌముఁడనఁ దగినవాఁడు. మందమారుతస్పర్శచే లతలుకదలింపఁబడి పుష్పముల రాల్చుచున్నవి. పిచుకల కిచకిచధ్వని-కోకిలారావములు-నీటికోయిలల కూజితములు-

వీనిచేనెంతయు నానందదాయకముగానున్నది. కాని దుఃఖసముద్రమున మునిఁగిన వారికివి యేమి సుఖదాయకము? అంధులకు వీనితో నేమిలాభమున్నది? ఆడుచుఁ బాడుచు హాయిగా సంసారము గడపుచున్న వారి కీసమస్తమును సుఖప్రదముగాఁ దోఁచును. ఏభాగ్యహీనురాలికిఁ దనపతివలన సుఖములేదో యట్టిదానికిఁ బ్రపంచమంతయు నిజమైన స్వర్గమేయైనను నరకతుల్యముగాఁ దోఁచును. అయ్యో! నేనెట్టి కొఱనోములు నోచుకొంటినో కదా! ఇట్లే యబలయొక్క భర్తయుఁ గోపముతోనుండుటఁ జూడలేదు. నాప్రాణప్రియుఁ డొక్కనాఁడైన నిటుతొంగిచూడనైనఁ జూచుటలేదుకదా! ఆయన ముఖసందర్శనమైనఁ బ్రతిదినమును జేయకుండ బ్రదుకఁజాలను. ఇంకను రాలేదే. నేఁడింత యాలస్యమునకుఁ గారణమేమో! వేశ్యాగారమున నేమియు వింతలు పుట్టలేదుకదా! వచ్చుచున్నారేమో చూచివచ్చెదను. (వెళ్ళును.)

మంగళుఁడు—(ప్రవేశించి) ఆహాహా! ఏమిచిత్ర మేమిచిత్రము! ప్రపంచమెంత తలక్రిందయిపోయినది. సదుపదేశము చేసినందులకు ఫలము చెప్పుదెబ్బలుతినుటా! అవును. అంధులకు బోధించుట పరాభవముకొఱకే (చూచి) ఈగృహము నాకు బహుమతులిచ్చిన మహానుభావునిదే. ఔరా! ప్రపంచమంతయు మహామాయామయమైనదికదా! మొలకుఁ బట్టుధట్టీలు తగిల్చికొని యిటునటు తిరుగుచున్న కర్మచారులును మేలిముసుఁగుఁ దీసివేసిన దాసీస్త్రీలును బుష్పాలంకృతమైన పాన్పును ఉత్తమ వస్త్రములును అమూల్యాభరణములును గలిగి యీమహాభవనము చెలువాఱుచున్నది. కాని, యిందు "శాంతి"యను నమూల్యపదార్థము లేకపోవుటచే నంతయుశ్మశానము గతిఁ గన్పట్టుచున్నది. (ఎదురుచూచి) అతఁడేవచ్చుచున్నాఁడు. అయ్యో! ఎంతదుఃఖ మెంతదుఃఖము! ఒక బ్రాహ్మణపుత్రున కిట్టిదశయా! ఈనడతయా! చాలుఁజాలు! నేనింకఁ బోయెదఁగాక! ఉన్నచో రెండవసారి చెప్పుదెబ్బల బహుమానము తప్పదు. ఆహా! కాలమహిమ!

గీ. పరుల కుపదేశములుచేయు వారిబ్రదుకు
పామరకులచే గౌరవంబుఁగాంచు

గాలమా! యెట్టిమర్త్యవృత్తి గవిసెనిన్నుఁ
గలియుగంబెంత పాపసంకలితమయ్యె.

(నిష్క్రమించుచున్నాఁడు)

[బిల్వమంగళుఁడు-మాయాదేవి ప్రవేశించుచున్నారు]

బిల్వ—మాయా! నేఁజెప్పునదేమనఁగా నాకొఱకై నీసుఖము లాహుతి చేసికోవలదని-నీవు సంసారసుఖము లందనెంచినయెడలనన్ను విడిచిపెట్టుము.

మాయా—మిమ్ము విడిచిపెట్టుటా నాథా!

బిల్వ—అవునన్నే.

మాయా—నాథా! విడుచుట యెవరిని?

బిల్వ—నన్నే.

మాయా—నాప్రాణప్రియులగు మిమ్మా?

బిల్వ—అవును నన్నే.

మాయా—సంసారసాగరమునుండి తరింపఁజేయు పుణ్యమూర్తినా? అయ్యో! ఈమాటలేమి నాథా!

బిల్వ—అవునాపుణ్యమూర్తినే విడిచిపెట్టుము.

మాయా—నాథా! జీవనయాత్రలో మార్గముఁ జూపించు ప్రకాశమునా విడుచుట!

బిల్వ—నీకట్లు విడువవలసియున్నది.

మాయా—నాథా! ఇవి యేమిమాటలు! నేను బ్రదికియుండుట మీకిష్టము లేదా? ఏహైందవసుందరియైన నిట్లుచేయఁగలదా? దాహముచేఁ జచ్చుచున్నవానికి స్వర్ణపాత్రయందలి యమృతమే యక్కఱలేదు. రెండు నీటిబిందువులుమాత్రమే యొడుచున్నవాని గొంతుకలో వేయుటచే వాఁడు బ్రదుకును. ఎక్కువ యక్కఱలేదు. మీరునన్నుఁ బ్రేమతోఁ జూచుచుండుఁడు. నేనంతమాత్రముచేతనే బ్రహ్మానందభరితురాలనయ్యెదను.

బిల్వ—మాయా! నీవతిసుందరివి. అత్యంతసుందరివనియుఁ జెప్పవచ్చును. సంగీతకవితాచిత్రలేఖనత్రయముచే నుత్పన్నమగు సుందరతమపదార్థమునకంటెను నీవత్యంతసుందరివి

మాయా—నాథా! మీరు నామీఁదిదయచే నిట్లనుచున్నారు గాని మీరు నుడివిన విశేషము నాయందు నిజముగాలేదు.

బిల్వ—మాయా! నేనువాస్తవమునే వచించుచున్నాను. ఇదతిశయోక్తి లేదు.

చ. ఇనసమతేజముఁ శశికి నీడగుకాంతియు గంగఁబోలు పా
వనతయు నచ్ఛమైభరత వర్షముఁబోలిన మానగౌరవం
బును సొగసైనయిఁద్రధను వుంబలెఁ జాలమనోహరత్వముం
దనరఁద్రిలోకసుందరి వనందగుదానవు నీవుకోమలీ!

మాయా—నాథా! మీకిట్టి యభిప్రాయమే యున్నయెడల నన్నేల యాదరభావముతోఁ జూడకున్నారు?

బిల్వ—మాయా! నీవిట్టియసాధారణసాధ్వీలలామవేయైనను నిన్ను నేను బ్రేమింపఁజాలకున్నాను.

మాయా—ఎందుచేతను నాథా!

బిల్వ—ఎందుచేతనో నాకే తెలియదు.

మాయా—అయినప్పటికిని—

బిల్వ—దీనికంటె నాకెక్కువ తెలియదు. కానీవు నాయందతిప్రేమకలదానవని మాత్రము నేనెఱుంగుదును. అయినను లాభమేమి? నిన్నుఁ బ్రేమింపజాలను. నిన్నుఁ బ్రేమింపవలయుననియే కోరుచుందును-కాని, నామనసు నీయెడకుఁ దిరుగకున్నది. నన్నేమిచేయుమందువు!

మాయా—నాథా! దీనికేమికారణము? నేనుమనోవాక్కాయ కర్మములచే భారతధర్మమునకుఁగాని హైందవస్త్రీజాతికిఁగాని యేమైనఁ గళంకముఁ దెచ్చితినా? నాయెడల మీరెట్టిదోషమైనఁ గనిపెట్టితిరా?

బిల్వ—అయ్యో! మాయా! నీవిట్టులన్న నేనువినఁగలనా?

గీ. నలినబంధునికాంతి నుష్ణతయుఁ జంద్ర
కాంతితోడఁగళంకు, లతాంతసౌర
భంబుతో ముండ్లునుండుఁగాకంబుజాక్షి!
లేదుదోసంబు నీయందు లేశమైన.

దోషమేమైన నీపయి నారోపింపవలయునన్న నీవు నిష్కళంకురాలవగుటయే యొకగొప్ప దోషముగాఁ జెప్పవలయును. మాయా! ఇంతటిపుణ్యశీలవే

యైనను నిన్నుఁ బ్రేమింపఁజాలను. ఓసౌందర్యరాశీ! నిన్నుఁ బ్రేమింపఁజాలను.

మాయా—ప్రాణప్రియా! మీరేనన్నుఁ బ్రేమింపకపోయిన నాకీప్రపంచమున నేమున్నది?

బిల్వ—నేనుదప్పఁ దక్కినవన్నియుఁ గలవు.

మాయా—కాని నాథా! నాసర్వమునుగూడ మీరేకదా! నాథా! ఇటు చూడుఁడు నావైపుచూడుఁడు. ఏప్రకారము భూమి తనపట్టణములను పర్వతములను సముద్రములను వెంటఁబెట్టుకొని సూర్యుని చుట్టును దిరుగుచున్నదో యట్లే నాయాత్మకూడ నన్నికోరికలతోడను నిర్వ్యాజమైన భక్తితోడను మీచుట్టును విడువక తిరుగుచున్నది. మీరు నవ్వినప్పుడు సూర్యుఁడుదయించినట్లుండును. పెడమొగము పెట్టినప్పుడు ఘోరాంధకారముగానుండును.

బిల్వ—మాయా! అన్నియు నిజమే. నిన్నుఁ బ్రేమింపవలయునని లక్షోపలక్షలు ప్రయత్నములు చేయుచున్నాను. కాని, చింతామణికిఁ దనప్రేమ సర్వమును ధారపోసిన యీబిల్వమంగళునియొద్ద నిన్నుఁ బ్రేమించుట కేమియున్నది? ఆచింతామణిని బ్రేమించిన క్షణమునుండియు నాబుద్ధిబలముఁ బోఁగొట్టుకొంటిని. దానిని దర్శింపనిదే యొకనిముసమైన నాకుసుఖము లేదు. నామనస్సును మరల్పఁ జూచుచుందునుగాని యది చలించుటలేదు. చింతామణియందే సర్వథా లగ్నమైయున్నది. నీవతిత్వరితముగాఁ జింతామణికడ కేగుమని గెంటుచున్నది. ఇట్టిసందర్భమున నీకెట్టియుపకారము చేయఁగలను? నూతిలో నొక్కచుక్క నీరులేదే! దానినెట్లునింపఁగలను.

మాయా—నాథా! అట్లనకుఁ డట్లనకుఁడు. మీరునాకు స్వామియుఁ బ్రాణాధారులునై యున్నారు.

బిల్వ—కాని, వీనినొకసుందరవేశ్య తనదాసునిగాఁ జేసికొన్నది.

మాయా—మీరునాకుఁ బ్రాణాధికభూషణమై యున్నారు.

బిల్వ—చింతామణి యింటవార్లమండు భూషణమనుము.

మాయా—సాధర్మ్మమే మీరు.

బిల్వ—చెడిపోయిన ధర్మము.

మాయా—నా భాగ్యమే మీరు.

బిల్వ—అయ్యో! భాగ్యము బద్దలైనది.

మాయా—నా మొక్క యాశ—

బిల్వ—భగ్నమైనది.

మాయా—నా ప్రపంచమే మీరు.

బిల్వ—నాశనమైనది.

మాయా—(కన్నీళ్ళతో) నాథా! ఇవియేమిమాటలు. ఈదీనురాలి ముకుళిత హస్తములపైనైన దయచూపుఁడు. నన్నాదరింపుఁడు. నన్నుఁ గష్టపెట్టకుఁడు. నాథా! మీచరణదాసిగా నేలికొనుఁడు. నేను బహుకష్టముల ననుభవించితిని. నాకింకను ఘోరకష్టములు కల్పింపకుఁడు. మిమ్ముదోసిలి యొగ్గి ప్రార్థించుచున్నాను. (ఏడ్చును.)

బిల్వ—చాలుఁజాలు! వెళ్ళిపొమ్ము. అధికముగా నేడ్చి నన్ను వేధింపకుము. నీయేడ్పుమొగము నేనుజూడలేను. నీవు శీఘ్రముగా నిచటినుండి పోనియెడల నేనేపోయెదను.

(నిష్క్రమించుచున్నాడు.)

మాయా—హాదైవమా! హా! నాథా! ఎంతకష్టము. తండ్రి దశయట్లున్నది. పుత్రుని దశయిట్లున్నది. కటకటా! దుర్భరము. ప్రాణనాథా! పోయిరండు. మీరు భార్యను దుఃఖపెట్టి సుఖము లనుభవింపలేరు. సర్పమును జేతులలో నుంచుకొనుటవలన నేమి హానికలుగునో యాలోచించుకొనుఁడు.

(తెరవాలును.)

4. రంగము—చింతామణి మహలు.

[చింతామణి గానముచేయుచుఁ బ్రవేశించుచున్నది.]

కేదారగౌళరాగము—ఆటతాళము.

చింతా—పల్లవి: కలయ యశోదే తవబాలం । ఖలబాలకఖేలనలోలం॥

1. అపహృతబహుతరనవనీతం । అనుపమలీలానటనకృతం
కపటమానుష బాలకచరితం । కనకకందుకఖేలననిరతం॥

2. పక్షిపక్షిలుంఠిత దధిభాండం । పాపతిమిర శతమార్తాండం।
అధిక బలోద్ధృత జగదండం । ఆనంద బోధరస ఖుఖాండం॥

3. మల్లబాలక ఖేలనచతురం । మనసిజకోటి లావణ్యధరం
కళ్యాణగుణనవమణినికరం । కమనీయకౌస్తుభమణిశేఖరం॥

ఓలోకమా! నీ వేల నాయౌవనముఁజూచి భ్రమించుచున్నావు. అయ్యో! దీని నెట్లు దాచియుంతును? మధుమక్షికయైనను నాయౌవనమధువుఁ గ్రోలకుండుఁగాక! "ప్రియా! ప్రియా!" అని కొందఱునన్నుఁ బిల్చుచుందురు. నాయౌవన సౌందర్య మెవ్వని మనస్సునాకర్షించునో వాఁడు సర్వదా దుఃఖమయమైన నిట్టూర్పు విడుచుచుండును. ఆహా! ఏపైపునఁజూచినను నారూప ప్రశంసయే. ఎక్కడఁజూచినను నాచర్చయే.

సీ. అగ్నిసాక్షిగఁ బెండ్లి యాడిన యిల్లాలు
మలమలచింతచే మఱుఁగుచున్న,
అఱచేత నప్ప మట్లరసి పెంచినతండ్రి
ఘనమనోవ్యథఁ జిక్కి వనరుచున్న,
బాల నిచ్చినవారు బహువిధంబులఁ దమ
పుత్రియవస్థకై పొగులుచున్న,
ప్రాణమిచ్చెడు సుహృద్రత్నముల్ తమ హితో
క్తులు వినఁడనిలోనఁ గుందుచున్న,
గీ. నన్నువిడువక యైన ప్రాణములుఁగూడ
నాపయిని బెట్టుకొని మదానందనిలయుఁ
డగుచు నున్నాఁడు నిష్కల్మషాత్మ, బిల్వ
మంగళుఁడు నేఁడు మన్మథమన్మథుండు.

సేవకుఁడు—(ప్రవేశించి) అక్బరుచక్రవర్తి సేనాపతి వాకిట నిల్చియున్నాఁడు.
చింతా—సత్కరించి తీసికొనిరమ్ము.
సేవ—(నిష్క్రమించి సేనాపతితోఁ బ్రవేశించుచున్నాఁడు.)
చింతా—అయ్యా! నమస్కారము. దయచేయుఁడు. నాయదృష్టము ఫలించుటచే మీరు దయచేసితిరి.
సేనాపతి—ఓకీర్తిశాలినీ! నీపేరు నేను బ్రఖ్యాతముగా వినుచున్నాను. మూఁడు

దినములక్రిందఁ గొందఱు దోపుడుదొంగలు చక్రవర్తిగారి ధనాగారమును బ్రవేశించి వజ్రములు మణులు మొదలగువనంతధనసంచయంబును దొంగిలించిరి. వారినిబట్టుకొనుట యత్యావశ్యకము. ఇది రాజకార్యమగుటచే నిచ్చటికి వచ్చితిని.
చింతా—కేవల మీపనికొఱకే మీరాక—
సేనా—అవును. ఆదొంగలను బట్టుకొనువారికి లక్షరూపాయలు పారితోషికమీయఁబడును.
చింతా—అయ్యా! ఈకార్యము శ్రద్ధతో నెఱవేర్చెదను. పక్షినై యాకాశమున నెగిరిపోయెదను. చేపనై జలమునందుఁ దిరిగి పరిశోధించెదను. చోరులను దప్పక పట్టి తీసికొనివచ్చెదను.
సేనా—మీవలన నీసహాయము దొరకుననియే యాశకలదు. మంచిది. నేనింకఁబోయి వచ్చెదను.
చింతా—చిత్తము. నమస్కారము.
సేనా—(నిష్క్రమించుచున్నాఁడు.)
చింతా—ఆహా! ఇంకనేమి! ఇప్పుడు నాయైదువ్రేళులును నేతిలోబడ్డవి దొంగలను బట్టుకొందునుగాక! ధనములో మునిఁగి తేలుదుఁగాక! అన్నా! నానగలభరిణెఁ దీసికొనిరా.
అన్న—(ప్రవేశించి) చింతా! నీవు యౌవనభారమునే మోయలేకున్నదానవు. నగలపెట్టె యెందులకు? ఈపుష్పహారము తేలికగానున్నది. దీనిని ధరింపుము. (పూలహారమిచ్చును.)
చింతా—(హారముఁగైకొని ధరించును.)
అన్న—(నిష్క్రమించును.)
చింతా—ఆహా! నాయౌవనమెంతయమూల్యమైనది. ఎక్కడఁజూచినను నన్ను మోహించువారే.

[బిల్వమంగళుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

బిల్వ—(స్వగతము) ఆహా! బాగారు బొమ్మయైన చింతామణిపై నెంత సౌందర్యరసము ప్రవహించుచున్నది. మందారపుష్పముపైఁ దేనెటీఁగ వ్రాలిమధువుఁ గ్రోలుచున్నదాయనునట్లున్నది. శిరముమీఁదివి కురులో లేక ప్రేమ

దేవత నయనమత్స్యములను బట్టుకొనుటకై వేసిననీలజాలములో తెలి యకున్నవి. ఆహా ! ఈమెయందము వర్ణింప నలవిగాకున్నది.

మ. అదిరా ! యీమె మనోహరాంగముల సా రత్యంత కౌతూహల
ప్రదమైయొప్పెడుఁ గోకిలాస్వరమనన్ భాసిల్లు నాలాపసం
పద, నిక్కంబు త్రిలోక సుందరియె, మ ద్భాగ్యంబునన్ లభ్యమై
నదిగా కీమెలనాగఁబోలఁగలరే ? నాకాంగనల్ సైతమున్.

చింతా—(అద్దముఁజూచికొని) ఇప్పుడు నాయౌవనకాంతికి చంద్రుఁడుకూడ నోడిపోవుచున్నాఁడు. చెవియందలికమలము కదలి యెట్లుశోభాయమాన ముగానున్నదో !

బిల్వ—(స్వగతము) పాపము ! అద్దమాప్రకాశమును బట్టలేక బ్రద్దలగును నేమో యని భయపడుచున్నది.

చింతా—నాశిరోజము లెంతచక్కఁగా వర్ధిల్లినవి.

బిల్వ—(స్వగతము) చందనవృక్షమునుండి వ్రేలాడు ఫణివలె నీవేణి కన్పించు చున్నది.

చింతా—కేశపటల మధ్యమునందలి పాపిడి యెంత బాగుగా దిద్దఁబడినది !

బిల్వ—(స్వగతము) యమునామధ్యమున సరస్వతీనది ప్రవహించునట్లీ పాపిడి దిద్దఁబడియున్నది.

చింతా—రాధ అవికలెన్నిసారులు కుట్టినను బిగువుగ నేయున్నవి.

బిల్వ—(స్వగతము) అది వదులుగనే కుట్టుచున్నది. కాని ప్రతిదినవర్ధమా నాంగకములచే బిగువగుచున్నవి.

చింతా—తెలివితక్కువరాధకింకఁగుట్టుపను లీయరాదు. దీనికిగర్వమధికమైనది.

బిల్వ—(ప్రకటముగా) ప్రియా ! చింతా !

గీ. ప్రతి దివస వర్ధమానాంగ వితతిచేత
రాధ నేరుపుమైఁగుట్టు అవికలెల్ల
బిగు వగుచునుండనేకాని వేఱుకాదు
దాని నన నేమిటికి ? శర ద్రాజవదన !

చింతా—ఆహా ! ఏమిది ! అమావాస్యనాఁడు చంద్రుఁడు వచ్చెనే. ఇట్టి ఘోరాంధకారమున నీకు దారిఁజూపించినవారెవరు ?

బిల్వ—ప్రియా ! నాహృదయమందు నీచిత్రపటము నిరంతరమును గలదు. ఈ దారినాకు మనోగోచరము. ప్రేమదేవతయే నన్నిక్కడికి తీసికొని వచ్చినది.

చింతా—(స్వగతము) వీనిప్రేమఁ బరీక్షింతుఁగాక ! (ప్రకటముగా) పొమ్మా ! ప్రియా ! పొమ్ము ! ప్రేమమార్గము చాలఁగఠినమైనది. ఆనలకుఁబొమ్ము. నీమనస్సు చెదఱఁగొట్టకొనకుము. మార్గమునఁ గాలికి దెబ్బలుతగిలిం చుకొనకుము.

బిల్వ—ప్రియా ! నీవు ప్రేమపరీక్ష చేయుచున్నావా యేమి ? స్పష్టముగాఁ జెప్పుము. ప్రేమయన నెట్టిదో నీకుఁ దెలియఁజేసెదను.

చింతా—నిజమగు ప్రేమఁ జూపించువారు వేఱు. ఒక చిన్నమాటమీఁదఁ బ్రాణమర్పించువారు వేఱు.

బిల్వ—అవును. నిజమే. అట్టిప్రియులు వేఱు. నాప్రేమనిప్పుడు చూడుము. నీవు నీచేతికత్తితో (బొమ్మచూపి) నాహృదయమును జీల్చి నారక్తవాహి నిలో విహరింపుము.

చింతా—ఆఁ ! ఆలాగాఁ !

బిల్వ—అవును. ఆలాగే—

చింతా—అట్లయిన దీనిఁ దీసికొనుము. (కత్తి చేతికిచ్చును).

బిల్వ—(కైకొని) చింతా ! దీనితో నేనిప్పుడేమి చేయవలసియున్నది ?

చింతా—ఈకత్తినిగొని నీభార్యశిరస్సు ఖండించి తెచ్చి నాకిచ్చినచో నీవు నాతోనెల్లప్పుడు నుండఁగలవు. నన్నే నీప్రాణప్రియనుగాఁ జెప్పుకొనఁ గలవు.

బిల్వ—నేఁజేయవలసిన దింతేకదా ! నీప్రేమకంటె నాకీలోకములో ఘనపదా ర్థమేమున్నది? చింతామణీ !

మ. నవనీరేజదళాయతాక్షి ! వినుమా నాభార్యకంఠంబు శ
స్త్రవినోదంబుగఁదున్మి నీకొఱకు నా ప్రాణంబులర్పించెదన్
నవలా యొక్కతెఁగాదు వేవురయినన్ దాక్షిణ్యమున్వీడి కై
దువుఁ జేఁబూనివధించి నీదయకుఁ బా త్రుండన్న పేరొందెదన్॥

(వెళ్ళఁబోవును)

చింతా—(ఆపి) చాలు! చాలు! ప్రియా! చాలు! చాలు! నీప్రేమఁబరీ
క్షించుటకై యిట్లుచేసితిని

బిల్వ—పరీక్షకొఱకా! ఇదియేమిమాట! ప్రియా! నీప్రేమరసపూరితమైన
నయనామృత మొకగిన్నెఁడు గ్రోలవలసివచ్చునని నాకుఁదెలిసినచో
నేను బ్రాహ్మణగృహమందు జనింపక యొకవీరక్షత్రియకులమందఁ
బుట్టియుందును.

చింతా—ప్రియా! ఎందుచేత నిట్లనుచున్నావు?

బిల్వ—ప్రియా! వర్షఋతువునం దత్యానందముతోఁ గదలు పుష్పముల
మీఁద మంచుబిందువులు పడి యెంతమనోహరముగాఁ గన్పట్టునో యం
తమనోజ్ఞముగా నీసుందర వదనారవిందముమీఁద గెంపులవలె నీకన్ను
లు మెఱయుచున్నవి. ఈ యమూల్యములగు కెంపులను సర్వదా నా
యెడకుఁ బ్రసరింపఁజేసికొనుటకు భుజబలశౌర్యప్రధానుఁడనగు రాజ
కుమారుఁడనైనఁ గొంత మేలుగానుండునని యట్లంటిని.

చింతా—నీవిట్టి యభిప్రాయము వెల్లడించినచో నీవు పిచ్చివాఁడవనియెంతును.

బిల్వ—చింతా! నేను బిచ్చివాఁడనుగానని నీకేమైన సందేహమున్నదా?
ఓసి వెఱ్ఱిదానా! నీవు గాఢనిద్రాపరవశురాలవైనప్పుడు నీతలయొద్దఁ
గూర్చుండి రేయంతయు నీముఖసౌందర్యమే చూచుచుందును. నీవు
నిద్రలో గట్టిగా నూపిరివిడిచినను గొంచెము కదలినను భయముచే
వణఁకుచుందును. నీవు మాటాడుచున్నప్పుడు నాయాత్మయం దెవ్వరో
యవ్యక్తమధుర స్వరముతోఁ బాడుచున్నట్లు తోఁచును.

చింతా—ప్రియా! వలదు. వలదు. నీవెఱ్ఱిప్రేమ నీ నిష్కళంకప్రేమ నీదయా
స్వరూపము నాహృదయ మాకర్షించినది. రాత్రింబవళ్ళు మైమఱచి
యగాధమైన నీప్రేమార్ణవములో నీదులాడుచున్నాను. నీమాటయే
నాకమృతధార.

బిల్వ—చింతా! నన్ను వేళాకోళము లాడుచున్నావా? ఎవరు ప్రేమాంధ
కారమునఁబడిరో నీవే చెప్పుము.

చింతా—ప్రియా! నేనే ప్రేమాంధకారమున ముందుగాఁ జిక్కితిని. నేనే
యోడిపోయితిని. నీవే గెల్చితివి.

బిల్వ—మనలో నెవరుగెల్చిన నొక్కటేకదా! ఇరువురమును గెల్చినట్లే.

చింతా—ప్రియా! నాహృదయానందము నేమని చెప్పుదును.

బిల్వ—చింతా! నీవు వేఱుగఁ జెప్పవలయునా?

గీ. ప్రేమ రసరూపమైన యా రామసీమఁ
ప్రాణ మొక్కటి రెండు దేహములనంగ
మనము విడువక విహరింత మనుదినంబు
మహి మహేంద్ర లోకంబుగా మార్చివైచి.

(కౌఁగిటంజేర్చును)

తెర వాలును.)

ఇది ప్రథమాంకము.

శ్రీ

ప్రబోధచింతామణి.

ద్వితీయాంకము.

1. రంగము:—పర్వతములమధ్యఁ గాళికాదేవిగుడి.

చింతామణి శక్తివేషముతోఁ గాళీవిగ్రహము వెనుక డాగియుండును.

[కొందఱు దొంగలు పాటపాడుచుఁ బ్రవేశించుచున్నారు.]

ఒకదొంగ—ఓ దేవీ ! ఇదిగో సేవ. మేమందఱము నీ సేవకులము. ఓమాతా ! మాదుఃఖమునంతయుఁ బాపుము. మేము నీచులము. మా యాశలన్నియుఁ బూర్ణము కావింపుము. సొమ్ముదోచి తెచ్చి నీకర్పింతుము. మాబలిని గ్రహించి దాసులమగు మమ్మందఱిను రక్షింపుము.

సర్దారు—నాయనలారా ! ఇప్పుడు నైవేద్యమర్పించుట కాలస్యమెందులకు?

అందఱు—పూజారి రాకయే యాలస్యము. మహాప్రభూ !

పూజా—(ప్రవేశించి) పరమహితకారులకు జయము ! పూజారియాలస్యము లేదు. పూజాసామగ్రి తీసికొనిరండు. ఉపహారములుకూడఁ దెండు.

సర్దారు—(చేతులు జోడించి) దేవీ ! నీదాసులయర్పణము స్వీకరింపుము. "కాళీమాతకు జే"యని యందఱు ననుఁడు.

అందఱు—"కాళీమాతకు జే-కాళీమాతకు జే," (ఉపహారములర్పింపఁబోవుదురు.)

చింతా—(దేవీరూపముతోఁ బైకివచ్చి) వలదు. వలదు. ఆగుఁడు. ఆగుఁడు. ఇప్పుడు నైవేద్యము చేయవద్దు.

సర్దారు—ఆహా ! సాక్షాద్దేవియే ప్రత్యక్షమైనదే !

అందఱు—"కాళీమాతకు-జే-కాళీమాతకు జే."

చింతా—ఛీ! ఛీ! దుష్టులారా ! మీకుసిగ్గులేదా? మీకార్యములన్నియు ఘోరములు దోషయుక్తములు. మీమీఁద నాకసహ్యము పుట్టుచున్నది. మీరక్బరు చక్రవర్తిధనాగారము దోచుకొను సమయమందునాచిత్తము

మీపైనుండుటవలన నాకాశమార్గమున నెగిరి మీయొద్దకువచ్చితిని. ద్వారపాలకుల నిద్రింపఁజేసి మిమ్ముఁగాపాడి యిక్కడికిఁ దీసికొని వచ్చితిని. కాని, మీరింతదనుక నాకేల బలియర్పింపలేదు?

సర్దారు—మాతా ! మాతప్పు క్షమింపుము. ఇంకముందిట్టి దోసము రానీయము.

చింతా—సరే. నేటికి మీపాప వెళ్ళుఁడు. మిమ్ము క్షమించితిని. నేఁడుమాత్రము నైవేద్యము చేయకుఁడు. గురువారమునాఁడు తీసికొనిరండు. నేను నైవేద్యము స్వీకరించువఱకు దోపుడుధనమునుండి యొకరాగిపైసయైనఁ దినవద్దు. జాగ్రత్తగా మెలఁగుఁడు. పొండు. (వెనుకకు మఱలి చనునప్పుడు నీడ కన్పించును.)

ప్రథమ—(సర్దారుతో) ఓరిముసలివాఁడా ! ఇది దేవి కాదురా !

ద్వితీ—మఱెవ్వరు రా?

ప్రథ—దొంగనటకురాలురా?

సర్దారు—నటకురాలా ! నీ వెట్లెఱిఁగితివి?

ప్రథ—నీడవలనఁ దెలిసికొంటిని.

సర్దారు—అట్లయిన నీదుష్టురాలిని బట్టుకొనుఁడు.

(అందఱు చింతామణిని పట్టుకొనుచున్నారు. పైవస్త్రము తొలఁగిపోవును. నిజరూపము కన్పడును)

సర్దారు—ఆఁ ! ఇది వేశ్య చింతామణిరా ! ఎంతమోసకత్తెరా ! ఏమి బోగముదానా ! మోసముచేయవచ్చితివా ?

1. దొంగ—కాదు కాదు. మృత్యుదేవత దీని నిక్కడకు లాగికొనివచ్చినది.

2. దొంగ—ఆహా ! ఏమి దీనియుద్దండత ! సింహమునోటిలోఁ జేయిపెట్టి బ్రతికినవారు పెద్దపులికి భయపడనివారునుగలరా ? కత్తిమీఁదగుద్దినఁ జేయి తెగకుండునా? ఎంతమాయ చేసినది చింతామణి !

చింతా—నిజము మీకుఁ దెలిసినదా ?

సర్దారు—నిజమింకను దెలియదా ? నీకాయువు మూడినది.

చింతా—నన్నుఁ జంపుదురా యేమి ?

సర్దారు—అవశ్యము చంపుదుము. ప్రతిచోరునికత్తియు నీకంఠముపైఁ బడును.

చింతా—నాయపరాధము క్షమింపఁబడదా ?

సర్దారు—క్షమింపఁబడవు.

చింతా—స్త్రీహత్య చేయుటయే ఖడ్గపరీక్షయగునా? కొంచెము జాలివలదా?

సర్దారు—జాలియులేదు గీలియులేదు. శత్రువు స్త్రీయైనను పురుషుఁడైనను సరే. చంపివేయుట బుద్ధిమంతునిపని.

1. దొంగ—చేతిలో రాయియున్నది. రాయిమీఁదఁ బాము తలయున్నది ఇంక నాలస్యము చేయనేల?

చింతా—నాయనలారా! మరణింపనున్నవారి కవసానకాలమందుఁ గోరికలు తీర్చుట లోకాచారము.

సర్దారు—నీయభిలాష మేమో చెప్పుము.

చింతా—నేను చింతామణినేకాని దేవిని కానని మీకెట్లు తెలిసినదో మొదటఁ జెప్పుఁడు.

1. దొంగ—ఇదిగోఁ జెప్పుచున్నాను వినుము. పరమేశ్వరుఁడు నాతండ్రికి స్వర్గమందు శాంతినిచ్చుఁగాక! "పుత్రా! సాధువులమాట లెప్పుడును వినకు. వారలెదుష్టులు." అని నాతండ్రి యెల్లప్పుడు నాకుఁ జెప్పుచుండెడివాఁడు. ఒకనాఁడు నేనొకచోటునుండి మాసర్దారుదగ్గఱకుఁ బోవుచుంటిని. మార్గమందొక సన్యాసి హరికథ చెప్పుచుండెను. తత్క్షణమే నాతండ్రిమాటలు జ్ఞాపకమునకురాఁగా రెండు కర్ణరంధ్రములయందును రెండు వ్రేళులుఁ దోపితిని. కాని, యాసమయమందే నాయెడమకాలిలో నొకముల్లు గుచ్చుకొనెను. ముల్లులాగివేయుటకుఁ జెవినుండి యొకవ్రేలుఁ దీసితిని. అప్పుడు సాధువునోటినుండి "దేవతలకు దేవతాస్త్రీలకు నీడయుండదు" అని వినఁబడినది. అప్పుడా మాటవింటిని. నేఁడీ యుదాహరణముఁ గంటిని.

చింతా—ఆఁ! ఆఁ! సాధుసాంగత్యమంత ప్రభావవంతమా! ఒక్కక్షణ సాంగత్యముచేతనే యొకదొంగకుఁగూడ నింతజ్ఞానము కలిగినదా! ఆహా! ఏమనుష్యుఁడు నిరంతరము భక్తిపూర్వకముగా హరికథాశ్రవణము చేయునో యతఁడు తప్పక నరకమునుండి విడుదలయగును. నాకిప్పుడు నాజీవితమునం దసహ్యము పుట్టుచున్నది. సర్వదా దుష్కర్మములందే కాలము వినియోగించితిని. గృహము నిత్యమునూడ్చి శుభ్రము చేయుచుంటిని. కాని యీశ్వరస్థానమగు మనస్సున సంకల్ప వికల్పముల యొక్క మాలిన్యమును బోగుచేసియుంచితిని. కటకటా! చెడుసడతయందే నాజీవనమంతయుఁ దగులఁబెట్టితిని. కొంచెమైన జ్ఞానము లేకపోయెనే? జీవితమంతయు మంటిలోఁ గల్పితిని. నాయావనధనమంతయు దుష్కర్మములలోనే పోఁగొట్టుకొంటిని. నేను వలపించిన వారందఱు నాకిప్పుడు జ్ఞాపకము వచ్చుచున్నారు. తీర్థయాత్ర పేరెన్నఁడుఁ దలఁపనైతిని గాని యిప్పుడు పూర్ణయాత్ర లభించినది. గంగాస్నానము చేయవలెనని తలంచియుంటిని గాని యదియుఁ జేయలేకపోయితిని.

సర్దారు—నిజమే. మరణకాలమందుఁ బూర్వము చెప్పిన యబద్ధములు-దుష్కర్మములు జ్ఞాపకమునకు వచ్చును.

చింతా—ఓపరమాత్మా! దీనబంధూ! పాప మలినసముద్రమందుఁబడి సర్వాంగమాలిన్యముఁ గాంచిన నన్ను నీదయా పరిశుద్ధ స్నానముఁ జేయింపవా? నాబ్రదుకిట్లు పాప భూయిష్ఠము కావలసినదా? దేవా! నీదయాపరమౌషధము నాకిప్పు డొసంగుము. పాపరూపజాడ్యము నామనస్సునుండి నాశనము చేయుము. ఇంద్రియములు దోషరహితము లగుటకును మనస్సు పాపరహితమైన నిర్మలభక్తికి స్థానమగుటకును నోయీశ్వరా! నాకువరమిమ్ము.

సర్దారు—చింతామణీ! నేను నిన్ను విడిచిపెట్టినచో నీవు సన్మార్గ మవలంబింతువా?

చింతా—తప్పక యవలంబింతును. నన్నుఁగాపాడుము. స్వచ్ఛమై పాపరహితమైన నానూతన జీవితము నేటినుండియే ప్రారంభమగును.

సర్దారు—సరేకాని నీవు మా కొక మాటపట్టీయవలయును. పిమ్మట నిన్ను వదలుదుము.

చింతా—అదేమో త్వరితముగాఁ జెప్పుము.

సర్దారు—నీవు మాతంత్ర మెవ్వరికిని జెప్పఁగూడదు.

చింతా—ఏమిది! నాజీవరక్షణముఁ గావించిన వారి తంత్రమర్మమునా! అనేక సంసారబంధములనుండి తప్పించినవారి తంత్రమర్మమునా! ఇది నేనొరులకుఁ జెప్పఁగలనా? అదెప్పటికిని గాఁజాలదు.

సద్గురు—ఆలాగయిన నీవుపోయి సన్మార్గ మవలంబింపుము. పొమ్ము.

(అందఱును చింతామణిని విడిచివెళ్ళుదురు)

చింతా—ఆహా! నేడు నేను సంసార ప్రపంచమును జక్కఁగాఁ బరిశీలించితిని. నేఁడు నాజీవనమునకుఁగల నిజసుఖ మెఱింగితిని. ఓసంసార దుష్కర్మములారా! నన్నువిడిచి యవ్వలకుఁబొండు. ఇప్పుడీచింత చింతామణి కాదు. చింతాహారిణియై యున్నది. ఏరమణి మొదట గొప్పగొప్ప జమీందారుల నాలింగనము చేయుచుండెడిదో యామె యిప్పుడు శ్రీకృష్ణ పాదారవిందములను భక్తితో నాలింగనము చేసికొనుచున్నది.

ఒకదొంగ—(ప్రవేశించి) ఆఁ! ఏమియాశ్చర్యము! ఎల్లప్పుడును దుష్కర్మములలో మెలంగుచుండి యొక్క క్షణములో నీవేశ్య భక్తిజ్ఞానములను సంపాదించుకొన్నది. నేను సదా కాళీపూజ చేయుచున్నాను. కాని జ్ఞానమార్జింప లేకపోయితిని. నేనీమెనుజూచి కొంచెమైన జ్ఞానమార్జింపనియెడలఁ బ్రపంచమందు నాకంటె మహాపాపుఁ డెవ్వఁడుండును? చాలును! నేటినుండి శ్రీకృష్ణుని భక్తిలో మగ్నుఁడనయ్యెదఁగాక! నాకాబృందావన విహారి దర్శనమిచ్చి యాదరించువఱకుఁ గందమూల ఫలాహారినై నియమ నిష్ఠలతో జీవయాత్ర నడపెదఁగాక!

(నిష్క్రమించుచున్నాఁడు)

చింతా—ఓజగన్నాథా! నాయపరాధములను క్షమింపుము. క్షమింపుము. ఈకలికాలము భయంకర ప్రళయకాలము. కపటము-దుస్సాంగత్యము అసత్యము ఇవన్నియు ఘోరోదకమువంటివి. ఓమహాప్రభూ! జ్ఞానామృతమునాకొసంగుము. నాపాపకర్మములను నాశనముచేయుము. మహామాయాంధకారమునుండి వెలువడుటకు జ్ఞానప్రకాశముఁ బ్రసాదింపుము. ఓదీన చింతామణీ! భక్తరత్నామణీ! నన్ననుగ్రహింపుము.

మ. అనఘా! నాయొనరించుచున్నవృజిన వ్యాపారమున్మాన్పి భ
క్తి నిబద్ధంబగు బుద్ధినిచ్చియనుర క్తింజూపి కాపాడుమా!
వనజాతాసన ముఖ్యదైవతమనః పంకేజమిత్రుండ! దయా
వనధీ! ధర్మనిధీ! నిన్నుఁగొలిచెదన్ ప్రార్థించెదన్ మ్రొక్కెదన్.

(నిష్క్రమించుచున్నది)

2. రంగము:—వనమార్గము.

[భక్తిదేవి, కామదేవి, ప్రవేశించుచున్నారు]

భక్తి—కామాగ్నిదహ్యమానులు దేనిచే దాహశాంతి చేసికొనుచున్నారో యట్టి యానందరసకుండమను నేనే! ఎక్కడ ఋషులాత్మజ్ఞానమను పుష్పములు రాల్చుచున్నారో యట్టి యుద్యానవనమును నేనే! ఎవనిపై భగవంతుని కృపకలదో యాకృపయొక్క ఛాయను నేనే! అజ్ఞానరోగపీడితులకు భగవంతుఁడను వైద్యుఁడిచ్చు పరమౌషధప్రతిబింబమును నేనే! నాప్రేమచేతనే జగద్బంధములన్నియు విడిపోవుచున్నవి. నామూలముననే జీవుఁడు దేహాంతరమునఁ బరమానంద మనుభవించును.

కామ—అదియసత్యము. సుఖమనుభవించు వాఁడెవ్వఁడైన బ్రపంచమునఁ గలుగు నేని వాఁడు నాకధీనుఁడు. నన్నెవఁడు పూజించునో వాఁడు ప్రేమాధీనుఁడై యుండును. నాయాశ్రితుఁడు సౌఖ్యములను పుష్పమాలికగాఁ గట్టి గళమున ధరించును. నిన్నుఁ బూజించువాఁడు దుఃఖము నొందుచు దుస్థితిఁ గాంచుచున్నాఁడు.

భక్తి—ఏమి! దుస్థితి నొందుచున్నాఁడా? ఎంత వెఱ్ఱిదానవు! కామము సుఖదాయకమగు స్వర్గమా! కాదుకాదు. నీవు నీయాశ్రితుల కొక్కనాటి స్వర్గముఁ జూపింతువు. ప్రేమదాహపీడితులచే విషపాయసముఁ ద్రావింతువు. దొంగతనము—పాపము—అబద్ధము—నీవునేర్పు ప్రారంభవిద్యలు. ఎవరు నీప్రేమకుఁ బాతురులగుదురో వారి శిరములమీద నరకమను నొక పెద్దకొండవిరిగి పడును.

కామ—ఏది దుఃఖములకుఁ గారణమో యట్టి వైరాగ్యము నీవలనఁబుట్టుచున్నది. త్యాగము సుఖమును నివారించును. నీవు జీవాత్మను బరమాత్మునియందు లీనముచేయు దొంగనటకురాలవు. అందువలన నీవు నీచకార్యకరణ విఖ్యాతిఁ గాంచుచున్నావు.

భక్తి—కామదేవీ! ఇంతమాత్రమున నాకీర్తికిలోటురాదు. నేను సర్వదా భక్తచిత్తములఁ బ్రవేశించుచుఁ బుష్పవనములందు నిరంతర విహారణములు సలుపుచుందును. నీవు మద్యమాంసములందు నశ్రాంతవిశ్రాంతి నందు

చుందువు. మోహముచేతనే నీవు నాభక్తులను బాధచేయుచున్నావు గాని ధారాళముగా నీశక్తి వారిపైఁ జూపఁగలవా ? నీమోహమునందుఁ బడి పోయి క్షణసుఖాశలకుఁజిక్కి తుట్టతుదకు నన్ను వెదకుకొనుచు వచ్చి నీభక్తులెందఱు తరించుటలేదు. ఇది నీవెఱుఁగని విషయమా ?

కామ—మంచిదే ! అట్లయిననడువుము. ఇప్పుడే బిల్వమంగళుని బరీక్షించి చూతమురమ్ము. అప్పుడు మన తారతమ్యము తెలియఁగలదు.

భక్తి—సరియే నడువుము. పరీక్షానంతరముననైన నీవు నాయాధిక్యత నంగీకరింతువు.

కామ—దానికేమిలే. గొప్పతనము బయటఁబడును రమ్ము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు).

3. రంగము:—బిల్వమంగళుని గృహము.

[బిల్వమంగళుని తండ్రి రామదాసు రోగశయ్యపైఁ బడియుండును.]

[మాయాదేవి యుపచారములు చేయుచుండును.]

మాయా—(ఔషధమునిచ్చుచు) మామగారూ ! దీనిని బుచ్చుకొనుఁడు.

రామ—అమ్మా ! దీనినిద్రాగిన ప్రయోజనమేమి ? నేనిప్పుడు జీవింతునన్న యాసలేదు. జీవింపవలెనన్న యిచ్ఛయులేదు.

మాయా—ఆలాగనకుఁడు. ఆశవలననేకదా ప్రపంచమంతయు నిలిచియున్నది.

రామ—అమ్మా ! నీమాట సత్యము. కాని యీయాశయే నిన్నీగతికిఁ దెచ్చినది.

మాయా—మామగారూ ! అదియెట్లు ?

రామ—పుత్రీ ! నీకేమనిచెప్పుమను ? నీవు నీపాణిగ్రహణ సమయమందు నీమనస్సుననెట్టి సుఖాశలు కలిగియుంటివోకదా ! ఇప్పుడునీకుఁ బతి సేవచేసికొను సమయముదొరకినది. నేనెంతగాఁ బతిని సేవింతునో యంతమహాసుఖముఁ బొందుదాననని నీవనుకొనియుందువు. కాని చూడుము. ఆయాసలెల్లు నిన్ను నిరాశురాలినిగాఁ జేసి దుఃఖమునిచ్చినవో !

మాయా—(సిగ్గుపడి తలవాంచుకొనును.)

రామా—పుత్రీ ! నీవుచెప్పకపోయినను నీముఖలక్షణమునుబట్టి యంతయుఁ దెలిసినది. నీయాకృతిఁ జూచినప్పుడు నాహృదయము వేయిచెక్కలై

పోవుచుండును. బిల్వమంగళుఁడిట్టి దుష్టుఁడగునని నాకుఁదెలిసినచో నీవంటిగోవు నాకూరసింహమునకుఁ గట్టకపోయి యుందును.

మాయా—మామగారూ ! ఇందు మీతప్పేమియున్నది. కర్మానుసారముగాఁ గార్యమగుచుండునుగదా !

రామ—అగుచుండునేమోకాని నీకష్టములుమాత్రము నేనుజూడఁజాలను. నీ దుఃఖముఁ జూచినప్పుడెల్ల నాకుహృదయము బ్రద్దలగుచుండును. ఎప్పటికైన నీకు సుఖముకల్గునన్న యాశయే యీతనువు నింతకాలము నిల్పినది. నేనిక్కడఁ జావు బ్రదుకులలోనున్నాను. అక్కడఁ చింతామణి మేడలో మావానికిఁ బాడుగువలెచున్నది. ఆహా ! కాలవైపరీత్యము !

మాయా—మామగారూ ! అట్లుకాదు. ఆయన యీపాటికి వచ్చుచుందురు.

రామ—తల్లీ ! వాఁడింకేమివచ్చును !ఆ పాపి—ఆచండాలుఁడు—ఇఁకవచ్చునాఁ ?

మాయా—మామగారూ ! మీపుత్రునిగూర్చి మీరనుచున్న నిష్ఠురవాక్యములను నేనువినలేను.

రామ—అయ్యో ! పుత్రా ! పుత్రా ! ఈమాట యొక్కప్పుడతిసుఖదాయకముగా నుండినది. ఇప్పుడో కేవలము సంతాపకరముగా నున్నది.

మాయ—తండ్రీ ! అధైర్యము నొందకుఁడు.

రామ—(ఆలోచనసూచించి) "అమ్మా ! నాన్నా !" అనిపిలుచు పిల్లలు కఱవైన తల్లిదండ్రులు సంతానముకొఱకు లెక్కలేని వ్రతములు, యాత్రలుచేసి చేసి తుట్టతుదకు సంతానవంతులై యానందసముద్రములో మునిఁగి తేలుచు నితర వ్యవహారములు సర్వమును మఱచి తాముకన్నబిడ్డలు కురూపులైనను సురూపులుగానెంచి చంద్రుఁడనియు గోపాలకృష్ణుఁడనియు ముద్దులిడుకొనుచుఁ బ్రేమించుచుందురు. పిల్లవానికి వయస్సువచ్చిన కొలఁదిని తల్లిదండ్రుల కాశలు పెరుగుచుండును. (ఆయాసముచేనాగి) కన్నకొడుకు వంశదీపకుఁడై యెప్పుడైనను గష్టములలో సహాయుఁడగునని తల్లిదండ్రులాసించుచుందురు. తాము వేసిన వృక్షమునుండి యుత్తమఫలమనుభవించు తల్లిదండ్రులనేకులున్నారు. తల్లిదండ్రులకు సుఖమిచ్చు పుత్రులుడుగలరు. తల్లిదండ్రుల నగ్నికుండములోఁ బడఁద్రోయు కొడుకులుకూడ వేనవేలున్నారు. (కంఠమెండుట సూచించి)

అమ్మా! కొంచెము మంచినీరు తెమ్ము. దాహమగుచున్నది.

మాయ—(జలమిచ్చును.)

రామ—(నీరుత్రాగి) అయ్యో! ఇప్పటికిని రాలేదే. నేను వానిముఖము చూడకుండఁగనే వెళ్ళిపోవుదునేమో!

మాయ—మామగారు! అధైర్యపడకుఁడు. ఆయన యిప్పుడే వచ్చును.

రామ—వాఁడింకేమివచ్చును! భార్యవిలపించుచున్నది. వృద్ధజనకుఁడు చచ్చుచున్నాఁడు. తాను వేశ్యాగృహమున నానందించుచున్నాఁడు. ఆహా! ఏమి యీశ్వరేచ్ఛ! (మూర్ఛిల్లును.)

మాయ—అయ్యో! అయ్యో! మామగారేమైపోయినారు. మామగారూ! మామగారూ!

[బిల్వమంగళుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

బిల్వ—ఏమిది! ఈయఱపు లెందులకు? కొంచెము దుర్బలుఁడగుటచే మూర్ఛిల్లెను.

రామ—(మూర్ఛను డిలేచి) ఎవరువీరు? బిల్వుఁడా! నాయనా! బిల్వమంగళా!

బిల్వ—నాన్నగారూ! మీశరీరస్థితి యెట్లున్నది?

రామ—ప్రయాణస్థితిలో నున్నది. అట్లగుఁగాక! (కొంచెమాగి) నాయనా నిన్నొకమాట యడుగుచున్నాను.

బిల్వ—నాన్నగారూ! అదియేమి?

రామ—సంవత్సరమునకు దినములెన్నియో చెప్పఁగలవా?

బిల్వ—మూఁడువందల యఱువదియైదు.

రామ—వానిలో సగము రాత్రులైన మిగిలిన వెన్ని?

బిల్వ—రమారమి నూటయెనుబదిమూఁడు.

రామ—ఈనూటయెనుబది మూఁడుదినములలోను నీవేమిచేయుచుంటివో దానిఫలితమేమో నీవెప్పుడైన నాలోచించుకొంటివా?

బిల్వ—నాన్నగారూ! నేనుమీయభిప్రాయముఁ దెలిసికొంటిని. పిల్లలు పసితనమందు దుర్బలులైయుందురు. నడచుటకు వారికాళులు వణఁకును. నడచుటలోఁగాని పరువెత్తుటలోఁగాని పడుచుందురు. వారికప్పుడు తల్లి

దండ్రుల యొద్దనుండి యుపదేశమావశ్యకము. కాని, వారెప్పుడు పెద్దవారై నడచుట పరువెత్తుట నేర్చికొందురో యప్పుడువారికెవరి యుపదేశమును సాయమును గూడ నక్కఱలేదు.

రామ—అందువలన—

బిల్వ—నాకుఁగూడ మీయుపదేశ మక్కఱలేదు.

రామ—ఏమి! కాలమహిమ! బిల్వా! మనుష్యుఁడు ఫలమనుభవించుటకై పొలమున విత్తనములు చల్లుచున్నాఁడు. ఫలాపేక్షచేతనే సేవచేయుచున్నాఁడు. అట్లే నిన్ను నేనును బోషించితిని. రోగావస్థయందు నిన్నుఁ గాపాడితిని. నిన్ను మనుష్యునిగాఁ జేయుటకు నాజీవితమంతయు మంటిలోఁగలిపితిని. దీనికి నాకు నీవేమి ప్రతిఫల మిచ్చితివి? నాసేవలకును నాపరిశ్రమమునకును నాకు నీవేమి ప్రత్యుపకృతిఁ జేసితివి?

బిల్వ—నాన్నగారూ! నేను కృతఘ్నుఁడనుగాను. నాశరీరమునందలి ప్రత్యంగమును గూడ మీకు ఋణపడియున్నది.

రామ—ఈఋణము—

బిల్వ—అవశ్యము తీర్చెదను.

రామ—ఎప్పుడు? ఏప్రకారము? దేనివలన? నీహృదయము నపవిత్ర విచారణమునకై యర్పణము చేసితివి. ప్రేమ నొకవేశ్యకు దానమిచ్చితివి. ధర్మము నధర్మమునకు సమర్పించితివి. ఇప్పుడు నీయొద్ద నాఋణముఁ దీర్చుటకేమున్నది? ఏమైనను న్నచోఁ దీసికొనిరమ్ము. నేఁడు నీవలన నీకు నేను జేసిన సేవలకును-నీయెడలఁ జూపిన ప్రేమకును-నీకొనర్చిన యుపకారమునకును-వేయేల? నీకుఁ జేసిన ప్రత్యుపదేశమునకును బ్రతిదానముఁ గోరుచున్నాను.

బిల్వ—మీరు ప్రతిఫల మేమికోరుదురు?

రామ—ధనము-సేవ-ఉపకారము ఇవికోరను. ఇవి నాకక్కఱలేదు.

బిల్వ—అట్లయిన నింకేమి కావలయును?

రామ—నాయనా! ఇటుచూడుము. (మాయాదేవిని జూపుచు) ఈసాధ్వీవంకఁ జూడుము. ఆకారమాత్రముఁ డీభారతనారీశిరోమణియందు శకుంతల యొక్క సౌందర్యమును సీతయొక్క పాతివ్రత్యమును రాధయొక్క

ప్రేమమునుగూర్చి యున్నాఁడు. అట్టి సౌందర్య పాతివ్రత్యప్రేమానురాగసంపూర్ణమైన యీమెకొఱకై ప్రేమయు నాకొఱకై పితృవాక్యపరిపాలనమును గోరుచున్నాను. ఇదియే నాకుఁ బ్రీతిఫలము.

బిల్వ—ఈమెను బ్రేమించుటతప్ప నితరమేదైనను జేయఁగలను.

రామ—ఈమె నీవలనఁ బ్రేమతక్క నితరముఁ గోరుటలేదు.

బిల్వ—నాయొద్దఁ బ్రేమలేదే.

రామ—అయినను గొంచె మాలోచింపుము.

బిల్వ—ఈవిషయమై యాలోచింపనక్కఱలేదు.

రామ—ఏమియు నాశలేదా ?

బిల్వ—లేదు. లేదు.

రామ—కొంచెమైన లేదా ?

బిల్వ—ఏమియులేదు. ఆమె నాదికాదు.

రామ—మంచిది. చాలమంచిది. ఆలాగే కానిమ్ము. ఈమె నీది కానియెడల నీవును నాపుత్రుఁడవుకావు. నీవీమె భాగమునఁ గొంతదొంగిలించి వేశ్యకిచ్చుచున్నావు. కాఁబట్టి నీభాగమునుగూడ నేనులాగికొని యీమె కర్పించెదను. మాయా ! ఇక్కడికిరా ! దగ్గఱకురా !

మాయా—వలదు మామగారూ ! వలదు. ఈ యభాగ్యురాలికై యీయనను గోపింపఁ జేయకుఁడు. దేహులకు సుఖదుఃఖములు కర్మానుసారముగాఁ గల్గుచుండును. నేనీయన దాసిని. దాసికి స్వామి యాజ్ఞలేక యేవస్తువును దీసికొనుట కధికారములేదు.

రామ—అట్లుకాదు తల్లీ ! నిన్నీపాపాత్మునికి ఈయన్యాయవంతుఁడగు కాముకునికి—బలిచేసి నేనిప్రపంచమును విడిచిపోఁజాలను. అమ్మా ! ఇటురమ్ము. నాకెదురుగారమ్ము.

మాయ—(ఎదుట నిల్చుండును.)

రామ—(తలక్రిందనుండి దానపత్రమునుదీసి) మాయా ! దీనిఁ గైకొనుము.

మాయా—ఇదియేమి ? ఇది నాకెందులకు ?

రామ—అమ్మా ! ఇది నాదానపత్రము. సాధనము-గృహములు-వసతులు-గ్రామములు-ఉద్యానవనములు సర్వమును నీయధీనము చేసితిని. ఇప్పటినుండియు నీవు నాసర్వమునకు నధికారిణి వయినదానవు.

బిల్వ—ఎవరు ?

రామ—(మాయాదేవిని చూపుచు) ఈమెయే.

బిల్వ—పుత్రుఁడుండఁగనే కోడలా !

రామ—ఏమిరా ! నిర్భాగ్యుఁడా ! నీవు నాపుత్రుఁడవా ? నాయాత్మబంధురాలు-నాసహాయము-నాయాశ-నాప్రియమైన పుత్రిక-ఈమెయొక్కతెయే ! పొమ్ము. లేచిపొమ్ము. నేను నిన్నుఁ ద్యజించితిని. నాశరీరమునందలి కుళ్ళిన దుర్మాంసమునుగోసి పాఱవైచితిని.

బిల్వ—మీపుత్రు నితరుల పుత్రికకు దాసుని జేయుచుంటిరా ?

రామ—నాపుత్రుఁడా ! ఎవరు ? ఎట్టిపుత్రుఁడు ? ఎవరి పుత్రుఁడు ? నాకీమెయే పుత్రుఁడును బుత్రికయునై యున్నది. పొమ్ము. లేచిపొమ్ము. ఆవలకుఁ బొమ్ము. చేయవలసిన దంతయుఁ జేసితివి. చాలును. మన మొకరి కొకరము చచ్చితిమి.

మాయా—అట్లనకుఁడు మామగారూ ! నేనునా శిరస్సుపై సువర్ణచ్ఛత్రముఁ గోరుదాననుగాను. కేవలము మీచేతి యాశీర్వాదము యొక్కఛాయనే కోరుదును. ఈధనాదు లెవ్వరిభాగమై యున్నవో వారినే పొందనిండు.

రామ—పుత్రీ ! ఎవఁడు ధనమును జాగ్రత్తగానుంచి యుపయుక్త కార్యములకు వినియోగించునో యట్టివానికే యీయవలయును. ఒకమూర్ఖుఁడగు కుమార్గ గామికి ధనమిచ్చుట యొకయంధుని చేతులలో రెండుకత్తులను బెట్టుటవంటిది. వాఁడెక్కడికేగిన నక్కడ నెవరికైనఁ దప్పకహాని కలుగఁ జేయును.

మాయా—తండ్రీ ! మీయభిప్రాయము మార్చుకొనలేరా ?

రామ—పుత్రీ ! మార్చుకొనలేను. మార్చుకొనలేను.

మాయా—[బిల్వుని జూపి] వీరికీయఁగూడదా ?

రామ—కూడదు. నాకు వీనికీయవలయునని లేదు.

మాయా—ఇది నాకొఱకై యిచ్చితిరా ?

రామ—అవును.

మాయా—నాకే యీసర్వము నిచ్చితిరా ?

రామ—అవును. నీకే సర్వమునిచ్చితిని.

మాయా—మంచిది. మంచిది. నేనీధనమును స్వీకరించుచున్నదానను.

బిల్వ—స్వీకరించుచున్నావా ? ఏయధికారముచేత ?

మాయా—మామగారూ ! మీరునాకు దానపత్రిమూలముగానిచ్చిన ద్రవ్యాదులను నాయిష్టానుసార ముపయోగించినయెడల మీరేమియు నడ్డుపెట్టరుకదా !

రామ—అడ్డుపెట్టను. నీయిష్టానుసార మనుభవింపుము.

మాయా—నేనీధన మెవ్వరికైనను ధారపోసినను బోఁగొట్టుకొన్నను మీరు కోపింపరుకదా !

రామ—ఎప్పుడును కోపింపను.

మాయా—మంచిది. నేనిప్పుడు ధన్యురాలనైతిని. ఇప్పుడు నేనీధనమునంతయు మీయొద్దనుండితీసికొని యెవరికంటె నాకీవిశ్వమందుఁ బ్రాణాధికులు లేరో యట్టి నాప్రాణపతి కర్పించుచున్నాను. నాథా ! మీరు దీనిని సర్వముచు స్వీకరింపుఁడు.

రామ—మాయా ! మాయా ! ఎంతపనిచేసితివి. ప్రేమార్ణవమునందు మగ్నురాలవైపోయితివా ? అయ్యో ! నీవు నీచేతితో నీకాలికి దెబ్బతగిలించుకొంటివికదా !

మాయా—మామగారూ ! నాధనము-నావిభూషణము-నాసుఖము-నాయాసనాదైవమునీయనయే. ఎప్పుడీయన కర్మము నానుండియీయనను వేఱుచేసెనో యప్పుడు నేనీధనమును దీసికొని యేమిచేయుదును. నాకువద్దు నాకువద్దు. ఓ దానపత్రిమా ! దూరమగుము. దూరమగుము. ఎట్లు నాహృదయము తుత్తుమురైపోయెనో యట్లే నీవుకూడ ముక్కముక్కలుకమ్ము. (దానపత్రిమును జించివేయును.)

రామ—ఓరిమూర్ఖుఁడా ! చూచితివా ! భారతవర్షమున హైందవస్త్రీయననీమెయేసుమా ! ఇప్పుడైననీమెను గౌరవింపుము. సకలప్రపంచాధిక దైవోపహత భాగ్యజీవీ ! ఈమెకునీహృదయసీమను జోటిమ్ము. దుష్కర్మములనుండి తొలఁగుము. నామాటవినుము. నీచాలోచనములు త్యజించి సత్యమార్గావలోకమునకై కన్నులు తెఱవుము. ఈమెను జూడుము. ఆవేశ్యనుగూడఁ జూడుము. తారతమ్య విచారణమొనర్పుము. నిషిద్ధ

జీవనస్థితి యెట్టిదురంతమైనదో యాలోచించుకొనుము.

బిల్వ—ఒకని హృదయమునఁ బ్రేమస్థాన మాక్రమించుకొన్నవారిని వెడలఁగొట్టి యా పదమును రెండవవారు మోసము చేతఁగాని పొందఁజాలరు. ఈమె యెప్పటివఱకు నాకన్నులయెదుటఁ జింతామణియై నన్నులోఁగొనదో యప్పటివఱకు నాహృదయమున నీమెకుఁ జోటులేదు.

రామ—చింతా ! చింతా ! చింతయెవరు ? ఓహో ! వేశ్యయా ! తెలిసినది. సహస్రముఖములనుండి క్రిక్కఁబడిన కబళమా ! సహస్రకాముక శ్వానముల నాలింగనము చేసికొను శల్యమా ! ఆవేశ్యకు-ఆదిపాపము అంతము నరకము-ధనమే యీశ్వరుఁడు-మోసమే ధర్మమునయి యున్నవి. ఆదురాచారిణి కారణమున నీసతినిట్లు విసర్జించి బాధింతువా ? ఇంతకన్నులు మూసికొందువా ? మూఢా ! ప్రపంచమున భార్యలేనిచో సంసారము నిస్సారము సుమా ! ఉత్తమగుణములు లేనిస్త్రీ మంటిబెడ్డతో సమానురాలు. ఆమెయందు సతీత్వము లేనిచో నీసుగుణములన్నియు నిష్ఫలములు. ప్రేమ సతీత్వము-ఈరెండును స్త్రీలకు ముఖ్యాలంకారములు. ఈయలంకారములు లేనిదే యెట్టియుత్తమ గుణములు కలిగిన సుందరస్త్రీయైనను శోభింపదు.

బిల్వ—చింతామణి యందీగుణము లన్నియుఁ గలవు.

రామ—దానియందా ! మూఢుఁడా ! దానియందు వేశ్యాగుణముతప్ప వేఱేమియును లేదు. ఈసతీమణి స్త్రీజాతి కంతకును గౌరవముఁ దెచ్చుచున్నది. ఆచింతామణి యవమానముఁ గూర్చుచున్నది. మాయాదేవిలో సగము సత్యము-సగము సుగుణఖనియునై యున్నది. చింతామణిలో సగము స్వార్థము-సగము నిర్లజ్జతయుఁ గలదు. మాయాదేవి యొక్కని కొఱకును చింతామణి యొక్కతెయు ననేక కాముకులకొఱకు నుత్పన్న ముఁగాంచిరి. ఈమెకుఁ బ్రపంచమంతయు నొక్కపతియే. చింతామణికో ప్రపంచమందలి పురుషులందఱుఁ బతులే. ఓరి పశుప్రాయుఁడా ! పొమ్ము. అవ్వలకుఁ బొమ్ము. దూరముగాఁ బొమ్ము. నీవొక బ్రహ్మణస్త్రీ హృదయముఁ జెఱచితివి. పత్నీహృదయమును విఱచివేసితివి. పుత్రి ధర్మమును భంగపఱచితివి. ఈశ్వరా ! ఎంతఘోరము ! ఈశ్వరుఁ

డీశ్వరుఁడే యైనయెడల-వానిన్యాయము న్యాయమే యైనయెడల-ధర్మాధర్మముల ప్రతిఫలమొక్కటి కానియెడల--దేవలోకమునఁ బక్షపాతమనునది లేనియెడల నేను నిరాశా దుఃఖితమగు మనస్సుతో ముదిమగ నీకు శాపము—

మాయా—వలదు. వలదు. మామగారు! క్షమింపుఁడు. క్షమింపుఁడు. తండ్రిశాపము--బ్రాహ్మణశాపము-అయ్యో! అప్రతిహతము. క్షమింపుఁడు. వీరిని నన్నును క్షమింపుఁడు. మీశాపకుఠారము నాసేత్రముల యెదుట నాప్రాణవిభుని తలపైఁబడుట జూడఁజాలను.

రామ—పాపమునకుఁ బ్రాయశ్చిత్తము పశ్చాత్తాపములేదా? వీఁడు కేవలము నాయెడలనేదోషి కాక ధర్మమునకును--నీతికిని--దైవమునకును గూడ నపరాధియై యున్నాఁడు. ఈతని కెక్కడను క్షమాపణము దొరకదు. శాంతిలభింపదు. అయ్యో యేమిది! నాహృదయము! నామనస్సు నాలో నేమోయగుచున్నది. చీఁకట్లుక్రమ్ముచున్నవే. మాయా! మాయా దాహము.

మాయా—అయ్యో! అయ్యో! మామగారూ! ఏమగుచున్నారో చూడుఁడు చూడుఁడు. (జలమిచ్చుచు) నాథా! మామగారి యవస్థ బొత్తిగా మారినది. అయ్యో! ఇదియేమో చూడుఁడు.

రామ—పుత్రీ! సంసారము స్వప్నము. సత్యమేజయము. ఓదేవతలారా! రక్షింపుఁడు. ఆఁ! బిల్వా! మాయా! మీరు కలిసికొని సుఖింపుఁడు (జలముఁద్రాగి పాత్ర నేలవిడుచుచున్నాఁడు)

బిల్వా—తండ్రీ! నన్నుక్షమింపుము. అయ్యో! మాటాడవేమి తండ్రీ!

రామ—రామా! రామా! నన్ననుగ్రహించి నీసన్నిధిఁ జేర్చుకొనుము. మాయా! మాయా! (లేవఁబోయి పండుకొని) శ్రీరామ రామ (చనిపోవును.)

మాయా—(ఏడ్చుచు) మామగారూ! మామగారూ! ఇదేమిదుర్భాగ్యము. మమ్మువిడిచి పోవుచున్నారా? మాబ్రదుకు బ్రద్దలైనది. దేవసమానులగు మామగారు స్వర్గస్థులైరి. స్వామీ! స్వామీ! ఇప్పుడు నాబ్రతుకేమిగాను. నాకు సూర్యుఁడస్తమించినట్లున్నది. ఈప్రపంచమంతయు నంధకార బంధురమైనది.

బిల్వా—ఆఁ! ఏమి! చచ్చెనా!

మాయా—అయ్యో! నాథా! ఇంకెక్కడి మామగారు!

బిల్వా—హా! తండ్రీ! నాదుష్కర్మము ఈయనకు దుఃఖమిచ్చి చంపివేసినది. నాన్నగారూ! నాన్నగారూ! లెండు లెండు. ఈనీచుఁడు-ఈదుష్టుఁడు-నరకమునకు యోగ్యుఁడగు నీబిల్వమంగళుఁడు మిమ్ము క్షమాపణముఁ గోరుచున్నాఁడు. (భ్రాంతిచేఁ జింతామణి ప్రతిబింబముఁజూచి) అదిగోఁ జూడు. ఆకాంత సౌందర్యమేమి? ఒహ్హోహో! ఆప్రేమ మోహినియెట్లున్నది? కాదుకాదు. అబద్ధము. నీవు సుందరముగాలేవని యెవరనుచున్నారు! ఈపృథివి నీకంటెనధిక సౌందర్యవంతురాలగు రాజపుత్రి స్త్రీనైనను గనలేదు-స్వర్గము నిజసౌందర్యాభివృద్ధికై నీచిఱునవ్వులనుండి కొంతయందము నప్పుఁదీసికొనుచున్నది. చంద్రతారాగణములు సూర్యుఁడను దప్పుదీసికొని భూలోకములో నీవంటి సౌందర్యవతిలేదని సంతోషముతోఁ జాటుచున్నవి. నీవతిసుందరివి. నిక్కముగా సుందరివి.

మాయా—నాథా! మీరిప్పుడెవరితో మాటాడుచున్నారు? తండ్రిగారి మరణమునకై పిచ్చియెత్తినదా?

బిల్వా—తండ్రి శరీరపోషణముఁ గావించినాఁడు. తల్లి యొడిలో నన్నుఁ దింపి పెంచినది. స్త్రీ సేవచేసినది. కాని యాత్మానందమును--చింతామణీ! నాకునీవిచ్చితివి. చింతా! చింతా! నీవు బిల్వమంగళునకు బహిఃప్రాణమవు. ఈదేహమునాది. ఆత్మనీది. (వెళ్ళఁబోవును.)

మాయా—(అడ్డునిల్చి) తండ్రి దేహాంతమైనది. మీరువెళ్ళకురా! క్రియాకలాపములుచేయకయే వెళ్ళకురా!

బిల్వా—తప్పుకో! తప్పుకో! నన్నువదలిపెట్టు-నేనంధకారమున నల్లలాడుచున్నాను. ఈవృద్ధుని యాత్మ పరలోకసుఖాన్వేషణము చేసికొనఁబోయినది. నీవుకూడనీసుఖమునకై వెదకుచున్నావు. నేనును నాసుఖమునకై పోవుచున్నాను. (పోవుచున్నాఁడు.)

మాయా—వెళ్ళిపోయెనా! ఔరా! ఆయనయు వెళ్ళిరి. ఈయనయు వెళ్ళిరి. ఇప్పుడు నాకెవ్వరును సహాయములేరా! అందఱును నన్నే మోసము చేయుచున్నారా! (పకపక నవ్వును)

సేవకుఁడు—(ప్రవేశించి) ఏమిది! శోకసమయమున నవ్వటా! పిచ్చియెత్తలే దుగదా.!

మాయా—నవ్వుఁడు. నవ్వుడు చంద్రతారాగణములారా! అందఱు నవ్వుఁడు. శైవ్యుడు పుత్రశోక విహ్వలుఁడై శ్మశానమున నున్నప్పుడుకూడ మీరు నవ్వుచున్నారు. దుశ్శాసనుఁడు ద్రౌపదీ వస్త్రాపహరణము చేయువేళ శిరములుసిగ్గుచే వంచుకొన్న పాండవులనుజూచి మీరు నవ్వితిరి. మీరా కాశవాసులు. మీకుఁ బృథివియొక్క సుఖదుఃఖములతో సంబంధము లేదు. నవ్వుఁడు నవ్వుఁడు. నేనునునవ్వుచున్నాను. మీరుకూడ నవ్వుఁడు. (నవ్వుచున్నది)

సేవ—(స్వగతము) అవశ్యముగా నీమెకుఁ బిచ్చియెత్తినది.

మాయా—మీరు నవ్వరా? ఈసంసారముఁ జూచిన మీకునవ్వరాదా? జీవనమస్థిరము. ధనముకూడ నట్టిదే. ఇవి సర్వమెఱింగియు—

సేవ—అమ్మగారూ!

మాయా—తండ్రి నేత్రములు మూయఁగనే వానికుత్తర క్రియాకర్మలు చేయకపూర్వమే కొడుకులుఁ గూఁతులుఁ బెట్టెలకుఁ దాళములు వేయుటకుఁ బరువెత్తుదురు. ఇదినవ్వఁదగ్గది కాదాయేమి! కన్యక లయిదాఱేండ్లవారునువిధవలై యింటనుండుటఁ జూచుచున్నాము. స్త్రీలుతమజీవితము నం దర్ధకాలము యౌవనసుఖభోగవిలాసములందు వ్యయముచేసినను సౌభాగ్యవతులై యుండుటకు సదా కోరుచుందురు. ఇదినవ్వుటకుఁ దగినది కాదాయేమి? నవ్వుఁడు. నవ్వుఁడు. మీ కేడువవలెనని యున్న యెడల మీయందఱకు బదులుగా నేనొక్కతెనే విలపించెదను.

సేవ—అమ్మగారూ! మీస్థితి యిట్లున్న దేమి?

మాయా—ఈమె యిట్లయినదేమని నేనుగూడ నిన్నడుగుచున్నాను. ఇప్పటి వఱకు నవ్వుచుండిరి. మాటాడుచుండిరి. ఇప్పుడు మాటాడకుండిరి. కనుట లేదు—వినుట లేదు—మాటాడుట లేదు. ఇదే మిదేమి! అగ్ని—పృథివి నుండి యాకాశము వఱకు నంటుకొని యున్న యీయగ్నిలో సంసారమందు నాకు నీకుఁగల సంబంధమును బంధుత్వమును బ్రేమవ్యవహారము సర్వమును మండిపోవుచున్నవి. పరుగెత్తుఁడు పరుగెత్తుఁడు. యమ

దూతలు కాలాగ్ని కుండమందు నీదేహము నాహుతి చేయుటకై నిన్నుఁ బట్టుకొన వచ్చుచున్నారు. పరుగెత్తుఁడు పరుగెత్తుఁడు. మీరుకూడఁ బరుగెత్తుఁడు. నేనుగూడఁ బరువిడుచున్నాను. కాని యెక్కడికిఁ బరువెత్తుదును? ఎక్కడికిఁ బోవుదును? చీఁకటి చీఁకటి! వెలుఁగు వెలుఁగు! రక్షించు రక్షించు!

(మూర్ఛిల్లును.)

తెరవాలును.

4. రంగము:—వనమార్గము.

వర్షము కురియుచుండును. మెఱుపులు మెఱయుచుండును.

[కృష్ణుఁడు, మంగళుఁడు—ప్రవేశించుచున్నారు]

మంగళుఁడు—

చ. వనరుహనాథ! యీగహనభాగము దుర్గమపర్వతావృతం
బును భయదంబునై విజనమ్ముం బలెఁ దోఁచు మృగంబులెచ్చటన్
గనఁ బడవీనిశన్ మొగులుగప్పిన కాశ్యపిసీలకాంతులన్
దనరెఁ దటిల్లతాళినయనంబులకున్ మిఱుమిట్లు గొల్పఁగన్.

కృష్ణు—మంగళా! నిజముగా నీ రేయి భయంకరముగా నున్నది. ఆనల్లని మేఘములు కలియుఁగ ధర్మదేవతయొక్క రాజధాని ననుకరించుచున్నవి.

మంగ—దేవా! మెఱుపు లేప్రకారముగ నాగియాగి మెఱయుచున్నవో గమనింపుము.

కృష్ణు—క్షుద్రజనులకు మహాప్రళయ కాలమునఁ బ్రేమాస్పదవస్తువు లభించిన నెట్లుండునో యట్లే మెఱుపులు తోఁచుచున్నవి.

మంగ—దేవా! మేఘములు పెద్దగాలివేసినంతనే చెదఱిపోవుచున్నవి.

కృష్ణు—మంగళా! ఇట్లే యధముఁడు పుట్టుటవలన ధర్మము లక్ష్మి తొలఁగి పోవును.

మంగ—ఒకొక్కప్పుడు చీఁకటియును మఱొకప్పుడు ప్రకాశమును గనఁబడుచున్న దే!

కృష్ణు—అవును మంగళా! ఎట్లు దుస్సహావాసముచే నజ్ఞానమును సత్సహవా

సముచే జ్ఞానోద్భవము నగుచుండియుఁ గాలవశమున నడఁగిపోవుచుండునో యట్లే చీఁకటియు బ్రకాశమును గలుగుచున్నవి.

మంగ—మహాత్మా! ఇట్టి భయంకరరాత్రి సమయమునం దెవరు మేల్కొనియుందురు ?

కృష్ణు—ఈసమయమునఁ బశుపక్ష్యాదులన్నియు సుఖనిద్రఁగాంచుచుండును. కాని, దొంగలు-కాముకులుమాత్రము తిరుగుచుందురు.

మంగ—(ముందుచూచి) ఆయెదుట వచ్చువారెవరు దేవా!

కృష్ణు—(చూచి) ఒకవ్యభిచారి.

మంగ—ఆవ్యభిచారి యెవ్వఁడు ?

కృష్ణు—అప్పుడే మఱచితివా! నీ వెవ్వనిమనస్సను నూసర క్షేత్రము నందుపదేశవాక్యబీజములు నాటఁబ్రయత్నించితివో వాఁడే యీవ్యభిచారి—

మంగ—బిల్వమంగళుఁడా !

కృష్ణు—అవును. ఆయధముఁడే. పాపావృతుఁడైన వీనికిట్టిగతిపట్టినది !

మంగ—అవును. మహాప్రభూ! భారతవర్షమందలి వర్ణములలో వీఁడుపుట్టిన దగ్రవర్ణము. అట్టియగ్రజాతి నుదయించిన వానివలన హిందూధర్మము సత్యానాశముఁ బొందుటయా! దీననాథా! నేను వానికుపదేశముచేసి యోడితిని. ఇప్పుడు నీవు వానికి సదుపదేశముఁజేసి సత్యమార్గమున నడిపింపుము.

కృష్ణు—వీనిని జింతామణియే యుత్తమునిగాఁ జేయఁగలదు.

మంగ—ఏమీ! తడికట్టులవలననిప్పంటుకొనునా? అంధుఁడంధునకు మార్గముఁ జూపించునా? చాలుఁజాలు! ఆచింతామణి తనప్రియుఁడైన వీనిని దుర్మార్గగామిని జేయదా?

కృష్ణు—అట్లుకాదు. చింతామణి యిప్పుడుత్తమురాలైనది.

మంగ—ఓ దేవా! కృపానిధీ! అనంతగుణరాశీ! శ్రీకృష్ణా! పరిహాసములాడకుము. దయాదృష్టినించి వీనికిప్పుడైన మంచిబుద్ధిఁగలిగింపుము.

కృష్ణు—వెఱ్ఱిమంగళుఁడా! పశుప్రాయుఁ డుపదేశము లాలకించునా? ఆలకించినను బ్రయోజన మేమియున్నది? నీవు మాటాడకుండుటయే మంచిది. నేను నీకీమాట నాఁడును జెప్పితిని-నేఁడును జెప్పుచున్నాను.

మంగ—ఏమిచెప్పితిరి ?

కృష్ణు—ఉపదేశములు పనిచేయవని-కాలమహిమచేతనే సర్వము జరుగుచుండునని.

మంగ—అవునుగాని దేవా! నాప్రార్థన నాలకించి వీనికొక్కసారి సదుపదేశముఁజేసి యుపకారముఁ గావింపుము.

కృష్ణు—మంచిది. ఆలాగేచేసెదను. పర్యవసానము నీవే గ్రహింపఁగలవు.

(ఇద్దఱును నిష్క్రమింతురు)

[బిల్వమంగళుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

బిల్వ—అయ్యో! ఎంతకష్ట మెంతకష్టము!

ఉ. గాలియు వానయుం బ్రబలె గాఢతమంబు జగంబుఁగప్పె శం
పాలత నెల్గుఁబట్టి యిటు వచ్చితిఁ బాదములందు సూదులం
బోలిన ముండ్లు గ్రుచ్చుకొనె బుస్సని కస్సని త్రాచుపాములా
భీలత రోజుచుండె నిఁక బ్రేయసి నెట్లు కనంగ నేర్తునో!

ఈ ఘోరాంధకారములో దారిఁదప్పితిని. ఎంతనడచినను దారిలోనికి రాలేనైతిని. ఎవరితోఁ జెప్పుకొందును? ఎవరువిందురు? ప్రియా! తప్పుదారి నన్నెంత త్రిప్పలుపెట్టుచున్నది! ప్రాణప్రియా! ప్రాణప్రియా! నీవైననాకు దారిఁజూపుము.

కృష్ణు—(తిరిగి ప్రవేశించి) నిశ్శబ్దమైన యీయర్ధరాత్రియందు "ప్రాణప్రియా" యని పిల్చువారెవ్వరు ?

బిల్వ—అయ్యా! నేను. నాదుఃఖము నీకెట్టిదని చెప్పుదును! నానిస్సహాయత్వమును గ్రహించి చింతామణి నన్నుఁ దనప్రేమయను వలలోఁ జిక్కించుకొన్నది.

కృష్ణు—చింతామణి వేశ్యకాదా!

బిల్వ—అవును. చింతామణి వేశ్యయే. అయిననేమి? ఆమెయే యంధకారబంధురమైన నాగృహమునకు మెఱుపుఁదీఁగవంటిది.

కృష్ణు—మూర్ఖా! దుఃఖమయభోగవిలాసములందుఁ గాలమేల వృథాచేయుదువు? ఇంద్రియలోలుఁడా! ఈయసత్య సంసార సాగరమునుఁ బాపరూపమైన కామనౌకకు లంగరు వేయుచున్నావా? అంతమునకు నీవు

నరకకూపమున నేలకూలెదవు ? ఏభోగము నీదృష్టి యందు ఆనంద నిలయముగాఁ దోఁచుచున్నదో యది యొకసుందర పుష్పమువంటిది. ఆపుష్పము విషవాసనలతోఁ గూడియున్నది సుమా !

బిల్వ—నీయుపదేశములు నామనస్సును ద్రిప్పలేవు. చింతామణి నన్ను వశ్యుని జేసికొన్నది. దానిమాటకు నేను జవదాటలేను. మేము ప్రేమయొక్క పూజారులము. మాకోరికలను సిద్ధింపఁజేయునది ప్రేమయే. మేము తీర్థయాత్రలకుఁ బోవుదుమేని తీర్థద్వారములు ప్రేమ ద్వారములుగా నుండవలయును.

కృష్ణ—ఓయి వెఱ్ఱివాఁడా ! వేశ్యా ప్రేమయన నట్టిదో తెలిసికొంటివా !

చ. చెలువపుఁ జూపులన్ వలపుఁ జేతల సొంపగు మేల్పసిండి బొ
మ్మలఁ దలఁపించు రూపముల మాటల తేటల, నీటుగోటులన్
జెలగలు మేనిరక్తమును జిట్టునఁ బీల్చెడు భంగి మాయవే
శ్యలు వలపున్నటించి వ్యభిచారులఁ గూల్తురు మూఁడునాళ్ళలోన్ ॥

బిల్వ—ఇది నాయెడలవర్తింపదు—నీశుష్కోపదేశములలో నేమియు లేదు. నేనెప్పటినుండి దానిని బ్రేమించుచుంటినో యప్పటినుండియు నాచార ధర్మజ్ఞానములు పోఁగొట్టుకొంటిని. నాకింక నీలోకముతోఁ బనిలేదు.

కృష్ణ—కాని, ప్రపంచమందున్న శ్రీకృష్ణుని మఱచితివా ! ఆయన యొక వేశ్యాప్రియుఁడైనచో లోకమేమగును ? నీవు చేయునది మిక్కిలి గర్హ్యము. చచ్చునప్పుడు భక్తి యొక్కటియే తోడవచ్చును సుమా !

బిల్వ—ఏమి ! ఆకృష్ణునిపై భక్తియా ! చాలుఁజాలు ! మంచియుపదేశము. పదాఱువేల నూటయెనమండ్రు గోపికలతో భోగించినవాఁడు శ్రీకృష్ణుఁడు. వాఁడు నాకంటెను బరమాధముఁడు. వానిదుష్కర్మముల చర్చ జగద్విఖ్యాతమై యున్నది.

కృష్ణ—మూఢుఁడా ! ఆనిర్లిప్తుని దూషించుచుంటివా ! వానినెందఱో గోపికా స్త్రీలతో భోగిగాఁ జేయుచున్నావా ! ఆగోపికలు స్త్రీలుకారుసుమా ! వారింద్రియ రూపులగు స్త్రీలు. వారిని వశము చేసికొన్నవాఁడు శ్రీకృష్ణుఁడు. ఇంద్రియములను స్వాధీనము చేసికొనుము. అప్పుడే నిజసుఖముఁ గాంతువు.

బిల్వ—ఇంద్రియసుఖములనుమించు సుఖము లెందును లేవు. చింతామణి యొక్కర్త నాకు వశవర్తినియైయున్న నాభగవంతుఁడుకూడ నున్నట్లే.

కృష్ణ—ఓరిమూర్ఖుఁడా ! వేశ్యానగుణములు గ్రీష్మఋతువువలె దుఃఖతాప మధికముచేయును. శరదృతువునందు ధర్మకమలము నెండించును—తృణముసైతము వేశ్యా పరచ్ఛాయవలనఁ దాఁచుపామగుచున్నది. సదా వేశ్యాసాంగత్యము కలవాఁడేమగునో విచారింపుము.

బిల్వ—అట్లుకాదు. నీమాటలు నాకు రుచించుటలేదు. వేశ్యాసాంగత్యము నందు సంసారమును దరింపఁజేయు మహత్తరశక్తి యున్నది. వేశ్య యొక్క ప్రేమలోనే యానందమంతయు నిముడ్పఁబడియున్నది. ఈజీవితమునకు మోక్ష మొక్కచింతామణియొద్దనే యున్నది. అట్టిదానిని దూషించు నీవజ్ఞానివి.

కృష్ణ—మూఢా ! క్షణసుఖమునకే రక్తమాంసబలిదాతవగుచుంటివా ? నీపోషకునిద్యజించి యింద్రియ సుఖములలోఁ బడుటకుఁ గోరుచుంటివా!

బిల్వ—నీరులేమిని జేఁపలు, మేఘములులేకున్న బాలములు, చంద్రుఁడు లేనిచోఁ గాంతియు, భర్తకొఱయైనఁ గామినియు నెట్లుందురో యట్లే చింతామణిలేకున్న నాకుఁ బ్రాణములు నిలువవు. నిలువనే నిలువవు. నాకు నీతోఁ వాదులాడుటకుఁ దీఱికలేదు. ఈచింతామణికడ కేగెదను.

(నిష్క్రమించును)

కృష్ణ—(ప్రక్కకుఁజూచి) మంగళా ! ఇటురమ్ము. ఇప్పుడైన నామాటపై విశ్వాసము కల్గినదా ?

మంగ—(ప్రవేశించి) కలిగినది దేవా ! నన్నుక్షమింపుఁడు.

కృష్ణ—మంగళా ! కాలము నతిక్రమించి చరించినవారెవ్వరును లేరు. ఎంచుచేత ననఁగా.

ఉ. కాలముచేతనే సుమి జగాన జనించుఁ బ్రవృద్ధిఁగాంచు భూ
తాళి నశించుఁ దన్మహిమ కంతముఁగానము సూర్యచంద్రులున్
గాలముఁబట్టియే గతులు గాంతురు సర్వముఁగాలమూలమే
కాలము మంచిదైనపుడు గాని జనుండు సువృత్తిగాంచునే ?

మంగ—దేవా ! వాస్తవము వచించితిరి.

కృష్ణు—మంగళా! ఈవిషయము బాగుగ జ్ఞాపకముంచుకొనుము. ఇసుళ్ళు దీపముమీఁదికి బోవును. తమదేహముఁ గాల్చికొనును. మరలవ్రాలి యంగముల నాహుతిచేసికొనును. అప్పుడు సైతముఁ దమ్ముఁదాము తెలిసికోఁజాలవు. చివరకుఁ బ్రాణములర్పించును. అట్లే యధముఁడు సంసారదుఃఖము లెఱింగియు మనస్సును ద్రిప్పికొనఁజాలఁడు. లోకము లోనందఱను గృపాదృష్టితోఁ జూడఁడు. చోరు లెంత దండితులైనను చౌర్యముమాత్రము విడువరు. అన్నిటికంటె లోకములో నెక్కుడు రసవంతము ప్రేమ. అది విచ్చలవిడిగా విహరించుచున్నది. తనుధనయౌవనములు పోయినను మానఁజాలకున్నారు. ఇట్టిపాపులుపదేశముమీఁద మనస్సుపెట్టరు. అందఱును సంసారమునందు సంతాపమునొందుచునే యున్నారు. సమయమువచ్చినప్పుడు నాభక్తులైన వారిని బాగుచేసి సుజనులను జేయుదును. అంతమందు వారానందసౌఖ్యములు పొందుదురు. నీకింకను గొన్ని విశేషములు చూపించెదనురమ్ము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

5 రంగము. చింతామణి గృహము.

[చింతామణి యీశ్వరోపాసన చేయుచుఁ బ్రవేశించుచున్నది]

కాంభోజీ—(హుసేనీ) రాగము—ఆటతాళము.

పల్లవి॥ సహచరి సమరస-మిహామృగయం తే॥

అ॥ సజ్జనసంగరతామునయో భువి-నిగమ శిరస్సుఖదం తే॥

గిరితరుసాగర సరిదపరాత్మతయా-సతి భాతిముకుందం
సురనరఖగమృగ రూపతయాపి-విభాతిచిరం సుఖకందం॥ సహచరి॥ 1
ఇహమధుమాధవ ముఖర్తువత్సర-రూపతయాపివిభాతి
దినకరతారనిశాకర పావకభూజల-భావముపైతి॥ సహచరి॥ 2
గగనమరుద్విభాత్మతయాపి-పరాత్మని సర్వదృగంశే
అహమహమిత్యనుభూతివిశేషణ-భూతతయానుభవాంశే॥ సహచరి॥ 3

అన్న—(ప్రవేశించి) ఏమమ్మాయి! ఎవరితోనైన మాటాడు నిచ్ఛయున్నదా?

చింతా—ఆఁ! ఉన్నది. ఎవఁడు సర్వాధారుఁడై యున్నవాఁడో యాపరమమిత్రునితో మాటాడునిచ్ఛయున్నది.

అన్న—ఆమిత్రునిపేరు?

చింతా—సుందరశ్యాముఁడు. శిరమున నెమిలికన్నులు-కంఠసీమఁ బుష్పహారముఁ గలిగి యందఱకంటెను మనోహరమైన రూపముగల యాసుందరశ్యాముఁడే నాప్రియమిత్రుఁడు.

అన్న—ఎవనియొద్ద ధనమున్నదో వాఁడే మన సుందరశ్యాముఁడనియా నీయూహ—

చింతా—అన్నా! కాదుకాదు. అట్లనకు. గర్భమందలి శిశువు నెవఁడు కాపాడునో యెవఁడు జ్ఞానామృతధారను బ్రవహింపఁజేసి సకలముముక్షుజనులను రక్షించునో యట్టిసుందరశ్యాముఁడు నాపరమమిత్రుఁడు. జ్ఞానమును-భక్తిని-ముక్తిని-ధనమును-శాంతమునుగూడనిచ్చుచున్నాఁడు. ఆదివ్యమంగళమూర్తిని-ఆలీలామానుష స్వరూపుని మఱచి ప్రవర్తించుట మహాపాతకము.

అన్న—చింతామణీ! కులవృత్తి మానివేయుదువా యేమి? నీవాసుందరశ్యామునిమీఁద నాధారపడియున్న నింకబ్రదుకు టెట్లు?

చింతా—అన్నా! నీ వెంత వెఱ్ఱివాఁడవు! ఱాతిలోనికప్ప కాహారమిచ్చిన దైవము-గాలిలోనిపక్షి కాహారమిచ్చిన కరుణాళువు - ద్రౌపదీమానరక్షణముఁ జేసిన విశ్వజనకుఁడు-మనలను గాపాడకుండునా?

అన్న—(స్వగతము) ఈమె భక్తురాలైనది. ఇంకనిల్లు నాశనమైపోవును. నేటికి శనిపట్టినది. (కోపముతో వెళ్లును)

చింతా—ఓతుచ్ఛశరీరసంరక్షణాసక్తులారా! దుర్మార్గకార్యము లాచరింపకుఁడు-విశ్వజనకుఁడైన వ్రజవల్లభుని గీర్తింపుఁడు. శత్రునాశకుఁడా! భగవంతుఁడా!

మ. ననుభూతంబులనుండి కావుము జగ ఽ న్నాథా! దయాసాగరా!
నినుధ్యానించుచుఁ బండుకొందునిటఁ దం ఽ డ్రీ! జ్ఞానబోధామృతం
బును నాకుందయచేయుమా? యచలమై ఽ పూర్ణప్రభాయుక్తమై
ఘనమై పావనమైయొసఁగు భవదా ఽ కారంబుదర్శింపఁగన్.

[వసారాగదిలోనికి వెళ్ళి పండుకొనును]

[బిల్వమంగళుఁడు నదిలో నొకశవముఁబట్టుకొని యీదికొనుచువచ్చి గట్టుజేరును]

బిల్వ—(స్వగతము) ఎట్లుకనుఁగొంటినో కదా! ఏధీరత్వముచే నిచ్చటికి రాఁగల్గితిని! ఎంతభయంకరమైనరాత్రి! మనుష్యులు-పక్షులు- జంతువులు- సర్వము నిద్రావస్థయందున్న సమయమిది. ఎవరైన మేలుకొన్నవారుందురా? ఒక్క ప్రేమయే మేల్కనియున్నది. ఓప్రేమదేవీ! నీకువందనములు. కేవలము నీవొక్కతెవే మేల్కనియున్నావు. శత్రువులనుండి విడిపించి నీభక్తులకు సహాయమిచ్చుటకు ఓవీరదేవీ! నీవొక్కతెవే యున్నావు. (చింతామణి సౌధమువంకఁజూచి) ద్వారములన్నియు మూఁయఁబడియున్నవి. ఆహా! ఈగోడపై నెట్టి త్రాడున్నది! ఓహో! నేను వచ్చుట కొంచెమాలస్యమగు నేమోయని యెంచి నాప్రియురాలీ త్రాడును నాకొఱకై వ్రేలాడఁగట్టినది కాఁబోలును. మేడమీఁది కెక్కుటకు మార్గముఁ జూపించినది. (పామును త్రాడనుకొని దానివెంబడిఁ బైకెక్కును) ఆహా! నిద్రించుచున్నది. ఎటువంటి సుందరపుష్పము! మన్మథుని మోహనబాణమే యిది! (ప్రకటముగా) ప్రియా ప్రాణప్రియా! పిలిచినను బలుకఁజాలని గాఢనిద్రలో నున్నది. ప్రియా! నీకురులాకాశమునుండి భూమివఱకును వ్యాపించినవా యనునట్లు చీకట్లుక్రమ్మినవి. ఈపాపిడిమీఁదిది మణికాదు. నక్షత్రమొకటివచ్చి వ్రాలినదా యనునట్లున్నది. గట్టిగాఁబిల్చి లేపుదునా? ఆలస్యముచేసినచో నుదయమగు నేమోయని భయమగుచున్నది. లేపుదునా! మానుదునా! (ఆలోచించి) లేపెదనుగాక! (బిగ్గఱగా) ప్రియా! లెమ్ము. ఓనిద్రాదేవీ! లెమ్ము.

చింతా—(లేచి) ఆఁ! పైకెవ్వరువచ్చిరి?

బిల్వ—ఎవ్వని నీప్రేమలాగికొనివచ్చినదో యాతఁడే.

చింతా—బిల్వమంగళుఁడా!

బిల్వ—అవును. ఎవనిబొందిలో నీవు ప్రాణమవైయుంటివో యాబిల్వమంగళుఁడే.

చింతా—బిల్వమంగళా! ఎంతపనిచేసితివి! అర్ధరాత్రము - ఘోరాంధకారపరివృతమైన యరణ్యము దుష్టజంతువులు - ప్రవహించుచున్న యగాధ

మహానదిలోని పెద్దపెద్దచేఁపలు తాబేళ్ళు మొసళ్ళు-ఇవేమియు నిన్నాతంకపఱచలేదా? అయ్యో! ఎట్లు రాఁగల్గితివి?

బిల్వ—నిరాతంకముగా రాఁగల్గితిని. మెఱపుమెఱసి నాకీ ఘోరరాత్రియందుఁ ద్రోవఁజూపించినది. నదీతరంగములు దుంగనొకదానిని నాకొఱకై తెయొడ్డునఁ జేర్చియుంచినవి. వాయుదేవుఁడు నాకుపయోగమగునట్లు గాలివీచెను. నదీమతల్లి నన్నుఁ బ్రేమరూపుఁడగు కృష్ణుఁడనుకొని ప్రవాహవేగముఁ దగ్గించి కుశలముగా గట్టుఁజేర్చినది.

చింతా—ద్వారములు మూయఁబడియున్నవే! పైకెట్లు రానేర్చితివి!

బిల్వ—బాగుగనేయున్నది! నీవు త్రాడొకటి నేనెక్కివచ్చుటకై వ్రేలాడఁగట్టలేదా?

చింతా—ఏమీ! త్రాడు వ్రేలాడఁగట్టితినా! ఇదియేమో నాకుఁదెలియకున్నది. బిల్వమంగళా! ఆత్రాడును గట్టును నాకుఁ జూపింపఁగలవా?

బిల్వ—క్రిందికి నడువుము-చూపించెదను.

[ఇద్దఱును మేడదిగి క్రిందికివచ్చి శవమును
సర్పమును బరీక్షించుచున్నారు.]

చింతా—(పరిశీలించి) ఛీ! ఛీ! అనర్థ బిల్వమంగళా! నీకుఁ గన్నులున్నవా?

బిల్వ—ఉన్నవి. నీచూపులలోని సూర్యునివలెఁ బ్రకాశించుచున్నవి.

చింతా—కన్నులుండియు నింతటి యంధుఁడ వైపోతివేమి? అయ్యయ్యో! బిల్వమంగళా!

చ. కనులు కనంగరావా! విటకత్తియసేవయె దేవసేవగా
మనమున నెంచినావా! యభిమానము మానముఁ జంపుకొంటివో!
కనుమిది దుంగయో! మఱి యొకండగునో! యల గోడమీఁదనుం
డినయది త్రాడొ! వేఱొకఁడొ! నిశ్చల బుద్ధిఁదలంచి చూడుమా!

బిల్వ—(చూచి) ఇదియే మిదియేమి! ఈదుంగయుఁ ద్రాడును శవసర్పములైనవే! మొట్టమొదట నాకివియిట్లు కన్పడినవి కావే!

చింతా—మొదట నీకెట్లుకన్పడును! నీనేత్రములయెదుటఁ బాపరూపమగు తెఱయొకటియున్నది. నీప్రతిరోమకూపమును బ్రత్యంగమును నత్యంత మలినావృతమైయున్నది. ఓయి విషయభోగాంధుఁడా! సర్పమునకును

ద్రాక్షకును భేదముఁ దెలిసికొనలేకపోయితివే! నీవు విషయభోగాంధుఁడవైతివి. అయ్యో! నీవు పాపరూపవిషముచే విషమయసర్పమునుగూడ నోడించితివే!

బిల్వ—చింతా! నేఁడు నీవిట్టివింతమాటలు చెప్పుచున్నావు! ఇప్పుడే నిద్రనుండి లేచుటచేతనో లేక నాప్రేమను బరీక్షించుటకో యిట్లాడుచున్నదానవు.

చింతా—ఇట్టివిపరీత ప్రేమపైఁ బిడుఁగుపడుఁగాక! నీప్రేమ కూలిపోవుఁగాక! ఓయి మహామూర్ఖుఁడా! నీకు నాయందెంత ప్రేమయున్నదో యందులో సగముప్రేమ నీ కా శ్రీకృష్ణపరమాత్మమీఁద నున్నయెడల నీవు సదా మునిఁగి తేలుచున్న భవసాగరము నీది తరింపఁగల్గుదువుకదా! ఎందఱనో పాపుల నుద్ధరింపఁ గల్గుదువుకదా!

శా. ఆశాపూరిత ఘోరసంసరణ మోహాంధుండవై దుర్భ్రమా
వేశంబున్ విడనాడలేకిటులు దుర్వృత్తిన్ విజృంభించి స
ర్వేశ ధ్యానము నైన తమ్మున్ మరచితే! యేమందు నీనతజ్ఞాన
ప్రాశస్త్యంబిటు లుండె నింకనయినన్ బ్రజ్ఞాన మార్జింపుమా!

బిల్వ—ఏమి! ఒక వేశ్య బ్రాహ్మణునకు బ్రాహ్మణరూపముఁ దెల్పుచున్నదా! స్త్రీ పురుషున కోంకారశబ్దము ధ్వనింపఁ జేయుటా! ఛీ! ఛీ! ఎంతనీచము! ఓనీచబ్రాహ్మణుఁడా! ఓమూర్ఖబుద్ధిపూరుషా! ఇంద్రియములను వశమునందుంచుకొనక స్వయం రక్తమును బ్రవహింపఁజేసితివి. నీచము! నీచము! ఇట్టి నీజీవనము గర్హ్యమైనది. జీవితముయొక్క విలువ తెలిసికొనలేక నేకపాపములు చేసితిని. నాయింటిని నేనే కఠినాపరాధమను నగ్నిచేఁ గాల్చికొంటిని. విషయలోలుఁడనై విశ్వాసఘాతుకుఁడనై నాస్తికుఁడనై విఘ్నకారుఁడనై నాచేతులార నన్ను నేను గాయపఱచుకొంటిని.

చింతా—ఉదయ మందింటికివచ్చుటఁ గాలవశమున మఱచి సాయంకాలమునకుఁ జేరుకొనుట యొక గొప్పతప్పుకాదు. బ్రహ్మాసనమునందు స్థిరుఁడవై కూర్చుండి మనస్సునుండి దుర్వాంఛలను బాపములనుదోలించి యీశ్వరునియందు దృఢమైన విశ్వాసప్రేమలుకలిగి భక్తియను పుష్పవనము

నందు నీమనస్సును విహరింపఁజేయుము. నేటినుండి భోగవిలాస విషయములు విడువుము. సర్వబంధ విముక్తుఁడవై ముక్తిప్రదాతయగు శ్రీకృష్ణునిగొల్చుచు నాతని బాంధవ్యము సంపాదించుకొనుము.

బిల్వ—ఆహా! నేనేమిచేసితిని! వేదరూపరత్నమును బాపరూపమగు మంటిలోఁ బూడ్చితిని. జీవనము బాగుచేసికొనుట కొక్కయుపాయమైనఁ జూచికొనలేదు. మనస్సును గామపంకమగ్నముఁ గావించుకొంటిని. కటకట! ఇంకనాబ్రదు కేమగును? బ్రద్దలగుఁగాక! బ్రద్దలగుఁగాక! ఓపరమపితా! చిత్రగుప్తా! నన్ననుగ్రహింపుము.

గీ. తండ్రి! చిత్రగుప్త! దయవహించి మదీయ । వృజినవితతిఁ బడిచి వేయుమయ్య
దుడుకుఁ గొడుకు చేయు దుండగంబులు తండ్రి । సైచుఁగాని శిక్ష సలుపఁగలఁడె?

చింతా—బిల్వమంగళా! పశ్చాత్తాపము కొంతవఱకు వృజినాటవిని దహింపఁ గల్గును.

బిల్వ—ఎంతటి యనర్థజీవినైతిని! ఇప్పుడు నే నేనోటితో భిక్షాదానమడుగుదును! గాడిద కిప్పు డమృతపానేచ్ఛకలిగినది. నాగుండెలు వ్రక్కలుచేసికొందునన్న నిక్కడ నేమియు సాధనములేదు. ఈశ్వరపాదారవిందములనీఁడికి వంగఁజాలని నాశిరస్సు సహస్రఖండములగుఁగాక! (మూర్ఛిల్లును.)

చింతా—సోదరా! బిల్వమంగళా! లెమ్ము లెమ్ము. జ్ఞానాగ్నిలో నీమనస్సు నాహుతిచేయుము. ధైర్యమువహించి సన్మార్గమవలంబింపుము. భక్తిరూపహస్తి నారోహించి యింద్రియములను దఱిమివేయుము. ఈశత్రువులను జంపి స్వర్గమును నీవశమునందుంచుకొనుము.

బిల్వ—[లేచి] హా! ఈశ్వరా! విశ్వజనకా! ఎట్టిమాయలందుఁ బడియుంటిని!

ఉ. ఎంతటిమాయనిద్రఁ దపి యుంచుచునుంటి జగంబుమోహసం
క్రాంతముగా నెఱింగియును గాంతసుఖైక నిధానమంచు వి
భ్రాంతుఁడనై పరాత్పరుని బ్రార్థనసైత మలక్ష్యపెట్టితిన్
శాంతిలభించె నిప్పటికిఁ జానయొకర్తుక కారణంబుగన్

చింతా—బిల్వమంగళా! నీవిప్పటికి ధన్యుఁడవైతివి.

బిల్వ—పాపభారముచేఁ గ్రిందికణఁగిపోయితిని. వేదపాఠము లేక జడుఁడనైతిని. ఒక్కసత్యవాక్యము మనస్సునుదిప్పినది. జ్ఞానమయప్రకాశమొక్కటి

పుట్టి నాకుదారిఁజూపినది. (చింతామణితో) మాతా! ధన్యురాలవు! ధన్యురాలవు! నీవే నన్ను ఘోరనిద్రావస్థనుండి మేలుకొల్పి ప్రబోధముఁ గూర్చితివి. నీవునిజముగా నాపాలిటి ప్రబోధచింతామణివైతివి. అధర్మమునుండి రక్షించితివి. అజ్ఞానమహాసముద్రమును భక్తినౌకాసహాయమున దాటించితివి. ధన్యుఁడను ధన్యుడను. చింతను జింతామణి హరించినది. తప్పక గోపాలకృష్ణుని దర్శింతుఁగాక! మాతా! నమస్కారము! (చింతామణిపాదములపైఁబడును.) (దూరముననుండిభక్తిదేవికన్పడును.) (కామదేవి తానుభక్తిదేవి కోడుటవలన లజ్జఁబొందును. గరుడవాహనారూఢుఁడై శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చును. తెరవాలును.)

ఇది ద్వితీయాంకము.

ప్రబోధచింతామణి.

తృతీయాంకము.

1. రంగము. అక్బరుచక్రవర్తిదర్బారు.

[ప్ర॥ అక్బరు సింహాసనారూఢుఁడైయుండును. మంత్రులు మొద లగువారు యథాయోగ్యముగాఁగూర్చుందురు. చెలికత్తెలు పాటలుపాడుచు నృత్యముచేయుదురు.]

అక్బరు—మంత్రీ! మనరాజ్యమందలి ప్రజలందఱు నెట్లున్నారు?

మంత్రి—మహాప్రభూ! అక్బరుచక్రవర్తి ప్రజాధిపుఁడైయుండఁ బ్రజలకు లోపముండునా? మనరాజ్యమున ఫకీరను పేరేవినఁబడదు.

అక్బరు—అట్లయిన మేము మిక్కిలిధన్యులము. మంత్రీ! పండితరామదాసుని కుమారుఁడగు బిల్వమంగళుని ప్రియురాలు చింతామణి గానవిద్యాప్రవీణురాలని పలుమాఱుచెప్పితివి. ఇప్పటివఱకు నామెను బిలిపించి యాసంగీతవిశేషమున మాకుఁ గర్ణరసాయనము చేయింపక పోయితివికదా!

మంత్రి—మహాప్రభూ! నిస్సందేహముగా నామె ప్రజ్ఞావంతురాలు. మనతానసేనునికంటెను విద్యావతియని చెప్పవచ్చును. ఆకసమునందలి కిన్నరగంధర్వులెల్ల నామె యసామాన్యసంగీతనాట్యాభినయములఁ జూచి యాశ్చర్యముఁజెందుచుందురు. ఆసంగీతపాటవమునకుఁదోడు సౌందర్యముకూడ వన్నెఁదెచ్చుచున్నది.

తాన—ఓహో! చెప్పుము చెప్పుము. మంత్రిశేఖరా! చింతామణి యంతటి ప్రజ్ఞావంతురాలా!

అక్బ—చింతామణివృత్తి వేశ్యావృత్తియేకదా!

మంత్రి—మహాప్రభూ! అవును. చింతామణి పుట్టుకచేత వేశ్యయై కులవృత్తి నవలంబించినను దైవసంకల్పముచేత నిప్పుడు సత్యమార్గ మవలంబించినది. మొదట డబ్బుకొఱకు కెన్నినీచకృత్యములైనఁ జేసినది. డబ్బునకు దాసియైయుండెడిది. నేఁడు శ్రీకృష్ణునిచరణదాసియైనది. అధముఁడైన

బిల్వమంగళునకుఁగూడ జ్ఞానబోధముఁగావించి యుత్తమునిగాఁ జేసినది. చింతామణి నిప్పుడు నిజముగాఁ దపస్వినియని చెప్పవచ్చును.

తాన—ఆహాహా! తపస్వినియైన చింతామణియొక్కయు శిష్యుఁడైన బిల్వమంగళునియొక్కయు సంగీతము శీఘ్రకాలములో విందుముగాక బోలు!

అక్బ—వేశ్య యోగినియైనదా? ఇప్పటివఱకు నేనిట్టిది వినలేదే!

మంత్రి—ఇప్పుడిక్కడఁజూతురుఁడు. చూచి పరీక్షింపుఁడు.

అక్బ—మంచిది. నేనిప్పుడు చింతామణిని బిలిపించెదను. ఇంక సభ చాలింతము.

(తెర వాలును.)

2. రంగము. చింతామణి గృహము.

భ్రమణుఁడు ప్రవేశించుచున్నాఁడు.

భ్రమ—(స్వగతము) ఓ చంచలహృదయమా! హో! ఎవరికొఱకు నేఁడు వ్యాకులముఁ జెందుచుంటివో యాదేవి యీగృహమందే నివసించుచున్నది. (ప్రకటముగా) చింతామణీ! ఎవరు లోపల? (ఒక బాలుఁడు వచ్చును)

బాలు—ఓహోహో! భ్రమణుఁడుగారా! శ్రేష్ఠిగారూ! చిరకాలమునకు దయచేసినారు.

భ్రమ—అవునుగాని మీస్వామిని యేమిచేయుచున్నది?

బాలు—ఎవరు? అన్నకు అమ్మమ్మా?

భ్రమ—అరే! అదికాదు. మీచింతామణి.

బాల—ఆమెయా! లోపలనున్నది. వెళ్ళిపిల్చికొనివత్తునా?

భ్రమ—త్వరగాఁ దీసికొనిరా.

బాలు—(వెళ్ళును)

భ్రమ—నేనీవేళ నాప్రేమను ప్రకటించెదను. ఆమె తప్పక స్వీకరించునన్న నమ్మకము నాకుఁగలదు. అదిగో! ఆమె వచ్చుచున్నది. ఏమి సౌందర్యము! ఏమినడక! ఏమిసొగసు! ఆహా! చింతామణి! ముద్దుచింతామణి! ఆహా!

చింతా—(ప్రవేశించి) శ్రేష్ఠిగారూ! రండు దయచేయుఁడు. చాలదినములకు మీదర్శనమైనది.

భ్రమ—చింతామణీ! నేనిప్పుడిక్కడికి వచ్చుటకుఁ గారణమేమో తెలిసినదా?

చింతా—ఈప్రశ్నమునకర్థమేమో! శ్రేష్ఠిగారూ! నేఁడు నేను ప్రపంచమును మఱచియున్నాను. నన్నే నేను మఱచియున్నాను.

భ్రమ—అవును. నిజమే. నీవిప్పుడు బిల్వమంగళుని విడిచి యెవనినో యొకనిఁ బ్రవేశపెట్టిని ప్రేమించుచున్నట్లున్నది.

చింతా—సోదరా! క్షమింపుము. ఇప్పుడు నాచెవు లిటువంటి నీచవాక్యములు వినఁగోరుట లేదు.

భ్రమ—నేనుగూడ నామాటయే చెప్పఁదలఁచియుంటిని. ఇప్పుడు మీకు ధనము నాలుగువైపులను కన్పించుచున్నది. బీదలు మీకుఁగన్పింతురా? నేను నీస్వరూపముపై మోహితుఁడనని నీ వెఱుంగుదువుకదా!

చింతా—అయ్యా! పోయిరమ్ము. నీమాటలవలనఁ బ్రయోజనము లేదు. నా మనస్సు శ్రీకృష్ణభజనానంద మగ్నమైయున్నది.

భ్రమ—అట్లయినఁ జింతా! చింతా! నేను నిజముగా నిరాశఁ బొందవలసినదే! నీవు నానిజమైన ప్రేమ నాదరింపవా? ఇది నీకు న్యాయమా? ఓపాడు హృదయమా! వాస్తవముగా నీవు నన్నుఁ గృశింపఁజేసి చంపుదువా?

చింతా—ఓయి కామాతురుఁడా! సర్వరోగములకుఁ గామమే మూలము. అందుచేతనే జ్ఞానులు కామమును ద్యజింతురు.

భ్రమ—చింతా! ఈలక్షాధికారి నీయౌవనసుఖాపేక్షచేఁ బ్రాణములు సైతము సమర్పింప సంసిద్ధుఁడైయున్నాఁడు. నాయొక్క మనవి స్వీకరింపవా? నీసుందరస్వరూపమను దీపమునందు దీపపుఁబుర్వునైన నన్నుఁ దగులఁబడనీయవా?

చింతా—ఓయి వెఱ్ఱివాఁడా! ఇది దీపము కాదు. నరకములోని కాలాగ్నికుండము. ఇది స్వర్గము నుద్యానమునుగాదు. నీవింక విషయలోలత్వముఁ గట్టిపెట్టి వెళ్ళిపొమ్ము.

భ్రమ—మంచిది మంచిది. అలాగే పోయెదను. కాని నీవు నన్ను నిరాశుని జేసి పంపితివని మాత్రము జ్ఞాపకముంచుకొనుము.

చింతా—సోదరా! పోయిరమ్ము. పోయిరమ్ము.

భ్రమ—(నిష్క్రమించును.)

[తెరలో]

జయనారాయణ! జయనారాయణ! మేమెవ్వరమనియా యడుగుచున్నారు!
మేము బృందావన వాసులము.

చింతా—వెలుపల నెవ్వరు నిల్చియున్నవారు?

బాలకుఁడు—(ప్రవేశించి) అమ్మా! భిక్షుకుఁడు మఱెవ్వరు!

చింతా—ఓరి దుష్టా! ఊరకుండుము. సాధువును భిక్షుకుని జేయుచున్నావా? పొమ్ము-ఆయనను గారవించి లోనికిఁదీసికొనిరా.

బాల—వహ్వా! చింతామణి భక్తురాలైనది. (వెళ్ళును.)

అన్న—(ప్రవేశించి) చింతామణీ! నీకిదేమిపని! డబ్బిచ్చువారి నేదో వైరాగ్యబోధచేసి సాగనంపుటయు భిక్షుకులను గారవించుచు లోనికిఁ బ్రవేశపెట్టుమనుటయునా! నిన్ను నేనిందుకొఱకా పెంచినది?

చింతా—కానిచో నన్ను నరకాగ్నిలోనికిఁ ద్రోయుటకా పెంచితివి.

అన్న—నరకమా! ఇది మనకుఁజిరకాలమునుండి యాచారమై యున్నకులవృత్తి

చింతా—ఈకులవృత్తి నరకద్వారము.

సీ. మాయమాటల మత్తుమందులుపైఁజల్లి। వయసుకాండ్రను మోహవల్లిఁజుట్టి
వలపున్న లేకున్న వలపించి వలచి రొక్కపుమూటకై నీతిఁ గట్టిపెట్టి,
కుంటు గ్రుడ్డులకైనఁ గుష్ఠురోగులకైన। బోకలాకులఁదెచ్చి ముందఁబెట్టి,
చెలికి భూషణమైన సిగ్గు వీధులమేళ। తాళాభినయములఁ దగులఁబెట్టి,
గీ. స్వకులవృత్తి యటంచుఁ దుశ్చతరమైన। పాడువృత్తిని జేపట్టి వారకాంత
తనకునాశముఁదాఁదెచ్చుకొనుచునుండె। గటకటా! కాలమెంతవక్రగతినుండె॥

అన్న—ఇట్లన్నచో మఱి యేమితింతువు?

చింతా—భగవంతుఁ డిచ్చినదే. ఏప్రభువు గజేంద్రుని మనవివిని యాతని బాధ హరించెనో యేప్రభువు ప్రహ్లాదునిరక్షించి నారదుని మనస్సుననుండిన మోహమును బోఁగొట్టెనో యేప్రభువనేక పాపులను దరింపజేసెనో యేప్రభువు రావణునకు వైకుంఠపదము నిచ్చెనో యామహారాజే నన్నుఁ బాలించునని మనస్సున దృఢనిశ్చయముకలదు.

అన్న—ఏగృహమందుఁ గులవృత్తి నిరాదరింపఁబడునో యదినష్టమగుట కెంత కాలము కావలయును? నీవిట్టిదానవగుదువని యెన్నఁడు ననుకొనలేదు. (కోపముతో నిష్క్రమించును.)

సాధువు—(ప్రవేశించి) తల్లీ! జయశ్రీకృష్ణ! జయవాసుదేవ!

చింతా—జయశ్రీకృష్ణ! స్వామీ! దయచేయుఁడు. ఇక్కడి కెట్లువచ్చితిరి?

సాధు—నేను మీపేరువినివచ్చితిని. ఏదైన హరిగానము వినిపింపుఁడు-మీకుఁ గళ్యాణమగుఁగాక!

చింతా—ఆహాహా! హరినామస్మరణముఁ గోరు మీరు ధన్యులు!

కేదారగౌళరాగము—ఆటతాళము.

పల్లవి. కలయ యశోదేతవ బాలం। ఖలబాలక ఖేలనలోలం

1 అపహృత బహుతర నవనీతం। అనుపమ లీలానటనకృతం
కపటమానుష బాలకచరితం। కనకకందుక ఖేలననిరతం। కలయ॥

2 పథిపథిలుంఠిత దధిభాండం। పాపతిమిర శతమార్తాండం
అధికబలోద్ధృతజగదండం। ఆనందబోధ రసమఖండం॥ కలయ॥

3 మల్ల బాలక ఖేలనచతురం। మనసిజకోటిలావణ్యాధరం
కళ్యాణగుణ నవమణినికరం। కమనీయకౌస్తుభమణిశేఖరం॥ కలయ॥

సాధు—నీవు సుఖింతువుగాక! ఆనందసౌఖ్య మనుభవింతువుగాక! మాతా! నమస్కారము. నాకు సెలవిమ్ము.

చింతా—(లేచి) స్వామీ! నమస్కారము.

సాధు—(నిష్క్రమించును.)

అన్న—(ప్రవేశించి) హరిభజన మెక్కువైనది. చింతామణీ! చూడు-అక్బరు చక్రవర్తి యొద్దనుండి యొకఁడు వచ్చియున్నాఁడు. మర్యాదగా నతని దీసికొనివచ్చితిని.

చింతా—చక్రవర్తి యెవఁడు? ఈ తీసికొనివచ్చు టెవరిని? నాచక్రవర్తి మదనమోహనుఁడయిన గోవర్ధన ధరుఁడు.

అన్న—ఓసీదుర్బుద్ధీ! ఆయన మహారాజు! మనముప్రజలము-మనకాయన యాహ్వాన మంపినవాఁడు. మనమక్కడికి వెళ్ళనిచో నాయనసిపాయిలు వచ్చి మఱి తీసికొనిపోవుదురు. అక్బరనఁగా నేమనుకొంటివి? కత్తికిందిజింక రొమ్ములు గడగడలాడునో యట్లే యాచక్రవర్తి శాసనమన్నఁ బ్రజలందఱు భయకంపిత శరీరులగుదురు.

చింతా—భయపడుచున్నారా? ఎవరు ధనమే ముక్తికారణమనియుఁ బ్రపంచ మొదలిరాజులు పరమాత్ములనియుఁ దలంతురో యట్టివారు కుక్కల కంటెను నీచులుసుమా!

అన్న—నీయుపన్యాసములింకఁ గట్టిపెట్టు. నీకిష్టమున్న వాఁడిచ్చురూపాయల సంచి యింటిలో వేసెదను. లేదా మనకడ దక్కదు.

చింతా—నీమాటలువిని నే ననేక పాపము లాచరించితిని. నేటికి బుద్ధివచ్చినది. నీమాయలోనింకఁ బడుదాననుగాను.

(ఇద్దఱును నిష్క్రమింతురు.)

3 రంగము—సోమగిరి కుటీరము—

[సాధువులుకొందఱు భజనచేయుచుఁ బ్రవేశింతురు.]

ఒకసాధువు—"పరమాత్మ" శబ్దము వినఁబడఁగనే జగత్తుయొక్క మాయ మాయమగును. జీవితమును బ్రాపంచక సుఖదుఃఖములపాలుచేసి వ్యర్థము గావించుకొనకుఁడు—మానవులారా! మానవజన్మ మెత్తినందులకు మూర్ఖులుకాక కొంతసుకృతము సంపాదింపుఁడు. భవసాగరమునుండి తరింపఁజేయు శ్రీరామనామమును జపింపుఁడు—ఎవఁడు రామనామమునకుఁ బెడమొగము వెట్టునో వాఁడు భవసాగరప్రవాహమున మునిఁగిపోవును.

బిల్వ—(ప్రవేశించి) ఓరామనామ పరాయణులారా! నాకథఁగూడ వినుఁడు—నేనును మీరుభజించు మోహనమూర్తియొక్క భక్తుఁడనే. వైరాగ్యముఁబూని మీవంటివిజ్ఞానుల సందర్శనముఁగోరి వచ్చితిని. దేశమువదలి భిక్షుకుఁడనైన దాజగన్మోహనునికొఱకే. భవసాగరమున మునింగిపోవుచున్న నన్నుఁదరింపఁజేయుఁడు.

సోమ—ఓయి భిక్షుకుఁడా! నీపేరేమి?

బిల్వ—ఈశరీరమును బిల్వమంగళుఁడని యందురు.

సోమ—సంసారమునుండి విరాగివెట్లయితివి.

బిల్వ—విజ్ఞానము నాకొకవేశ్యయిచ్చినది. ఇప్పుడు మీరునాకుఁ బ్రజ్ఞాన ముపదేశించి యనుగ్రహింపుఁడు. శ్రీహరికృపచే భక్తుఁడు జగన్మాయనుండి

విడుదలయగును. భక్తిసుఖమువలన జీవుఁడు పరమానందముఁ గాంచును. నాయందు దయయుంచి జ్ఞానోపదేశముఁ గావింపుఁడు.

సోమ—వేశ్య జ్ఞానోపదేశముఁజేయుటకుఁ బాత్రురాలుకాదు. నీయట్టియధమునకు నేనుపదేశము చేయఁజాలను.

బిల్వ—గురూత్తమా! ఈజీవరూపలతిక యాశాపాశములచే బాధింపఁబడినది తృష్ణారూపకమైనకాళులు మార్గమునడచి దుర్బలములైనవి. మఱియుఁ గర్మరూపకమగు బరువును శిరస్సునఁదాల్చి జన్మరూపాటవులలో నిట్లు తిరుగుచున్నాను. వీనిని సన్మార్గమునకుఁ దీసికొనిరండు. బిల్వుఁడు—అధముఁడు—అజ్ఞాని జపతపోయోగాదులు చేయలేదు—విషయసుఖ భోగములలోఁబడి యాయువు క్షీణింపఁజేసికొనినాఁడు.

సోమ—పొమ్ము! లేచిపొమ్ము! నీవుపదేశమున కర్హుఁడవుకావు—పొమ్ము—పోనిచో శాపముచే భస్మమైపోవుదువు.

బిల్వ—మహాత్మా! ఎక్కడికిఁబొమ్మందువు? దీపపుఁబుర్వు దీపమునుపువ్వు నెట్లు వదలిపోలేదో యట్లే నేనుగూడ మీవలన నుపదేశముఁబొందకుండఁ బోయి బ్రతుకఁజాలను. మీరు గురుమంత్ర ముపదేశింపనియెడల నేను తప్పక ప్రాణత్యాగ మొనర్చెదను. ఈశరీరము విషయపూరితమైనది. గురువమృతపుగని. ఉపదేశమిచ్చు గురువు లభించినయెడల నదియే మహాభాగ్యము.

సోమ—మూర్ఖుఁడా! నీవంటి యధమునకు గురుమంత్రమీయ లేనని చెప్ప లేదా?

బిల్వ—(ప్రక్కకుఁదిరిగి నమస్కరించుచు) జ్ఞానరూపమగు దినమును బ్రకాశింపఁజేయు నోసూర్యుఁడా! అజ్ఞానరూపమగు తమమును నాశనము చేయు చంద్రుఁడా! ఓదయాభాండారమా! నన్ను నిరాశునిజేయకుండ గురుహృదయమున దయాప్రకాశ మొసంగుఁడు—మొసలినోటినుండి గజేంద్రునివిడిపించిన ప్రభువా! కంసునినామము సృష్టినుండి నాశముఁ జేసినస్వామీ! ఘోరకలియుగమునుండి ఋషులను రక్షించు భగవంతుఁడా! నిన్నుమఱచి చరించువానిని సన్మార్గమునకుఁదెచ్చు దీననాథా రక్షింపుము. కృష్ణా! జగన్మోహనా! గోవర్ధనధరా! రక్షింపుము రక్షింపుము.

కృష్ణు—(ప్రవేశించి) ఆహా! నాభక్తుఁడు జ్ఞానోపదేశమునకై యాచించినను నిరాదరింపఁ బడుచుండెఁగా! నాభక్తుఁడిట్టికష్టములొందుటయా! కాదు కాదు. ఎవఁడు నాభక్తుఁడై నన్ను సదా సేవించుచున్నాఁడో వానికిశాశ్వతానందసుఖమిచ్చుచున్నాను. ఇప్పుడొకలీల చూపించుటయవసరము. నేఁడు మంగళుని మనస్సులోఁ దనవంటిభక్తుఁ డిండొకఁడుఁ లేఁడని యహంభావముపుట్టినది. మరియు నీసాధువేషధారులైన సోమగిరికూడ దొంగభక్తిఁ బ్రకటించి బిల్వునికూడ నవమానించి నిరాదరించినాఁడు. వీరిని బరీక్షింతుఁగాక! బిల్వా! ధైర్యమువహింపుము. నీవు నాభక్తుఁడవై సుఖింపఁగలవు. ధైర్యమువహింపుము. ధైర్యధారణముచే నెల్లరుధీరులగుదురు. తోఁటవాఁడు చెట్లకునీరుపోయ నది ఋతుకాలమునఁ జక్కఁగాఫలించునట్లు మానవహృదయము లనువనములయందు జ్ఞానవృక్షములనునాటి భక్తివారిచేఁబోషించిన మోక్షఫలప్రాప్తియగును.

మంగళుఁడు—(ప్రవేశించి) ప్రభువా! నీకొఱకై నేను వనమంతయు వెదకితిని. గిరులు గుహాలు మున్నగునవన్నియు వెదకి వేసారితిని. కాని, మిమ్మెక్కడనుజూడలేక పోయితిని. మీరిక్కడనుండఁగా నేనెట్లు వెదకికనుఁగొనఁగలనో మీరేచెప్పుఁడు.

కృష్ణు—ఆహా! నీమాటల కేమిలే. నన్నుఁగాంచుటకే యింతశ్రమ పడితివా? (కడుపునొప్పి నటించి) అయ్యయ్యో! కడుపునొప్పి. ఎంతహఠాత్తుగా వచ్చినది. (కడుపుఁ బట్టుకొనును.)

మంగ—ఆఁ! ఇదేమి యాశ్చర్యము! భగవంతునికిఁగూడఁ గడుపునొప్పియా! కృపాపరా! మీకుఁగూడఁ గష్టములా?

కృష్ణు—అవును. దేవలోకవాసులు భూలోకమునకు వచ్చుటచే భూప్రభావము వలన దుఃఖము లనుభవించుట యొకవింతకాదు. అయ్యో! కడుపునొప్పి. మంగళా! కడుపునొప్పి.

మంగ—మహాప్రభూ! మీ బాధ నేను జూడలేను. ఏదేనిమందుఁ దెత్తునా?

కృష్ణు—ఏమిమందుఁ దెత్తువు? ఈకడుపునొప్పి నేయౌషధమును బోఁగొట్టలేదు.

మంగ—అయ్యో! ఔషధమే లేదా!

కృష్ణ—లేకపోలేదు. ఒక్కమందు మాత్రమున్నది. అయ్యో! ఏమిబాధ! అబ్బబ్బా!

మంగ—దేవా! అమందేదో వేగఁజెప్పుము.

కృష్ణు—మనుష్యుని గుండెకాయను గోసితెచ్చినచో నానొప్పి పోవును.

మంగ—గుండెకాయయా! కాని భగవంతుఁడా! తనహృదయముఁ గోసియిచ్చువాఁడెవఁడు?

కృష్ణు—నాభక్తుఁడు-నన్నుఁ బ్రేమించు భక్తుఁడు. మఱెవ్వరిచ్చువారు? ఎవనికి నన్నుఁ బ్రేమించుటచే-తినుట-నిద్రించుట-జీవించుటయుఁ గూడ మఱపు వచ్చునో వాఁడే నాదుఃఖముఁజూచి దుఃఖించును. ఆప్రేమభక్తుఁడే నాకడుపునొప్పి మాన్పఁ దనగుండెకాయ నిచ్చును.

మంగ—ఆసాధువులు కడుభక్తులుగా నున్నారు. వీరినడిగి చూచెదఁగాక!

కృష్ణు—భగవంతుని కొఱకై యెవరైనఁ దమగుండెకాయను గోసియీయఁగల రాయని యడుగుము. అయ్యయ్యో! కడుపునొప్పి. అంతకంత కధికమగుచున్నది. మంగళా! పోయిరా.

మంగ—కృపాళూ! ఇదిగో వెళ్ళుచున్నాను. శీఘ్రముగా నడిగితెచ్చి నీబాధఁ బోఁగొట్టెదను. (సాధువుల కడకువెళ్ళి యందఱితో) భగవద్భక్తులెవరైన భగవంతునికొఱకుఁ దమగుండెకాయఁ గోసియీయఁగలరా?

అందఱు—(నవ్వుదురు)

సోమ—ఓయీ! వెఱ్ఱివాఁడా! తనహృదయమును గోసియిచ్చువాఁడెవఁడు? వీఁడెవ్వఁడో మాంసభక్షకునివలె నున్నాఁడు. హృదయముఁ గోసియిచ్చినచో భగవంతునిఁ బ్రార్థించుటెట్లు? పో! పో! లేచిపో! మేమాత్మహత్యఁ జేసికొను సాధువులము కాము.

కృష్ణు—మంగళా! త్వరగారమ్ము. నొప్పియధికమగుచున్నది.

మంగ—దేవా! ఇదిగోఁ దెచ్చుచున్నాను. ఇప్పుడే వచ్చెదను. (స్వగతము) ఇప్పుడేమి చేయుదును. ఎవనినడుగుదును. కటకటా! ఎట్టికష్టకాలము తటస్థించినది!

మ॥ వనజాక్షుండిటు ధైర్యమేది తపియింపన్ జూడఁగాఁజాల, నె
వ్వనిఁ బ్రార్థించెద గుండెనిమ్మనుచు, నెవ్వాఁడిచ్చునాత్మీయ జీ

వనముఁ గోసి, వృథాప్రయత్నమిది, యే భక్తుఁడు వైకుంఠ వా
సుని బాధన్ హరియించి మేల్పడయునో శోధింతుఁగా కియ్యెడన్॥

(బిల్వునిఁ జూచి) ఇతఁ డెవ్వఁడో! వీఁ డధముఁడగు బిల్వమంగళుఁడే నేఁటి కుత్తముఁ డైనవాఁడు. వీనినడిగి చూచెదఁ గాక! ఓయీ! బిల్వమంగళుఁడా! ఈశ్వరునికొఱకు తనహృదయముఁ గోసియిచ్చు భక్తుఁ డెవఁడైనఁ గలఁడా!

బిల్వ—ఏమీ! ఈశ్వరునికొఱకు హృదయ మడుగు వారెవ్వరు?

మంగ—నేనే! ఇం కెవ్వరు? నీహృదయముఁ గోసియీఁ గలవా?

బిల్వ—ఇంతకంటె నేమికావలయును! మహాసంతోషముతో నిచ్చెదను ఏభగవంతుఁడు మనుష్యదేహమునందు జీవాత్మస్వరూపుఁడై యుండి భక్తిదానముఁ జేయుచున్నాఁడో యెవఁడు స్వయముగ నీప్రాణమిచ్చినవాఁడో యట్టి పరమేశ్వరుఁడు-అట్టిసర్వాధిపతి-నాహృదయ మడిగిన నేనీయకుందునా? నాలోని హృదయమా దీనరక్షకునిదే కదా! ఆజగన్మోహనుని కొఱకు హృదయమే కాదేదికావలెనన్న దానిని నిచ్చెదను. శీఘ్రముగా నాహృదయముఁ గోయుటకుఁ గత్తినిదెమ్ము. దానివలన నాప్రాణము ప్రభువున కర్పింతును.

కృష్ణ—మంగళా! ఆలస్యమేల చేయుచున్నావు. అయ్యో! బ్రతుకఁజాలను.

మంగ—(దగ్గఱకు వచ్చి) దీననాథా! ఆమనుష్యుఁడు తనహృదయముఁ గోసి యిచ్చుటకు సిద్ధముగా నున్నాఁడు. మీవద్ద నేదేని కత్తి యున్నదా?

కృష్ణ—ఆఁ! ఒకచిన్న కటారియున్నది. (ఇచ్చి) వెళ్ళుము. త్వరితముగాఁ గోసి కొనిరమ్ము. ఆలస్యముచేసిన రోగమస్వాధీన మగును.

మంగ—ఇప్పుడే వచ్చెదను. కొంచెమోర్చుకొనుము. (బిల్వుని యొద్దకుఁ బోయి) ఓయీ! ఇదిగోఁ గత్తి దీనిచే హృదయముఁ గోసియిమ్ము.

బిల్వ—(కత్తి తీసికొని) ఆహా! ప్రభుని కృపావిశేషము! భగవంతునికొఱకై గుండెకాయ నర్పించు భాగ్యము నాకుఁ గల్గినది! దుఃఖమునిచ్చు నాహృదయము నాకింకనుండనే యుండదు. దీనినిచ్చుటచే నీశ్వరుని బాధపోవును. ధన్యుఁడను ధన్యుఁడను.

మంగ—సోదరా! నీవిప్పుడు భగవంతునిపై ననుగ్రహముఁ జూపుచున్నావు.

బిల్వ—అయ్యా! ఇది యనుగ్రహమెట్లయినది? చంద్రుఁడు సూర్యుఁడిచ్చిన

ప్రకాశమును మఱల నిచ్చివేసిన నదియనుగ్రహమా? నాయొద్ద నాయన దాచియుంచిన పదార్థ మాయనకిచ్చుట యనుగ్రహమగునా?

సీ॥ మాతృగర్భమునందుమనుచుఁ దొమ్మిదిమాసములుఁ జీవ్రు నేమహాపూరుషుండు
అధముఁడై యజ్ఞానియై యీశ్వరవాదియగువానిఁ గాచు నే యనఘమూర్తి
ప్రబలకష్టపరంపరలఁ దోఁగి తపియించు భక్తులనేలు నే ముక్తిదాత,
సకలచరాచరజంతుజాలముఁ గటాక్షముల శాసించు నే సర్వశక్తి
గీ. అట్టినారాయణునకు సర్వాంతరాత్మ కఖిలభర్త, కవ్యయునకు నచ్యుతునకుఁ
గృష్ణునకు జిష్ణునకు గుండెయే గానంగనేల సర్వంబు నిచ్చెద నెలమితోడ॥

మంగ—సోదరా! నీభక్తికి మెచ్చితిని. నీయట్టి భక్తులీకలికాలమున నరుదుగా నున్నారు.

బిల్వ—ఆహా! సాక్షాద్భగవంతుఁడైన శ్రీకృష్ణుని నిర్వ్యాజకారుణ్యము నేమని నుతింతును! మహాభాగ్యము! శ్రీకృష్ణా! మహాభాగ్యము!

చ. అడిగినవాఁడు కృష్ణుఁడఁట యాత్మనొసంగెడువాఁడు బిల్వమం
గళుఁడఁట! యింతకంటె ఘనకార్యమొకండును గల్గునయ్య! మూఁ
డడుగుల నేలయిచ్చి బలి యవ్యయసౌఖ్యము లందె నాఁడు, నే
నడిగినగుండెనిచ్చి యిపు డక్షయలోకసుఖంబు లొందెదన్॥

(హృదయముఁ గోసియిచ్చి పడిపోవుచు.)

సోమగిరి—అరే! అరే! ఈపిచ్చివాఁ డాత్మహత్య చేసికొన్నాఁడు. ఆశ్రమ మపవిత్రమొనర్చినాఁడు. నడువుఁడు నడువుఁడు. ఈదేహములను సంస్కారములచేఁ బవిత్రముఁ జేసికొందము-రండు. (నిష్క్రమింతురు.)

మంగ—(వచ్చి) దీననాథా! ఈహృదయముఁ దీసికొనుఁడు. ఎట్లు తెచ్చితినో చూడుఁడు.

కృష్ణ—మంగళా! తేతెమ్ము. త్వరగా తే. (హృదయముఁ బుచ్చుకొని తనహృదయమునఁ జేర్చుకొనుచు) ఆహా! ఏమనుష్యుఁడు భక్తినౌకచే నిష్పాపహృదయమను తెడ్డుసహాయమున మాయానదిని దాటునో వాఁడే శాంతినికేతమైన నిర్వాణపదమునొందును. ఓపరమప్రియా! బిల్వమంగళా! భక్తశిరోమణీ! నేత్రములున్నందులకు సాఫల్యముచేసితివి. నిజమైన యానందముతో నన్నుఁ గృతకృత్యునిఁ జేసితివి. భక్తిసుఖముముందు

జపతపోహోమాదులు వ్యర్థములు. ఎవఁడునన్ను నిజమైనభక్తితోఁ బ్రేమించునో వానికి దాసుఁడనై నేనుందును. (బిల్వునిఁజేరి)

మ. బళిరా! భక్తుఁడవన్న నీవెకద! నాకై బాధల నివారించి నా
యశుభకర్మదుష్కృతి గుండెకాయనిడి నాకత్యంతభక్తుఁడు మం
గళుఁడామోదమునొందె నీకతన భక్తగ్రామణీ! బిల్వమం
గళ! లేలెమ్ము యథాపురాకృతినసురారి గన్నారఁగాఁ జూడుమా!

(తట్టును) (బిల్వమంగళుఁడు లేచి చతుర్భుజాకారుని దర్శించును. కృష్ణుఁడు యథాపూర్వుఁడగును)

బిల్వ—(లేచి)ధన్యుఁడనుదేవా! ధన్యుఁడను! దీననాథా! దీనదయాళూ! శ్రీహరీ! భక్తులకు విపత్తులువచ్చినప్పుడు స్వయముగవచ్చి కాపాడుదువు.

కృష్ణు—బిల్వా!నీకుజ్ఞానోదయమైనది-ఆత్మానందమనుభవింపుము-(మంగళునితో నిష్క్రమించును.)

బిల్వ—కృష్ణా! కృష్ణా! రక్షింపఁబడితిని! దీనబాంధవా! నమస్కారము. యదునందనా! నమస్కారము.

సోమ—(వచ్చి)ఆహా! ఈతఁడెవ్వఁడో యుత్తమపురుషునిగ నున్నాఁడు (బిల్వునితో) క్షమింపుము క్షమింపుము. నాయభిమానముఁ బోఁగొట్టి ధన్యుని జేసితివి. నాయపరాధము మన్నింపుము.

బిల్వ—సాధుమూర్తీ! నీపవిత్రముఖమునుండి యిట్టిమాటలు రానీయకుము. మీరు నిరపరాధులు. గురువు గోవిందునికంటెను గొప్పవాఁడని నామతము. హరిని భజించిన భక్తినిచ్చును. గురునిభజించిన సంసారసాగరమును దాటించును. గురువర్యా! దయయుంచి నాకు గురుమంత్రోపదేశముఁ జేయుము.

సోమ—వత్సా! అభ్యాసమను తిరుగలియందు భగవన్నామము విసరి యానందాశ్రువులతోఁ దడిపి రొట్టెచేసి ప్రేమాగ్నియందుఁగాల్చి సేవింపుము. దానిచే నీయాత్మయొక్క క్షుద్బాధ నాశనమగును.

బిల్వ—(శిరస్సును వంచును.)

సోమ—వత్సా! జ్ఞానఖనివై శాశ్వతానంద పదమునొందుము. సుఖింపుము.

(తెరవాలును.)

4 రంగము—బిల్వమంగళుని గృహము.

[మాయాదేవి సఖులైనమాలతీ-గులాబులు ప్రవేశించుచున్నారు]

మాలతి—సోదరీ! ఇప్పుడు మాయాదేవి స్వాస్థ్యమెట్లున్నది?

గులాబి—ఇప్పుడు బాగుగనేయున్నది. కేవలము పతినామమే స్మరించుచున్నది.

మాల—సోదరీ! చూడుము. కొద్దిదినములలోనే యీస్వర్ణమందిరము వట్టియైపోయినది (ఎదుటఁజూచి) వారెవరో సాధువులు వచ్చుచున్నారు.

సోమగిరి—(ప్రవేశించి) మాతా! జయశ్రీకృష్ణ!

మాలతి—జయశ్రీకృష్ణ! స్వామీ! ఏమియాజ్ఞ?

సోమ—మాతా! జలము కొంచెము తెమ్ము.

మాల—తీసికొనుఁడు స్వామీ! (జలమిచ్చును.)

మాయాదేవి—(ప్రవేశించి) హా! హా! ఇప్పటివఱకును స్వామిజాడ తెలియదయ్యెను. నాథా! నాథా! దాసినివదలి యెచ్చటికిఁబోయితిరి? దర్శనమీయరా!

సోమ—(మాలతితో) మాతా! ఈదుఃఖాత్మురాలెవ్వరు?

మాల—స్వామీ! ఈమె బిల్వమంగళునిభార్య. పతివిశ్లేషమునకై పరితపించుచున్నది.

సోమ—ఎవరు? బిల్వమంగళుఁడా! వాఁడు మా యాశ్రమమందున్నాఁడే!

మాయా—ఎవరు? నానాథుఁడే! నాస్వామియే! నాప్రాణాధారుఁడే! యోగీశ్వరా! మీరత్యంతోపకారము చేసితిరి. నన్నుమీతోఁ దీసికొని పోయి నాస్వామిదర్శనముఁ జేయింపుఁడు.

సోమ—మాతా! మేము గృహస్థులముకాము. మీరడవులలో బాధలొందలేరు.

మాయా—స్వామీ! నాసుఖము-నాజీవితము-నా యాధారము-ఎచ్చటనుండునో నాకదియే మహానందనిలయము-పత్నికిఁ బతితోనుండుటకంటె నీసంసారమందు మఱొక్కసుఖములేదు. దయయుంచి నాకుఁబతిసందర్శనభాగ్యముఁగలిగింపుఁడు. అక్కడనే నేనుసుఖించుదానను.

సోమ—కాని మాతా! నీరాకవలన బిల్వమంగళుని యోగనిష్ఠకు విఘ్నము కలుగునేని మిక్కిలికష్టముకదా!

మాయా—స్వామీ! అట్లుకాదు. నేను కేవలమాయన దర్శనముచేఁ గృతార్థురాలనుగాఁ గోరుచున్నాను. స్వామికి యోగవిఘ్నము చేయుదానను గాను. నేనుగూడ నొకయోగినిగా బ్రదుకఁదలంచితిని.

సోమ—అట్లయినమంచిది. తల్లీ! పోదమురమ్ము.

మాయా—మాలతీ! ప్రియసఖీ! చాలదినములు దుఃఖమనుభవించినపిదప నామనోభీష్టము సిద్ధించినది. మీరందఱును దీనికై సంతోషింపుఁడు.

మాల—సఖీ! వెళ్ళుము. ఈప్రపంచమందుఁ బతిసేవచేయుట స్త్రీధర్మమై యున్నది. కావున నీవు పతినిదైవముగాఁగొల్చి శాశ్వత సుఖమనుభవింపుము.

మాయా—మంచిది. మాలతీ! నన్నొకసారి కౌఁగిలించికొనుము.

మాల—(మాయాదేవిని కౌఁగిలించుకొనును.)

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

ప్రబోధచింతామణి.

చతుర్థాంకము.

1. రంగము. అరణ్యమార్గము.

[మంగళుఁడు ప్రవేశించుచున్నాఁడు]

మంగ—(స్వగతము) నేను శ్రీకృష్ణుని యంతరంగభక్తుఁడను. అఖండమహాతపోధనుఁడను. నాభక్తికంత మేమున్నది. నాభక్తికి శ్రీకృష్ణుఁడు నిరంతరము స్వాధీనుఁడైనన్నానందవారిధినోలలాడించుచున్నాఁడు. (ప్రక్కకుఁజూచి) అతఁడే భక్తవత్సలుఁడైన శ్రీకృష్ణ పరమాత్మ యరుదెంచుచున్నాఁడు! లీలామానుష విగ్రహా! మహానుభావా! దయచేయుము! దీననాథా. దయచేయుము.

శా. ఆపద్బాంధవ! సర్వభూతహిత! న్యాయాచార! సర్వేశ! కీ
డాపాదిల్లెడువేళఁ జెంగటకు రారావంతయున్ బాంధవుల్
నీపాదాశ్రయులైన వారలఁ గృపన్ జేపట్టి రక్షింతు వే
యాపత్తుల్ దరిఁజేరనీయకయ కృష్ణా! దీనసంరక్షణా!

కృష్ణు—(ప్రవేశించి) మంగళా! నేనెక్కడికిఁబోయిన నక్కడ నీవుకూడఁ దటస్థించుచున్నావే?

మంగ—కృపాపరా! ఇదియంతయు నీవాత్సల్యవిశేషము.

కృష్ణు—(నవ్వి) ఇందుసందేహమేమున్నది! నాభక్తులను విడిచిపెట్టి యొక్క త్రుటికాలమైన నుండలేను. నాకు నీవంటి భక్తుఁడు మఱెవ్వఁడుకలఁడు? అవునా కాదా? మంగళా! (నవ్వును)

మంగ—వాసుదేవా! నీవు నాభక్తిని పరిహాసము చేయుచున్నావు! నిన్నగాక మొన్నవచ్చిన బిల్వమంగళుని గొప్పభక్తుఁడని పొగడుచున్నావు.

కృష్ణు—ఏల పొగడుచుంటినో గ్రహించితివా? మంగళా! వాఁడు నానిజభక్తుఁడు మృత్యువునకు భయపడువాఁడు భక్తుఁడనఁదగినవాఁడా! ప్రేమస్థానము చాలదూరమందున్నది. ఇదినీవు తెలిసికొనుము.

మంగ—అట్లయిన దేవా! ఆదీర్ఘజటాధారియగు యోగి-ఆసన్యాసి-ఆయవధూత నీచరణారవింద భక్తిలో నిరంతరమగ్నుఁడై రాత్రిందివ విచారములేక యుండు విరాగి యతఁడు నీనిజభక్తుఁడుకాఁడా?

కృష్ణు—మంగళా! కాషాయవస్త్రధారణముచే మనస్సుమాఱదు. భక్తునివలెఁ బైకిఁగన్పడినను నిజమైన భక్తుఁడనుభవించు నిత్యానందసుఖము కుటిల భక్తుఁడు పొందఁజాలఁడు. భక్తిరసము చవిచూడనివాఁడమృతముఁ దాగినను ఫలములేదు. ధర్మమునననుసరించి ప్రవర్తింపనివాఁడు యుగముల కొలఁది జీవించినను నిష్ఫలము. సన్యాసులు-యోగులు-జంగములు-వేదాంతులు-తలలు గొఱిగించుకొని కాషాయదండభూషితులైనను మనస్సునందాత్మానాత్మ వివేకహీనులైనచో నేమిఫలము?

మంగ—(ఎదుటజూచి) మహాత్మా! ఆవచ్చుచున్నయవధూతకూడ మీరనినట్లు కపటవేషధారియగునా?

కృష్ణు—అవును. నీవిటువంటివారిని మించినవాఁడవు. నీకాలిగోటికైన వీఁడు పోలఁడు. కావలసిన వీనిమర్మమిప్పుడే నీకుఁజూపించెదను.

మంగ—చిత్తముదేవా! మీకృపకుఁబాత్రుడను-(ఇద్దఱుదాగుకొందురు)

నిర్లోభరాముడు—(ప్రవేశించి) జయశ్రీకృష్ణా! జయవ్రజవల్లభ! జయదామోదర! జయనారాయణ!

మంగ—(ప్రవేశించి)జయశ్రీకృష్ణ! స్వామీ! వందనములు.

నిర్లో—నారాయణ! నారాయణ!

మంగ—(స్వగతము) ఏమీ! ఇతనిస్వరూపము! కలియుగమునఁ గపటసన్యాసు లిట్లుందురు కాఁబోలు (ప్రకాశముగా) అవధూతమహారాజా! మీరెక్కడికి వెళ్ళుచున్నారు?

నిర్లో—యాత్రకు- జయశ్రీకృష్ణ! జయవ్రజవల్లభ! జయదామోదర!

మంగ—తమ నామధేయము?

నిర్లో—నామధేయమా? ఆహా! నిర్లోభరాముఁడు.

మంగ—నిర్లోభరాముఁడా! అయినమీకు లోభముతోఁ బనిలేదు.

నిర్లో—నిజమే. నాకు లోభముతోఁ బనిలేదు. నీవు బంగారమని దేనినందువో నాకది పట్టితో సమానము. నీవువజ్రమని దేనినందువో నాదృష్టియం దదియొక్క బొమ్మరాయితోఁ దుల్యము. నాబంగారము-నావైశ్వర్యము నాపెన్నిధానము-నిర్లోభుఁడైన యీయోగీశ్వరుఁడే. జయశ్రీకృష్ణ! జయ వ్రజవల్లభ! జయదామోదర!

మంగ—(కృష్ణుని కడకువచ్చి) శ్రీకృష్ణా! ఇతడు నిజముగా నిర్లోభుఁడే.

కృష్ణు—ఇంటిలో నున్నను అడవులలో నున్నను వేషములెన్ని ధరించినను ఒక్కభక్తియే కావలసియున్నది. భక్తిలేనిదే యేమిచేసినను నిష్ప్రయోజనము. లక్షపత్రి పూజచేసినను-అనంతకోటి దేవాలయములు ప్రతిష్ఠించినను భక్తిలేనిదే వ్యర్థమగును. ఇదిగో నీసంచిని గొనిపోయి వాఁడు పోవుమార్గమునఁ బెట్టిరమ్ము. నీకొక విచిత్రమైన యానందదృశ్యముఁ జూపించెదను. (రూపాయలసంచి యిచ్చును)

మంగ—ఏమిది! రూపాయలసంచియా! వాసుదేవా! ఒడలినిండ రెండుమణుగుల విభూతిఁదాల్చిన యీసన్యాసి-యీనిర్లోభరాముఁడు దీనిఁగొని యేమిచేయును? అతఁడు దీనినిగైకొనఁడు.

కృష్ణు—వాఁడేమి! వానితాతకూడఁ దీసికొనును. చూడుము. ధనమునందా మహాత్తుకలదు. సంచి నక్కడఁబెట్టిరమ్ము.

మంగ—(సంచి మార్గములోఁ బెట్టివచ్చును.)

నిర్లో—ప్రపంచమంతయు లోభులతోడను అసత్యవాదులతోడను నిండియున్నది. ఆహా! సర్వముమిథ్య.

మంగ—(స్వగతము) ప్రపంచమంతయు మిథ్య. నీవొక్కఁడవుమాత్రము నిజ స్వరూపుఁడవు.

నిర్లో—ఆహా! ప్రపంచవిషయములు తలంచిన నాశ్చర్యమగుచున్నది. వచ్చిన వారందఱును చేతులుజోడించి పేరుమాత్రమడుగుదురు. ముక్తిమార్గ మడుగుదురు. పనియడుగుదురు. కాని యెవ్వఁడును డబ్బుమాటయెత్తఁడు. ఈప్రపంచమంతయు విలక్షణముగానున్నది. జయ శ్రీకృష్ణ! జయ వ్రజవల్లభ! జయ దామోదర! (ముందునకు నడచును. సంచి కాలికిఁ

దగిలి చప్పుడగును.) అరే! ఇదేమి! సంచిసంచి! సంచిదొరకినదే! (చూచి పైకెత్తిపట్టుకొని) ఆహా! రూపాయలసంచి! ఆహాహా! ఓహోహో! (నాట్యముచేయుచు) రూపాయలసంచి దొరకినదే! ఆహాహా! ఓహోహో! (కూర్చుండి లెక్కపెట్టుచుండును.)

మంగ—దీననాథా! పిండిమీవలలోఁ దగుల్కొన్నాఁడు. సంచిదొరకఁగానే యోగి భోగియగుటకు నిశ్చయించినాఁడు. నహవా! నిర్లోభరామా! లోభమును గళ్ళెముగ నెట్టిగా బట్టుకొంటివి.

కృష్ణ—మంగళా! కొంచెముసేపు తాళుము. ఈవేషధారి లీల యింకొకటి చూపించెదను. (ప్రక్కకుఁజూచి సంజ్ఞచేయును)

(మాయ-యనుస్త్రీ పాడుచుఁ బ్రవేశించుచున్నది.)

మాయ—నేనెటువంటిమాయను! భగవంతునిపై నొకకన్నుంచి యాతని యాజ్ఞకు సదా దోసిలొగ్గుచుందును (స్వగతము) నేనిప్పుడొక పాంథుని నావలలోఁజిక్కించుకొనవలసియున్నది. తరువాత నామూర్ఖునకుపదేశము చేయవలసియున్నది. ఈరెండుపనులును జేయుటకై శ్రీకృష్ణపరమాత్మచే నియోగింపఁబడినదానను.

నిర్లో—ఆహా! ఈమాయామోహనగాత్రి యెవతెయోకదా! ఈమెపేరు మాయయా! ఇది రూపాయలసంచి-ఇదిమాయ-ఈమెయు మాయయే-హాయి హాయి! నేనెంతయదృష్టము చేసిపుట్టితిని.

మాయా—(గానముచేయును.)

నిర్లో—ఆహా! ఈమాయయొక్క గానమేమి! దీనివృత్తాంతమేమి? ఎంతసౌందర్యవంతురాలు! అప్రయత్నముగా నీరూపాయలమూటయు నీమాయాసుందరియు నొంటిపాటున లభించెను. కాని-యీమెమాటలు-యీమె యమృతంపుమాటలు-నాహృదయము నాకర్షించుచున్నవి. (మాయతో) ప్రియా! నీవెవ్వతెవు? ఈసౌందర్యమైన దేహము-ఈరూపము-ఈ నీసన్ననినడుము-ఆహా! ఏమనివర్ణింతును! ప్రియా! చెప్పుచెప్పు-నీపేరేమి?

మాయ—ప్రవహించు నదిలోనిపడవవంటిదానను. విడువఁబడు బాణములలో వేగముగల నిశితబాణమును. నాచూపులకును మాటలకును భ్రమించి

నాదుపావనభాగ్యమున కాసింపకుము. నీమనస్సును లోభమునకు వశ్యము చేయకుము.

నిర్లో—ఆహాహా! మాయా! ఈలోభము నేమనిచెప్పుదును! ప్రియా! నీ వెందుఁబోవుచుంటివి? దారిఁబోవు మావంటి నిర్లోభసన్యాసులనుగూడ మోహింపఁజేసికొని వలలోఁ బడవైచుకొనుచున్నావు.

మాయ—స్వామీ! మధురకుఁబోవుచుంటిని. కాని, మీకన్నులు నాపై నేల త్రిప్పితిరి? నిజముఁజెప్పుఁడు?

నిర్లో—హాయి! హాయి! నిజముసంగతి నేనేమని నానోటితోఁజెప్పఁగలను ప్రియా! మనకన్ను లేలదెబ్బలాడవు? నీసౌందర్యరూపబాణము మోహితుఁడనగు నామనస్సున నేలగ్రుచ్చుకొనదు? మాయాసుందరీ? నీతోనింకెవరు వచ్చుచున్నారు?

మాయ—నేనొక్కతెనే పోవుచున్నాను. ని[illegible] నేనొక్కతెనై సంచరించుచుందును.

నిర్లో—ఒక్కతెనేయన నేల? నావంటివానినెవనినైన జతకూడరాదా? నీదుఃఖములంతరించి సుఖములుచేకూరును.

మాయ—నిజమే. అట్లుచేయవలయు ననియేయున్నది. నాకుజతగాఁడగు వానికి శిరస్సున జటయుండవలెను. మొగమునఁ బెద్దబొట్టుండవలయును. అవధూతకావలయును. విభూతిసర్వాంగముల నలమికోవలెను గోచిపెట్టుకొనవలెను. భజనచేయు చిటితలు మెడలో రుద్రాక్షమాల-వెనుకతట్టున మృగచర్మము చేతిలోఁదంబుర-భుజమునకుసంచి-యివియన్నియు ధరించువాఁడు లభించిన నేనువానిని బతిగాగ్రహింతును.

నిర్లో—ఆలాగా! ప్రియా! నేను నీవుకోరినట్లున్నానుచూడు.

మాయ—అవును నిజమే. (సంచిముట్టుకొని) ఇందులోనేమున్నది?

నిర్లో—ప్రియా! ప్రియా! ఇది చెప్పఁదగ్గవస్తువుకాదు. ఇది మిక్కిలిప్రయాసమీఁదలభించినది.

మంగళుఁడు—(స్వగతము) అవును. పాపము! పేఁడుదినమంతయుఁ దట్టలుమోసి కష్టపడి సంపాదించినదీసంచి.

మాయ—అధికప్రయాసమీఁద లభించినదా? అట్లయిన నేను వెళ్ళిపోయెదను

నిర్లో—ఉండు ప్రియా! ఉండు! వెళ్ళిపోవు చెప్పెదను. కాని ప్రియా! దీని దూరముగానుండిచూడుము. ముట్టుకొనకుము.

మాయ—వెళ్ళు వెళ్ళు మంచివాఁడవే! నీవు సంచియిత్తువా సరే. లేదేని పోయెదను. (పోఁబోవును)

నిర్లో—ప్రియా! వెళ్ళకు వెళ్ళకు. ఇదిగోఁ బుచ్చుకో. దీనినిఁ బుచ్చుకొని యెక్కడికి వెళ్ళకు. నాయొద్దనే యుండవలయును సుమీ. (సంచియిచ్చును.)

మాయ—(పుచ్చుకొని) ఆహాహా! ఏమిచెప్పుదును. ఎంతధనమున్న సంచి. ఎంతభారముగానున్నది. ఓహోహో! నాప్రియమైన మనోహరుఁడా! నీరూపము నేమనివర్ణింతును. చూడు నామీఁదిమోహమును మఱవకుము. నీరూపసౌందర్యముఁ జూచి మోహించితిని. నిన్ను విడిచియుండలేను. (సంచితోఁ బారిపోవును.)

నిర్లో—అయ్యో! అయ్యో! సంచిసంచి మాయమాయ ఓదైవమా! సంచిని మాయనుగూడఁ గోల్పోయితిని. లింగమువలె నిర్లోభరాముఁడొక్కఁడే మిగిలినవాఁడు. (నెత్తి మొత్తుకొనుచు నిష్క్రమించును.)

కృష్ణు—మంగళా! కలియుగప్రభావము తెల్లమైనదా?

మంగ—అయినది స్వామీ! అయినది. ఆవచ్చువారెవ్వరు?

కృష్ణు—మంగళా! మనమాప్రక్కనిల్చి పరిశీలింతమురమ్ము. (ప్రక్కగా నిల్తురు)

[చంచలయనుస్త్రీ పుత్రునిశవముతోఁ గొందఱు వెంటరాఁ బ్రవేశించును.]

చంచల—(శవమక్కడఁ బెట్టి) హా! ఈశ్వరా! నాపుత్రుఁడొక్కఁడుఁగూడ నన్ను విడిచిపెట్టెనే! నాయాశలన్నియు నశించిపోయెనే! అయ్యయ్యో! నాలుగునాళ్లైన సంసారసుఖము లనుభవింపలేదే! దైవమా! నీ కింతటికింత బరువైపోయితినా! ముద్దుబిడ్డా! నాకింతదుఃఖమిచ్చి పరలోకవాసివైతివా! అయ్యో! నేనెట్లుబ్రదుకుదును? (ఏడ్చును.)

ఒకఁడు—అమ్మా! దుఃఖింపకుము. దైవవిధి కెవ్వరేమిచేయఁగలరు? శవమును దహనముచేయకున్న నదికుల్లి రోగములు వ్యాపింపఁ జేయును.

చంచ—అయ్యో! ఎవరైన శ్రీకృష్ణభక్తులిచ్చటికి శీఘ్రముగావచ్చి యీదుఃఖాత్మురాలికిఁ బుత్రదానముఁ జేయరాదా?

రెండవవాఁడు—ఓయబలా! ఎక్కడనైనఁ జచ్చినవాఁడు బ్రతుకునా? వింటినుండి బాణమును, జిహ్వనుండి మాటయు శరీరమునుండి యాత్మయుఁ బుష్పమునుండి పరిమళమును వెలువడినపిమ్మట మరలఁ దిరిగి రాఁజాలవు.

మంగ—(కృష్ణునితో) త్రిలోకనాథా! శ్రీకృష్ణా! ఈదుఃఖాత్మురాలి పుత్రుని బ్రతికింపుఁడు.

కృష్ణు—మంగళా! ఆయుర్దాయము లేనివాఁడెట్లు బ్రతుకును? వానినెవరు బ్రతికింపఁగలరు? ఈప్రపంచమునఁ బుట్టినవాఁడు కిట్టకతప్పదు. కాలవశమునఁ జచ్చినవీనిని బ్రతికించి మఱలఁ జంపనేమిటికి?

చంచ—ఎవ్వరైన మహాత్ములువచ్చి నాపుత్రుని బ్రతికింతురేమోయని చూచుచున్నాను. అయ్యో! దైవమా! నాపుత్రుని బ్రతికింపవా? నాయందుఁ గనికరములేదా? పుత్రశోకాతురయైన స్త్రీ హృదయమెంతటి దుఃఖమనుభవించునో నీకుఁ దెలియదా? తండ్రీ! కృష్ణా! యదునందనా! మురళీధరా! రుక్మిణీ మనోవల్లభా! రక్షింపుము రక్షింపుము.

బిల్వమంగళుఁడు—(ప్రవేశించి.) రాధాకృష్ణ! రాధాకృష్ణ!

మ. భగవంతుఁడవు నీవ నీకరుణచే న్వర్ధిల్లు సర్వార్థముల్
నిగమాంతంబులు నీవ సర్వమయుఁడై నిత్యుండవై యెప్పుడున్
జగముల్ ప్రోచెదు పూరుషోత్తముఁడ వీశా! నీవ నాకుండలం
బగు నే నిన్ను నుతింపనిట్టిఁడని కృష్ణా! దీనసంరక్షణా!

చంచ—మహాత్మా! నిర్భాగ్యురాలనైన నాపైదయచూపుఁడు. తమ యోగబలముచే నాపుత్రుని బునర్జీవితుని జేయుఁడు. మీచరణకమలములకు మ్రొక్కెదను.

బిల్వ—అమ్మా! నాయందంతటిశక్తి యెక్కడనున్నది? జీవధారికి మరణము తప్పకయున్నది. ఇదియంతయు భగవద్వశము. శోకమును త్యజింపుము. దుఃఖాగ్నియందుఁబడి మగ్గిపోకుము.

చంచల—(ఏడ్చి) మహాత్మా! వీని నెట్లయిన బ్రతికింపుఁడు. లేదేని నన్నుఁగూడఁ జంపివేయుఁడు. నేనింక బ్రతుకలేను.

బిల్వ—చంపుట-బ్రతికించుట-ఈరెండును సర్వశక్తుఁడైన యీశ్వరుని చేత నున్నవి. కాని ప్రార్థించుటమాత్రము నాచేతులలో నున్నది. అమ్మా! దుఃఖింపకుము. ఈశ్వరేచ్ఛయున్న నీకొడుకేల పునర్జీవితుఁడు కాకుండును?

చంచల—మహాత్మా! మీవాక్యామృతము నాకుమారుని బునర్జీవితుని జేయు నన్నయాశ నాకున్నది. కనికరించి శ్రీకృష్ణుని బ్రార్థించి నాకుమారుని బ్రతికింపుఁడు.

బిల్వ—ఓద్వారకానాథా! శ్రీకృష్ణా! నన్నుఁగృపఁజూడుము. నీవక్కడ సుఖముగా నున్నావు. నామానగౌరవము లిక్కడఁ బోవుచున్నవి. నాహృదయ మీదీనురాలియెడ జాలిఁబొందుచున్నది. నీభక్తులకు విపత్తువచ్చినప్పుడు వారిని గాచినావు. త్రేతాయుగమందు గౌతమపత్నిని దరింపఁజేసితివి. ద్రౌప[illegible]కాపత్కాలమునందు నీవక్షయ వస్త్రదానముచేసి మానరక్షణ మొ[illegible]. దుఃఖాత్ముల దుఃఖము దూరమొనర్చువాఁడవు నీవొక్కఁడవే. ఒనాథా! ఈచింతావివశురాలిని రక్షింపుము. దయవహించి యీమెదుఃఖము నాశముచేయుము. నాహృదయకమలము వికసింపఁజేయుము.

పిల్లవాఁడు—(కదలును.)

బిల్వ—బిడ్డా! లెమ్ములెమ్ము. నివింక గొంతసంసారయాత్ర నడపుము.

పిల్లవాఁడు—(లేచును).

చంచల—(బాలుని కౌఁగిలించుకొని) నాయనా! నాయనా! నాయానందనిలయా! నారతనాలమూటా! ఈమహాత్ములకు సాష్టాంగవందన మాచరింపుము. నీకీయనయే జీవదానము చేసినవారు.

పిల్ల—మహాత్మా! వందనములు.

బిల్వ—వందనము లాశ్రీకృష్ణునకే. ఎవఁడునీతల్లికిఁ బరమానందమిచ్చెనో యామురళీధరునకే వందనములు.

(అందరు నిష్క్రమింతురు).

మంగం—మహాప్రభూ! ఇదియేమిలీల? ఏమియాశ్చర్యము!

కృష్ణ—ఏలీల? ఏదియాశ్చర్యకరము?

మంగ—మీరు మృతశరీరమును బ్రతికింపలేమంటిరి. కాని, యతఁడుబ్రతికించినాఁడు. బిల్వమంగళుఁడు మీకంటె గొప్పవాఁడాయేమి?

కృష్ణ—అవును. గొప్పవాఁడే. మంగళా! నాకంతటి సామర్థ్యములేదు. బిల్వుని భక్తి యమూల్యమైనది.

మంగ—దేవా! ఇదిమిక్కిలి యద్భుతము. మీరు చేయలేనిపనిని బిల్వుఁడే చేయఁగల్గెను.

కృష్ణ—మంగళా! నేను నా ధ్యానము సర్వదా యెవరు చేయుచుందురో వారి కధీనుఁడను. నాభక్తులకు వారినిజభక్తియే యిట్టి యమూల్యశక్తినిచ్చుచున్నది. నీకును నాకునుగూడ బిల్వునకుఁ గలశక్తి లేదు.

మంగ—అట్లయిన నేను మీభక్తుఁడనుగానా?

కృష్ణ—అయినయెడల నీయొద్ద నీగుండెకాయలేదా? బిల్వమంగళునేల ప్రార్థించి తెచ్చితివి?

మంగ—దయానిధీ! నన్ను దయఁజూడుము. నాయజ్ఞానము సైరింపుము. బిల్వమంగళుఁడు మీనిజభక్తుఁడు-నాగర్వాంధకారము తొలఁగినది. నాయపరాధము క్షమింపుఁడు-

కృష్ణ—మంచిది. ఇంకెప్పుడు నిట్టియహంభావముఁ బొందకుము.

(ఇద్దఱును నిష్క్రమింతురు).

2. రంగము. దర్బారు—అక్బరు సింహాసనాసీనుఁడై ప్రవేశించుచున్నాఁడు. కర్మచారులందఱు నాసీనులగుదురు.

అక్బరు—తానసేనుగారూ! చింతామణి వచ్చుసమయమైనది. ఈపాటికి వచ్చుచుండును. మంచిచెడ్డలు విమర్శించుటకుఁ గాలముసమకూడినది.

ద్వారపాలకుఁడు—(ప్రవేశించి) మహాప్రభూ! ఒకవేశ్య ద్వారముకడ వేచియున్నది.

అక్బరు—లోనికిఁ బ్రవేశపెట్టుము.

ద్వార—మహాప్రసాదము.

(నిష్క్రమించును).

[అన్న—చింతామణి ప్రవేశింతురు.]

అన్న—మహాప్రభూ! నమస్కారము మీయాజ్ఞానుసారముగా నాపుత్రికఁ జింతామణిఁ దీసికొనివచ్చితిని. ఈచింతామణిపూర్వచింతామణికాదు. ఇప్పుడీమెవర్తనము వేఱుగానున్నది. ఏదియో భూతముపట్టినది.

అక్బ—భూతమింకను వదలిపెట్టదాయేమి?

తాన—ప్రభువువారుతలంచిన నిమిషములోఁ బోఁగొట్టఁగలరు.

చింతా—తానసేనుగారూ! మాటలకేమిలెండు. ఈభూతమిక్కడ వదలునది కాదు.

తాన—మఱెక్కడవదలును?

చింతా—నామహారాజాధిరాజగు శ్రీకృష్ణభగవానునియొద్ద వదలును.

అక్బ—అక్కడ వదలునదేమి!

చింతా—చావుపుట్టుకలకుఁగల సంబంధము—

అక్బరు—చింతా! ఇప్పుడీబికారివేషము వదలిపెట్టుము. నేనునీకు మంచిదుస్తులిచ్చెదను.

చింతా—ఇప్పుడు నా కమూల్యవస్త్రములతోఁబనిలేదు. అమృతభక్షకునకు విషమెట్లురుచించును. పరమానందసుఖ మనుభవించువాఁడు విషయసుఖమెట్లాసించును?

అక్బ—చింతా! నాయనంతధనాగారముఁ జూడుము. ఈవైరాగ్యవృత్తి విడిచి యైశ్వర్యసుఖములను బొందుము. నీకుఁ గావలసిన త ద్రవ్యమిచ్చెదను.

చింతా—సంసారులైన రాజులకుఁ బదునాఱణాలుగల రూపాయ భగవంతుని కంటెఁ బదాఱురెట్లధికము. కాని, యది నాదృష్టియందుఁ దృణముకంటెను నత్యల్పమైనది. ఆచతుర్భుజుని ధ్యానమునాకుఁ గిరీటధారియైన చక్రవర్తిపదమువంటిది. నాయీ జపమాలముందు నీరాజ్యభోగాదులన్నియు బలిహారణము లగుచున్నవి.

అక్బ—ఈ వైరాగ్యవృత్తిమాని రాణివాసము చేయరాదా?

చింతా—పరిశుద్ధజలంబుల స్నానమాడి శరీరమున మట్టిని బూసికొన్నదానను గాను. సంసారమను గాలమువలనఁ బట్టువడిన చేపయొద్దకు స్వేచ్ఛావృత్తిగల చేపపోక చేఁపవచ్చునా? సింహము నోటనుండి దైవాను గ్రహమునఁ దప్పించుకొన్న హరిణము మరల దానికాహారము కాఁదలఁచునా?

తాన—చింతామణీ! ఇటుచూడుము. అక్బరువంటి మహాచక్రవర్తియాజ్ఞ నీవుల్లంఘించుచున్నదానవు.

అక్బ—(కపట కోపముతో) ఏమిది! చింతా! నీవీచిన్నతనపుమాటలు వదలిపెట్టుట లేదే!

చింతా—భగవంతునిలో శక్తి యెప్పటివఱకు నుండునో యప్పటివఱకు నా భక్తికేవిఘ్నమును గలుగదు.

మంత్రి—మనుష్యులు మాటాడుటకుఁ బూర్వమాలోచించి మాటాడవలయును. ఇది యక్బరుచక్రవర్తిదర్బారుగాని నీవు విహరించు పూలతోఁట కాదు. జాగ్రత్తగా మాటాడుము.

చింతా—నేనొక్కయీశ్వరునికే భయపడుదానను గాని తదితరులయొద్ద నాకు భయములేదు. ఈశ్వరభక్తులకుఁ జావన్నఁగూడ భయములేదు. నేనెల్లప్పుడును జాగ్రత్తగనే మెలఁగుచుందును.

అక్బ—మాట కయిదుమాటలు జవాబిచ్చుచున్న దానవే! సిగ్గులేదా నీకు? నావంటివానియొద్ద నిట్లు తెగించి మాటాడుటకు జంకులేదా?

చింతా—తేనెటీఁగలవలని భయముచేతఁ దేనెపట్టుఁ దీసికొనుట యెవ్వఁడు మానినాఁడు. ముండ్లు గ్రుచ్చుకొనునని యెవ్వఁడైనఁ బువ్వులు కోయుట మానునా? కష్టమని చెప్పి భయపడి యీశ్వరభక్తి నెవ్వఁడు వదలిపెట్టును?

అక్బ—వదలి పెట్టకుము. కాని యిదిమాత్రము జ్ఞాపకముంచుకొనుము. నాకుఁ గోపమువచ్చి నిన్ను నిరాదరింతునేని నిన్నెవ్వరును గౌరవింపరు. నా మాటనీవు విననిచో నీమాట నెవ్వరును వినరు.

చింతా—కొందఱు నిద్రాహారములు మాని హరిభజనానంద మగ్నులగుచున్నారు. మఱికొందరు సర్వదా హరినామము వినుటయందే కాలముఁ బుచ్చుచున్నారు. ఇంకఁ గొందఱు మహామోహాంధకార మగ్నులైన వారిని దరింపఁ జేయుచున్నారు. అట్టివారే యీశ్వరభక్తులు. ఈశ్వర

భక్తులను సంసారసముద్రమున మునింగి జ్ఞానరహితులై చరించువారు గౌరవింపక పోయినను వారికిలోపము లేదు. నాకు భగవద్భక్తికంటె నితర మక్కఱలేదు. నామాట నెవ్వరు వినకున్నను నాకు లేశమైన లోపము లేదు.

తాన—ఓసి తెలివితక్కువదానా! నదీజలమువంటి నీవెక్కడ! మహాసముద్రుఁడయిన యీయన యెక్కడ! అంతరాంతరము లెఱింగి మాటాడుము.

చింతా—క్షమింపుఁడు. నదీజలము తీయగానుండును. సముద్రజలముప్పగా నుండును.

అక్బ—ఏమి! నీవైరాగ్యవృత్తి మానకుంటివికదా! నీవింకనీ కుతర్కము మాని సుఖింపుము. ఊరక కష్టములేల పొందెదవు.

చింతా—అబద్ధపుమాట జిహ్వనుండి రాదు. చావన్న భయము లేదు. భక్తిమార్గమందుఁ జరించువారికిఁ గష్టములు లేవు. భక్తితో నెట్టి కష్టములనుభవించినను సుఖప్రదముగా నుండును. భక్తిమార్గమున మరణముఁ గాంచు వారికమరత్వము సిద్ధించును.

మంత్రి—ఎవఁడు సూర్యుని కెదుట నిల్చిచూచునో వానికన్నులకు నీరు క్రమ్మును. అతిభక్తివలన నొక్కొకప్పుడు దుఃఖము కలుగును సుమా!

చింతా—ఎవఁడు సత్యమును దాచునో వాఁడు భగవంతుని గూడ మఱచును.

అక్బ—ఓసిచింతా! నన్నేమని భావించితివి? చిన్నదానవైనను మాటలు పెద్దవిగా నున్నవే!

చింతా—వాస్తవమునందు నాకులము నీచకులమైనను నాకీభక్తి శుద్ధినిచ్చినది. భక్తిశక్తివలననే నాకు శాంతి సుఖము కలుగుచున్నవి. ఎవ్వరేమన్నను నాకుఁ గోపవిషాదములు కలుగవు.

అక్బ—నీవెందులకును బనికిరావు. నీయుపన్యాసమింకఁ గట్టిపెట్టుము.

చింతా—ఈశరీరమును బాణములతోనైనఁ గత్తితోనైన నఱికినను నాశిరస్సు ఖండించినను సరియేగాని నేనీభక్తిమార్గమును విడువఁజాలను.

అక్బ—(లేచి) ఆహా! చింతామణి! నేఁటికి నిన్నుఁ దెలిసికొంటిని. నీభక్తిని బరీక్షించుటకే యిట్లుచేసితిని. ఏదేని వరమడుగు మిచ్చెదను.

చింతా—మహారాజా! నాకు మీయనుగ్రహముతక్క నితరమక్కఱ లేదు.

అక్బ—అట్లుకాదు! వేఱొక వరమేదైనఁ గోరికొనుము.

చింతా—మీకిట్టి యభిప్రాయమున్న యెడల నాప్రార్థన మంగీకరించి మఱల నన్నీ దర్బారున కెప్పుడును బిలువకుందురుగాక! ఇంతకంటె నాకేవరము నక్కఱలేదు.

అక్బ—ఈవరమిచ్చితిని.

చింతా—ధన్యురాలనైతిని.

అక్బ—చింతామణీ! ఇంక సుఖముగాఁ బొమ్ము. ఈశ్వరుని భజించుచు స్వర్గసుఖము లనుభవింపుము.

చింతా—దైవము మీకు మేలుఁ గూర్చుఁగాక!

(అందఱు నిష్క్రమింతురు.)

3. రంగము. మార్గము.

[బాలురు కొందఱు పాడుచు నాడుచుఁ బ్రవేశింతురు.]

బాలకులు—శ్యామసుందరుని, మురళీధరుని-నటవరుని, స్వర్గనివాసుని నేఁడు పాడుఁడు. బృందావన నాథుఁడగు శ్రీగోపాలకుని చిఱునవ్వులను కలకండను తినుఁడు.

బిల్వ—బృందావనమునందలి గొల్లలు రుక్మిణీ మనోవల్లభుని గీర్తించుచున్నారు. ఆహా! ఎట్టిపుణ్యాత్ములు! ఆహా! శ్రీకృష్ణా! ఎట్టిప్రియనామము! మిక్కిలి యాఁకలితోనున్న వానికి మృష్టాన్న భోజనమువంటిది. అతిదాహపీడితునకుఁ జల్లని మంచినీరము. కాముకులకుఁ గామినులెట్లు ప్రియలో యట్లే మాకు శ్రీకృష్ణుఁడు ప్రియుఁడు. రాధాకృష్ణ! రాధాకృష్ణ! రాధాకృష్ణ!

1 బాలుఁడు—అరే! ఈసాధువుచాల నిర్లిప్తుఁడుగా నున్నాఁడు.

2 బాలు—ఔనౌను! చూడు. కృష్ణనామభజనానందమగ్నుఁడై "రాధాకృష్ణ! రాధాకృష్ణ" యని జపించుచున్నాఁడు.

3 బాలు—వీనిని మాటాడించి చూతము.

4 బాలు—(మొదటి వానితో) నీవు ముందు కదిపిచూడు.

5 బాలు—(బిల్వునితో) స్వామీ! జయశ్రీకృష్ణ!

అందఱు—జయశ్రీకృష్ణ! జయశ్రీకృష్ణ! జయరాధాకృష్ణ! జయదామోదర! జయమురళీధర!

[అమృతమయి ప్రవేశించుచున్నది.]

అమృత—(పిల్లలతో) బాలురారా! ఇదేమి యల్లరి! పాపమీసాధువును బాధించుచున్నారా! పొండు పొండు.

అందఱు—(పోవుచు) మహారాజు శ్రీకృష్ణునకు జయము! జయశ్రీకృష్ణ! జయరాధాకృష్ణ! (కేకలు వేయుచు పోవుదురు.)

అమృత—స్వామీ! అభివాదనము. (నమస్కరించి వెళ్ళిపోవును.)

బిల్వ—(చూచి) ఆహా! ఎంతటిసౌందర్యవంతురాలు! భగవంతుఁడెట్టి రత్నమును సృజించినాఁడు. మొదటఁ జింతామణియే రత్నమని భ్రమించితిని. ఆమెకంటెను బహుమూల్యాధికరత్నమైన యీమెనుజూచి ధన్యుఁడనైతిని. ఆహా! ఎట్టి తేజోమయ స్వరూపము! ఎట్టిసరసాకారము! ఈమె రంభ-ఊర్వశి-మేనక మొదలగు దేవకాంతలకంటె నధికసౌందర్యముఁదాల్చి యీప్రపంచమును బ్రకాశింపఁ జేయవచ్చినదో లేక చంద్రుఁడు స్త్రీరూపముధరించి యీప్రపంచస్త్రీల మదము హరించుటకు దిగివచ్చెనో! ఆహాహా! కోకిలస్వరముఁబోలు కంఠస్వరము.

ఉ. కామసుఖంబులం దనిసి కాలముమళ్ళి విరాగినైన నా
కీమె మనోజరాగ ముదయింపఁగఁ జేయుచునుండె నేఁడహో
యేమనవచ్చు నిట్టితరళేక్షణతో సరిపోల్ప లక్షచిం
తామణులైనఁ జాలరు కదా! నవయౌవన రూపసంపదన్.

ఈభామ యేభాగ్యశాలి గృహదీపమో కదా! చింతామణీ! ఇంతదనుక నీవంటి సుందరి లేదని తలంచితిని. నీసంగీతస్వరమువిని నివంటి దీపృథివి మీఁద వేఱొకతె లేదనుకొంటిని. కాని నాకీమెను జూచినతోడనే గర్వపరిహారమైనది. (ఆలోచించి) సంసారమున సుఖమనుభవించుటకు స్త్రీయే తగియున్నది. అలసినవారికి విశ్రాంతినిచ్చునది దుఃఖాత్ములకు సౌఖ్యమిచ్చునది యొక్క నారీమణియే. అట్టి నారీమణులలో నీమె నాహృదయేశ్వరి. నేఁడీమెతో భోగింపని యెడల నాబ్రదు కెందులకు? ఇప్పుడే యీమెగృహమునకు వెంటాడించిపోయి ద్వారముదగ్గఱఁ గూర్చుండెదను. (నిష్క్రమించుచున్నాఁడు.)

4. రంగము:—అమృతమయి గృహద్వారము.

[బిల్వమంగళుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

బిల్వ—ఆఁ! ఆఁ! వెళ్ళిపోయినదా? ఏమనిపిల్తును? ఏదేని యొకసుందర పద్యముఁ బాడుదునా? కాంతామణీ! ప్రేమభిక్షుకుఁడైన వీనికి నీవు వచ్చి ప్రేమభిక్షముఁబెట్టుము. నీదర్శనము లేనికారణమున నాకన్నుల నుండి యశ్రుధారలు ప్రవహించుచున్నవి. (ఆగి) అయ్యో! ప్రాణప్రియా! రాకుంటివేమి? ఒకవేళ వినలేదేమో! మంచిది. ఇక్కడనే కూర్చుండెదను. ఎప్పటికైనను వచ్చునుగదా? (కూర్చుండును.)

అమృతమయి—(ప్రవేశించి) యోగీశ్వరా! ఏమికారణమున మీరిక్కడఁ గూర్చుండినవారు?

బిల్వ—(స్వగతము) ఆహా! ఎటువంటి మధురవాణి! (ప్రకటముగా) సుందరీ! నీపేరెవ్వరు?

అమృత—స్వామీ! నాపేరు "అమృతమయి"యందురు.

బిల్వ—(స్వగతము) ఆహా! సుందర స్వరూపమువలెనే పేరుకూడ ముద్దుగానున్నది. వహ్వా! వహ్వా!

అమృత—స్వామీ! భోజనముచేయు నిచ్ఛయున్నదా? లేక మార్గాయాసముఁ దీర్చుకొందురా?

బిల్వ—సుందరీ! ఈరెండిటిలో నాకేదియునక్కఱలేదు. నాకోరిక వేఱొకటియైయున్నది.

అమృత—స్వామీ! మీయభిలాష మేమో సెలవియ్యుఁడు.

బిల్వ—మఱేమియును లేదు. ఎవరి సుందరస్వరూపము నామనస్సు నాకర్షించెనో వారికొఱకై వెదకులాడుచు నిచ్చటికివచ్చితిని.

అమృత—(స్వగతము) ఓమాయాప్రపంచమా! నీవెంతటి శక్తికలదానవు! సాధువులను మహాత్ములను సైతము నీవలలోఁజిక్కించుకొనుచున్నావు. (ప్రకటముగా) మహాత్మా! ఏమిది! నిరంతరహరిసంకీర్తనానందపారావారమగ్నులగు మీరుకూడ నారీరూపమునకు లోనయితిరా! నారి విషయభోగములగని. నరకద్వారము-పుణ్యస్వర్గములకు విఘ్నకారిణి. కాలకూట మహావిషమువంటిది-ఎవఁడు స్త్రీకి వశ్యుఁడగునో వాఁడు ప్రాణములను జేతులారఁ బోఁగొట్టుకొనును.

బిల్వ——అమృతమయీ! మోహాంధకారమునఁ గొట్టుకొనువానికి నీబోధ మేమియుపయోగించును. మహాత్ములగు తపస్వులే కామినీమోహమునఁ జిక్కికొన్నప్పుడు నేనొక లెక్కయా? కావున నామాటవినుము.

మ. వనజాక్షీ! యతినై సమస్తవిషయవ్యామోహమున్వీడినన్
నినుదర్శించుటచే విరాళిమదిఁ గంటిన్ మారనారాచముల్
తనువుం గాఁచెను వాంఛఁదీర్చి దయతో దాక్షిణ్యముల్ చూపి పో
మ్మనుమా! లో ననుమానము న్విడువుమా! మన్నింపుమా! మన్నుమా!

అమృత——పాపము శాంతించుఁగాక! స్వామీ! ఇదియుచితమా!

బిల్వ——అమృతా! నామనస్సుచేత నాలోచించిన నింతకంటె నుచితమైన దింకొకటిలేదు.

అమృత——(స్వగతము) అయ్యో! ఇప్పుడునాకేదిదిక్కు? ఈజడదారి జపమాలను ద్రిప్పుచుండునుగాని తనమనస్సును ద్రిప్పికొనఁజాలకున్నాఁడు. (ప్రకటముగా) స్వామీ! ఇట్లుకోరరాని కోరికమీకేల? మీచేతినుండి మీహృదయమునకు దారమువోసి యీజపమాలికను ద్రిప్పునట్లే మనస్సునుగూడఁ ద్రిప్పికొనుఁడు. సాధుశబ్దము నసాధువుఁ జేయకుఁడు. నేఁటికి మాయింట భిక్షస్వీకరించి దయచేయుఁడు.

బిల్వ——ప్రియా! నాకిప్పుడు కేవలము ప్రేమభిక్షయే కావలయును. నీసుందరస్వరూపము నందుభక్తి తుచ్ఛమైపోయినది.

అమృత——మహాత్మా! ఇది మీనేత్రదోషముగాని వేఱొకటికాదు. చూడుఁడు సర్పముచూచుట కెంతకోమలముగాఁ గన్పడును. కాని, దానినంటినచోఁ గఱచిచంపివేయును. అట్లే స్త్రీస్పర్శవలన మనోబుద్ధులు రెండును నాశనమైపోవును.

బిల్వ——ప్రియా! ఈయుపదేశములు నాకేల చేయుచుంటివి?

అమృత——మీమనస్సునందలి కోరికఁబోఁగొట్టి నిర్మల మనస్కులను జేయుటకు.

బిల్వ——మనస్సునందలి కోరికఁదీర్చిన పిమ్మటఁగదా నీవీపని చేయఁగలుగుదువు. ప్రియా! ఆలస్యముచేసి నన్నుఁ దపింపఁజేయకుము.

అమృత——స్వామీ! మీమనస్సంకల్పమే మిమ్ములోభులనుగాఁ జేయుచున్నది మీరిప్పుడు మనస్సునుజయించి సంపూర్ణపరబ్రహ్మమును బొందుఁడు,

బిల్వ——ప్రియా! నీముఖసందర్శనభాగ్యముఁగాంచుటే పరబ్రహ్మమును బొందుట. మేఘములనుజూచి నెమిలియెట్లు ప్రసన్నతనొందుచున్నదో యట్లే నామనస్సు నీయానన సందర్శనమునఁ బ్రసన్నమగుచున్నది.

అమృత——పాపము శాంతించుఁగాక! స్వామీ! హరిభక్తులగు సాధుపురుషులు మీరిట్టి దుర్వాక్యము లుచ్చరింపఁదగునా? తుచ్ఛ సుఖాపేక్షచే నరకకూపమునఁ బడఁదలంచుచున్నారా?

[సేవకరాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సేవ——ప్రియా! ఇదియేమి? ఈస్వామితో జగడమాడుచున్నదానవు. యోగీశ్వరుని సన్మానించుటకు మాఱుదెబ్బలాడి నిరాదరించుచుంటివే!

అమృత——నాథా! చూడుఁడు. ఇతఁడు యోగియై భోగికానున్నవాఁడు.

సేవ——ప్రియా! ఈమాటలేమి? సాధునింద నామనస్సునకుఁ గష్టముగానున్నది.

అమృ——నాథా! మిమ్మెప్పుడును గష్టపెట్టలేను. ఇంకముందును గష్టపెట్టఁదలంపను. వీనిచర్యచూడ వ్యభిచారివలెనున్నాఁడు చూడుఁడు. వీని నేత్రములనుండి యెట్టివికారదృష్టి వెలువడుచున్నదో చూడుఁడు. ఈదుష్టాత్ముఁడు సత్పురుషుఁడుకాఁడు.

సేవక——నారాయణ! నారాయణ! ఇట్టిదుర్వాక్యములాడి నాచెవుల నపవిత్రముచేయకుము. నాహృదయమునకు బాధకలుగఁజేయకుము. మనకర్తవ్యము దానమొసఁగుట కాని వానిచెడ్డగుణము లెంచుటకాదు. వీని నగౌరవించి వీనికోర్కెను తీర్చక నిరాశుఁడు కానీయకుము. వీనికోరిక నెఱవేర్చి పంపుము.

అమృత——ప్రాణనాథా! ఈయరాని దానమిచ్చుటెట్లు? పతివ్రత యిట్టిదానమెట్లీయఁగలదు.

సేవక——నీవు దానేశ్వరివికాఁదలఁచినయెడల నీసాధుపుంగవునకోరినదానమీయుము. మనయింటి కతిథియై వచ్చినవానిని నిరాశతోఁ బంపివేయుటకంటెఁ బాపమింకొకటిలేదు. మనయిచ్ఛానుసారముగా నెవఁడైన నొకపిడికెడు భిక్షమడిగినను ఒకటిరెండు డబ్బులడిగినను మనమిచ్చుట యొకదానమనిచెప్పఁదగదు. యాచకునకుఁ దృప్తికరమగు దానినిచ్చినచో నదియే దానమనఁబడును.

అమృత——నీచమనుష్యుఁడుకాక సాధుపురుషుఁడిట్టి సిగ్గులేని కోరిక వెల్లడించునా ? నాథా! వీఁడు విషయలోలుఁడయిన కపటసన్యాసిగానున్నాఁడు. వీనిమాటలు మన్నించిన లోకాపవాద మెట్లుతప్పించుకొందుము.

సేవక——ఆకలి వేసినవాఁ డన్న మెట్లడుగునో యట్లే యీసాధువు నిన్ను మన స్సంతుష్టికై యాచించుచున్నాఁడు. దీనిలోఁ గపటమేమున్నది? చాలు నింకమాఱుమాటాడకుము. నాయాజ్ఞ శిరసావహించి వీనికోరికఁ దీర్పుము. వెళ్ళుము.

అమృత——నాథా! మీయాజ్ఞ శిరసావహించెదను. కాని నాధర్మరక్షణముఁ జేయువారెవ్వరని భయపడుచున్నాను.

సేవక——ఓసి వెఱ్ఱిపడుచా! ఎవఁడు సీతమానముఁ గాపాడెనో యెవఁడు నిండుఁ గొలువులో ద్రౌపదీమానసంరక్షణముఁ జేసెనో యాభగవత్స్వరూపుఁ డగు నీసాధుపురుషుఁడే నీధర్మముఁ గాపాడును. (బిల్వమంగళునితో) యోగిశ్రేష్ఠా! ఏమియాలోచించుచున్నారు? ధైర్యమువహించి తమ యిచ్ఛను బూర్ణముగావించుకొని నాగృహముఁ బవిత్రముఁ జేయుఁడు.

బిల్వ——(స్వగతము) నాభయమింకఁ దీఱినది. కోరిక నెఱవేఱునన్నయాస ఫలించినది. ఏలయన వీని నేత్రములయందుఁ గ్రోధము లేశమైనఁ గన్పడుట లేదు. ముఖాకృతి శాంతిహర్ష సముదంచితమై యున్నది. (ప్రకటముగా) భక్తా! తొందరపడకుము. వచ్చుచున్నాను.

సేవక——స్వామీ! ఇది కేవల భక్తధర్మమేకాని తొందరయేమియును లేదు. సుఖముగా మీయిష్టానుసారము దయచేయుఁడు. తమయిచ్ఛఁదీర్చికొని సేవకుల జన్మములు సఫలముఁగావింపుఁడు. (అమృతమయితో) ప్రియా! వెళ్లుము. యోగీంద్రునకు సంపూర్ణ సేవ చేయుము. నేనంగడికేగివచ్చెదను. నేను లేనివేళ నీయన కెట్టికష్టమును గలుగఁగూడదుసుమా! జ్ఞాపకముంచుకొనుము. జాగ్రత్త!

అమృత——స్వామీ! మీయాజ్ఞకు బద్ధురాలను.

సేవకు——భగవంతుఁడు నిన్ననుగ్రహించుఁగాక!. (నిష్క్రమించును)

అమృత——మహాత్మా! దయచేయుఁడు.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

5 రంగము:——శయనగృహము.

[అమృతమయి——బిల్వమంగళుఁడు ప్రవేశించుచున్నారు.]

అమృత——మహాత్మా! మీరీపాన్పుపైఁ గూర్చుండుఁడు. పరిశుద్ధవస్త్రములు ధరించి వచ్చెదను.

బిల్వ——ప్రసన్నపూర్వకముగా వెళ్ళి యతిశీఘ్రముగా రమ్ము.

అమృ——మహాప్రసాదము. (వెళ్ళును.)

బిల్వ——(స్వగతము) ప్రపంచమందుఁ బ్రతిచోరుఁడును నిశ్శబ్దముగా నిల్లు ప్రవేశించి దోచుకొనును. కాని సుందరమైనస్త్రీ యెట్టిధైర్యముగల బందిపోటు దొంగయై యున్నది! తనవస్త్రముల బెడబెడలచేతను భూషణముల నిగనిగలచేతను కాళ్ళగజ్జెల రవరవల చేతను వీరాధివీరులయు శూరశిఖామణులయు మనోధనమును దోచుకొనుచున్నది.

మ. సురసామ్రాజ్యమునేలు నింద్రుఁడుఁ దపన్ స్వాత్మేచ్ఛ బ్రహ్మత్వ భా
స్వరుఁడై సృష్టికి మాఱుసృష్టి యొనరింపన్ జాలు గాధేయుఁడున్
సరసీజాక్షి నహల్య దేవవనజాన్ స్వర్గా మేనకన్ బొందరే ?
ధరణిన్ వారికి దానఁబాప మణుమాత్రంబైన సిద్ధించెనే ?

ఇట్టి సందర్భమున నొకసాధారణ సంసారి యీశత్రులను ఏశస్త్రములచేఁబోరాడి గెలువఁగలఁడు ? (భక్తి ప్రకట మగును.)

భక్తి——(ప్రవేశించి) సంసారలోభమందుఁబడి ధర్మమును మఱచుచున్న కాముకుఁడా! నీయంతిమస్థితికి దృష్టిఁబఱుపుము. కామమునకు ముందు ధర్మము రక్షించుకొనుము. (అదృశ్యయగును.)

బిల్వ——ఆఁ! ఏమిది! నేనేమి చూచుచున్నాను! ఎవరిప్పుడు మాటాడినది ? ఏమియాశ్చర్యము! ఓహో! ఔను. మోహమేఘములు విడిపోయినవి. తుపాను శాంతించినది. ఒక్కమాఱుగా నొకసుందరస్త్రీ నేత్రములలో నుండు విద్యుచ్ఛక్తి ప్రసరించి పోయినది. అధైర్యము ధైర్యముగను-అశాంతి శాంతిగను-మారిపోయినవి. అతిదుఃఖ మతిదుఃఖము. ఈనేత్రములే నన్నత్యంత దుఃఖానలమునఁద్రోసి మోసము చేసినవి. తృష్ణారూప మేఘములాదిత్యరూపుఁడైన సూర్యునిగప్పి వేసినవి. కామరూపమగుమనస్సు బుద్ధిరూపమగు కమలమును గదలించి వేసినది. ఆహా! నానారత్న

పరిశోభితమగు హర్మ్యముఁ ద్యజించితిని. భార్యామణులను ద్యజించితిని. కాని, యిప్పటి వఱకును గామమును ద్యజింపలేనయితిని. ఓమనస్సా! నీవెంత పాడుదానవు! ఈదోషమంతయు నీనేత్రములది. ఇవి లేనియెడల నేనీ దుర్మార్గములఁ జరింపక పోయియుందును. ఈనేత్రముల వలననే సుందరశ్యాముని చతుర్భుజస్వరూపమును జూచియు నస్థిమాంసమయశరీరము మీఁది మోహముచే దానిని మఱచి పోయితిని. (చుట్టునున్న చిత్రఫలకములను జూచి) ఆహా! పతివ్రతామణుల దర్శనమున ధన్యుఁడనైనాఁడను.

మ. అదిగో సీత, పతివ్రతాతిలకమా హా! ద్రౌపదీకాంత య
ల్లదిగో గౌతమపత్ని చిత్రఫలకంబౌ మూలఁ గన్పట్టు న
య్యదియే, వీరినిగన్న నామదిని మోహంబంత మయ్యెన్ జయా
స్పద విజ్ఞానముపుట్టె, నీమెకు నమస్కారంబు నాతల్లికిన్॥

అమృత.—(వచ్చి) ఎప్పుడు బ్రాహ్మణులు-సాధుపురుషులు-దురాచారప్రవర్తకులై వేదబాహ్యులై చరించిరో యప్పుడే భారతదేశము నాశనమైపోయినది. ప్రజలందఱును నాశనమైపోయిరి.

బిల్వ—మాతా! అట్లుకాదట్లుకాదు. భారతదేశము నాశముకాలేదు. నాశనముకాదు. ఎపుడును నాశనముకాదు. మాతా! నీవంటి పతివ్రతాశిరోమణి యొక్కర్తయున్నంత వఱకును భారతవర్షము నాశనముకాదు. అమ్మా! నేను నాయపరాధమెఱింగితిని.

ఉ. తల్లివినీవు, నీకతన ద్వారికనంబడె మోక్షవీథికిన్
దల్లిరో! నన్ క్షమింపుము ప్రదక్షిణపూర్వకమన్నమస్కృతుల్
చల్లని దృష్టిఁ గైకొని యొసంగుము దీవెనలన్, దరించెదన్
బల్లవకోమలంబయిన పాణిస్పృశింపుము నాశిరస్థలిన్॥

ఇప్పుడు నాకు రెండుసూదులు భిక్ష కావలయునని యడుగుచున్నాను.

అమృత—స్వామీ! సూదులేల? మఱేమయిన నుత్తమపదార్థ మడుగుఁడు.

బిల్వ—వలదు వలదు. ఇప్పుడేమియు నాకక్కఱలేదు. నాకును బరమాత్మునకును మధ్యవిడిపోయిన సంబంధము మఱల నీసూదులతోనే కలిపెదను. సూదులు తెమ్ము.

అమృత—చిత్తము. అట్లేయిచ్చెదను. (వెళ్ళును)

బిల్వ—గొప్పవంశమునఁ బుట్టి యుత్తమపదవియందున్న యీమె మహిమ ముందుఁ జపలమనస్కుఁడగు వానిజీవితమెందులకుఁ బనికిరాదు. ఈమె పాతివ్రత్యమహిమ మద్వితీయముకదా! ఆహా! భాగ్యమెప్పుడు నాశారహితుని దగ్గఱనుండదు. శక్తివంతుఁడగు గొప్పరాజుకూడ నిరాశకల్గినప్పుడు రాజ్యాదులు నిల్పికొనఁ జాలఁడు. రాజ్యచిహ్నము-రాజశాసనదండము-కిరీటము-మొదలగునవి సర్వము నశించును. అప్పుడు కృషికులును మహారాజులును గూడఁ దుదకొక్కపదవినే పొందుదురు.

అమృత—(సూదులు తెచ్చి) స్వామీ! సూదులివిగో!

బిల్వ—మాతా! ఇటు తెమ్ము. (తీసికొని) ఓదుష్టనేత్రములారా! మీరు నిర్లజ్జితులు. నేను మీకు శ్రీకృష్ణభగవానుని దర్శనముఁ జేయించితిని. దానికిఁ బ్రతిఫలముగా మీరు నన్నుఁ బాపమార్గగామిని జేసితిరి. మీరే లేనియెడల నేనీ పరస్త్రీమీఁద మోహదృష్టిఁ బఱపక యుందును. నాహరిభజనమునకు భంగము కలుగకుండెడిది. ఇప్పుడే సూదులతో మిమ్ము శిక్షించెదను. ప్రభువుతోఁ బ్రేమమార్గము నీసూదులతోఁ గలిపెదను. ఈనిర్లజ్జానేత్రములను తప్పక పొడిచివేసి యానందమయస్వరూపుఁడగు శ్రీకృష్ణుని ధ్యానించెదను. (కన్నులు పొడుచుకొనును.)

అమృత—అయ్యో! అయ్యో! స్వామీ! ఏమిది యేమిది! చెలులారా! రండు రండు.

చెలికత్తెలు—(వత్తురు)

బిల్వ—కృష్ణా! కృష్ణా! ద్వారకావాసా! యదువల్లభ! నందనందన! దామోదర! మురళీధర! కాళీయఫణిఫణాగ్రములఁ దాండవమాడు శ్రీకృష్ణుని దర్శించుచున్నాను. ఆహా! ధన్యుఁడను ధన్యుఁడను! (భజించును.)

(ఇంతటినుండి బిల్వమంగళుఁడు సూరదాసనఁబడును)

ఇది చతుర్థాంకము.

ప్రబోధచింతామణి.

పంచమాంకము.

1. రంగము. వనమార్గము. ప్ర॥ మాయాదేవి, సోమగిరి.

మాయా—యోగీంద్రా! ఇక్కడికి బృందావన మెంతదూరమున్నది.

సోమ—అమ్మా! ఒక్కదినము ప్రయాణము చేయవలసియున్నది.

మాయా—గురువర్యా! నందకుమారుఁడు బృందావనమునందే వసించుచుండునా?

సోమ—సకలాంతర్యామియైన నందకుమారుఁడొక్క బృందావనమందేకాదు. సర్వప్రదేశములందునుగలఁడు. ఆపరమాత్ముఁడు జీవులయందొక్కఁడై నిరంతరనివాసము చేయుచున్నవాఁడు.

మాయా—మహాత్మా! బృందావన మాపరమాత్మునకుఁ బ్రేమస్థానమనియు నచ్చటనే తఱుచుగా వసించుచుండుననియుఁ జెప్పుదురు.

సోమ—మాతా! నీమాటనిజము. నందకుమారునకు భక్తవాత్సల్యము విశేషముగాఁ గలదు. పెక్కండ్రుభక్తులు బృందావనమునఁ దపోనిష్ఠాదులొనర్చుచుండుటచే నచ్చటనందనందనుఁడు విహరించుచుండును. ఆ యదుకుమారుఁడు కేవలము భక్తవశంకరుఁడుకదా!

మాయా—యోగీంద్రా! ఆబృందావనమున నాప్రాణేశ్వరుని దర్శనముకూడ దొరకునా?

సోమ—అమ్మా! దొరకిన నీవతిధన్యురాలవగుదువు. ఈశరీర ముత్తమపదార్థముకాదు. నిర్గుణపరబ్రహ్మస్వరూపుఁడైన భగవంతుని నిర్మలమైన భక్తితో నెవ్వఁడు సర్వదా దారాపుత్రాదులకంటె నెక్కుడుగాఁ బ్రేమించి కొల్చుచుండునో అట్టివాఁడే పరమసుఖముఁబొందును. శ్రీహరిధ్యానమున నేకదా ధ్రువుఁడు నిర్వాణపదముఁగాంచెను. హరిధ్యానము

చేత నేకదా ప్రహ్లాదునకుముక్తి దొరకినది. సర్వబంధ విసర్జనముఁజేసి భగవంతునితోడి బంధమును బ్రబలించుకొనువాఁడే యెల్లప్పుడును దుర్మార్గమునుండి సన్మార్గమునకు రాఁగలుగును.

చింతామణి—(ప్రవేశించి) శ్రీకృష్ణభక్తులెవరైనవచ్చి నాకుబృందావనమార్గముఁ దెల్పుదురా?

సోమ—అమ్మా! నీవీ నిర్జనారణ్యమున నేల యొంటరిగాఁ దిరుగుచున్నావు?

చింతా—స్వామీ! యాత్రార్థమైపోవుచున్నాను.

సోమ—చింతామణీ! మేముకూడ నచ్చటికే పోవుచున్నాము.

చింతా—కాని స్వామీ! నాపేరు మీరెట్లుగ్రహించితిరి?

సోమ—నీవలన జ్ఞానోపదేశముఁగాంచిన బిల్వమంగళుని మహిమ నేనెట్లు తెలిసికొంటినో యట్లే నీపేరుకూడ గ్రహించితిని.

చింతా—మహాయోగిదర్శనమున ధన్యురాలనైతిని. యోగీశ్వరా! తమ నామధేయము?

సోమ—నన్ను సోమగిరియందురు.

చింతా—ఏమీ! ఆర్య బిల్వమంగళునిగురువు సోమగిరియా! మీకనేకసహస్రసాష్టాంగవందనములు. గురువర్యా! నన్నుఁగూడ నుద్ధరింపుఁడు. మీశిష్యురాలినిగాఁ జేసికొని యుపకారముఁజేయుఁడు. సముద్రజలపానముచే దాహశాంతికాదు. వర్షజలముఁ ద్రాగుటవలన దాహముతీరును. అట్లే సద్గురువిహీనుఁడై మనుష్యుఁడు శాంతిపొందఁజాలఁడు.

సోమ—చింతామణీ! నీవు గురుమంత్రోపదేశమునకుఁ బాత్రురాలవు. రమ్ము. నీకు మంత్రోపదేశము చేసెదను.

(అందఱు నిష్క్రమింతురు.)

[నేలయూడ్చుచు విజయుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విజ—మదనమోహనా! శ్రీకృష్ణా! నటవరా! హరీ! వహ్వా! ఈనామము లెల్లప్పుడు జపించుచుండుము. ఓమనస్సా! శ్రీకృష్ణనామము విడిచి నీవు మూర్ఖత్వమున నితరుల నేల జపించెదవు? అమృతఘటము నిండియున్నప్పుడు సముద్రోదకమేల త్రాగెదవు? (తుడుచును. మంగళుఁడు ప్రవేశించును. ధూళి మంగళునిపైఁబడును.)

మంగళుఁడు—(కోపముతో) ఏమిరా! దుష్టా! ఎదురుగ వచ్చుచున్నవారిని జూచుటలేదా! ధూళి నెగురగొట్టుచున్నావు?

విజ—స్వామీ! అపరాధము క్షమింపుఁడు.

మంగ—చండాలుఁడా! నోరుమూయుము. మరల గంగాస్నానము చేయవలసి వచ్చినది. ఛీ! ఛీ! వస్త్రములన్నియుఁ బాడుచేసితివి.

కృష్ణు—(ప్రవేశించి) మంగళా! ఎందుకీదెబ్బలాట? భక్తునితోడనే జగడమా!

మంగ—మహాత్మా! చూడుఁడు. ఈనీచుఁడు నేలయూడ్చుచు ధూళి నెగురగొట్టి నావస్త్రములన్నియుఁ బాడుచేసినాఁడు. స్వామీ! మీరువీనిని భక్తుఁడంటిరే!

కృష్ణు—అవును. ఇతఁడునాభక్తుఁడు. మంగళా! భక్తియెవ్వరి పిత్రార్జితధనముకాదు. నన్నెవ్వఁడు నిజభక్తిచే ధ్యానించునో వాఁడేముక్తిని గాంచును. ఈశ్వరభక్తుఁడగుటకు వీనికేమైన నాతంకముకలదా?

మంగ—స్వామీ! ఈశ్వరభజన మొకతుచ్ఛుఁడాచేయుట?

కృష్ణు—ఔను! ఒకతుచ్ఛుఁడే. ఎవ్వఁడునన్ను నిరంతరభక్తితో నుపాసించునో వాఁడేనాకంతరంగభక్తుఁడు. మైదానమున నఱకువానిదే కత్తి. నీచులైననేమి క్షుద్రులైననేమి భక్తియేప్రధానము. భక్తిమార్గములనేకములుకలవు. కాని వానికన్నిటికి నంతమున ద్వారమొక్కటియే సుమా!

మంగ—మహాత్మా! నేఁడు నాకన్నులు తెఱువఁబడినవి (విజయునితో) సోదరా! నాయపరాధము క్షమింపుము.

కృష్ణు—(విజయునితో) భక్తా! విజయా! నాకుమిక్కిలిగా నాఁకలివేయుచున్నది. తినుటకేమైనఁ బెట్టెదవా?

విజ—మహారాజా! ఇప్పుడు వనఫలములుమాత్రము సిద్ధముగానున్నవి. తీసికొనివచ్చెద నారగింపుము.

కృష్ణు—వనఫలములరుచి యితరపదార్థములకు లేదు. వానినిదెచ్చియిమ్ము.

విజ—(వెళ్ళి తెచ్చి) మహాత్మా! ఇవిగోఫలములు. (కృష్ణునకిచ్చును.)

కృష్ణు—(తీసికొని తినుచు) ఆహా! ఎంతస్వాదుభోజనము. ఈఫలములు లమృత సమానముగానున్నవి. మంగళా! ఎంతతీయనిపండ్లోయి! ఈతీపు

దనము ప్రేమవలనఁ గలిగినదిసుమా! ఈప్రసాదము చాలమహత్తు కలది. మంగళా!

గీ. ఆదరమునఁబెట్టు కేచేమవస్తువులైన! నమిత రుచినొసంగు సమృతమట్లు
ప్రేమలేకపెట్టు కే మృష్టాన్నభోజనం! బైన విషసమానమగునుగాదె?

మంగ—స్వామీ! నేఁడు మాయ వదలుటవలననాకు జ్ఞానోదయమయినది.

విజ—దేవా! వాసుదేవా! నీదర్శనంబున ధన్యుఁడను! మనస్సునందలి కోరికలన్నియు ఫలించినవి.

కృష్ణు—విజయా! నేనుగూడ ధన్యుఁడనైతిని. ఇట్టి ఫలములెన్నఁడును నేను దినియుండలేదు. అత్యంతభక్తితో నీవిచ్చిన యానందఫలము లారగించి తృప్తుఁడనైతిని. విజయా! నన్నుమఱువక తలఁచుకొనుచుండుము.

మంగ—మాయ వదలిపోయినది. మాయమాయమైనది.

(అందఱు నిష్క్రమింతురు.)

2. రంగము. అడవి.

[నిర్లోభరాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

నిర్లో—మాయా! మాయా! నీవెక్కడికేగితివి? నీకొఱకై వనమంతయుఁ దిరిగి తిరిగివచ్చితిని. సందుగొందులన్నియుఁ దిరిగితిని-ఇండ్లు-అంగళ్ళు-రేవులు మొదలగుతావులు కాకివలెఁ దిరిగివచ్చితిని. కాని యెక్కడను దొరకవైతివి. హా! నామాయా! నిన్నింకెక్కడ వెదకుదును! ఏవిధముగానిన్నుఁ బట్టుకొందును. నాకెంతకష్టము తెచ్చిపెట్టితివి! హా! భగవంతుఁడా! నీకైన దయలేదా? ఆమాయయందము-ఆమాయచందము-ఏమనిచెప్పుదును! ఇక్కడనే ధ్యానముచేయుచుఁ గూర్చుందుఁగాక! ఎప్పటికైన నీమార్గమున నామె రాకపోవునా? (కూర్చుండును.)

[సోమగిరి-చింతామణి-మాయాదేవి ప్రవేశించుచున్నారు.]

సోమ—మాయాదేవీ! ఈమహాత్ముఁడు హరిభజనానంద పరవశుఁడై యున్నాఁడు. నీవీయనయొద్దఁ గూర్చుండుము. నేను స్నానముచేసి వచ్చెదను. చింతామణీ! నీవీశ్వరపూజకై పూవులు తెమ్ము. పొమ్ము.

చింతా—చిత్తము స్వామీ! (సోమగిరి చింతామణి, నిష్క్రమించుచున్నారు.)

మాయా—(నిర్లోభరామునకుఁ గొంచెము దూరమునఁగూర్చుండును.)

నిర్లో—(కన్నులు తెఱచిచూచి) ఆహా! ఏమిది! మాయవచ్చినదే! నాసంచి దొంగిలించిన మాయ. నామనసు నపహరించినమాయ ఇదిగోవచ్చినదే. ఓహోహో! ఆహాహా! ఇప్పుడిచ్చటఁ గూర్చుండఁగనే లభించినది. ఈమాయాసుందరి నేమనివర్ణింతును!

మాయా—స్వామీ! మీరెవరితోనిప్పుడు మాటాడుచున్నారు?

నిర్లో—ఏమీ! ఇంతలోనే మఱచితివా? ఎవనిజట నీహృదయమున గాయముఁ దగిలించెనో యెవనిబొట్టు నీమనస్సును లోభింపఁజేసెనో యెవనిసంచిఁ జూచి నీవు భ్రమించితివో యట్టినిర్లోభరామునే మఱచితివా! రూపాయలసంచి దొంగిలించుకొని పాఱిపోవుటకూడ మఱచితివా? ప్రియా! చెప్పు శీఘ్రముగాఁజెప్పు. ఆసంచియేది? నిజముఁజెప్పుము. లేదేని దీనితో నీతలకాయ రెండుచెక్కలు గావించెదను.

మాయా—అదియేమిసంచి స్వామీ! మీరుపొరపడుచున్నారు. నన్నెవ్వతెను గాభ్రమించినారు?

నిర్లో—ఆహా! ఈమాయసంగతి యేమిచెప్పుదును. అంతయు మాయయే. ప్రియా! నిన్ను నేనెఱుంగకపోలేదు. (కౌఁగిలించుకొనఁబోవును)

మాయ—(తప్పించుకొని కేకలువేసి) గురువర్యా! శీఘ్రముగారండు. ఈసాధువునన్ను బాధించుచున్నాఁడు.

సోమ—(వచ్చి) తల్లీ! ధైర్యమువహింపుము. శ్రీకృష్ణభక్తులను బాధించువాఁ డెవ్వఁడు?

నిర్లో—నేనే మఱెవ్వరు? మాయా! ఇపుడెక్కడికిఁ బారిపోయెదవు? సంచి యిచ్చినఁగాని కదలనీయను.

సోమ—అధముఁడా! దుర్మార్గుఁడా! మాయామోహమునఁజిక్కి సంచిసంచి యని భ్రమించి యఱచుచున్నావు. ఓభగవంతుఁడా! వీనిని లోభమునుండి రక్షింపుము.

నిర్లో—ఏమనుచున్నావు! లోభమా! ఓరిమూర్ఖుఁడా! నాపేరే నిర్లోభరాముఁడు. లోభముతోనాకు బనిలేదు.

సోమ—మాతలారా! నడువుఁడు. నడువుఁడు. వీఁడెవ్వఁడో పిచ్చివానివలె నున్నాఁడు.

(నిష్క్రమింతురు)

మాయ—(ప్రవేశించుచున్నది)

నిర్లో—ఆ! వెళ్ళిపోయెనా? ఏమిది! ఈమెయెవ్వతె? (చూచి పరిశీలించి చిఱునవ్వుతో) ఇది నామాయయే. ఆహా! ఈమాయాసుందరి నేమని వర్ణింతును! (మాయతో) ప్రియా! ఇంతదనుక నెచటఁబోయితివో చెప్పుము. నేను నీవియోగాగ్నిలోఁబడి భస్మమైపోవుచున్నాను. అవును గాని మాయా! రూపాయలసంచియేది?

మాయ—స్వామీ! మీకుధనము ప్రియమా? నేనుప్రియమా! నిజముగాఁ జెప్పుఁడు.

నిర్లో—ప్రియా! దీనికేమిగాని సంచిమాటచెప్పు. నాతల్లిమీఁదకంటె ధనమునందు నాకెక్కుడుప్రియము.

మాయ—అట్లయిన నామీఁదఁబ్రేమ లేనేలేదు. వట్టిమోహమునటించి నన్ను వివాహమాడుటకైప్రయత్నించుచున్నారు. ప్రేమలేనిపెండ్లి యెందులకు?

నిర్లో—ప్రియా! ప్రియా! అట్లనకు. కావలసినంతప్రేమయున్నది. మనవివాహ మింకెప్పుడు?

మాయ—ఇప్పుడే

నిర్లో—ఇప్పుడే! ఆహాహా! ఓహోహో! (నవ్వుకొనుచు) ప్రియా! నేను వెళ్ళి పురోహితుని బిల్చికొనివత్తునా?

మాయ—దీనికిఁ బురోహితునితోఁ బనియేమున్నది? మీరే పౌరోహిత్యము వహింపుఁడు.

నిర్లో—అవును. ప్రియా! సత్యము చెప్పితివి. ఇప్పుడు సుముహూర్తసమయమైనది. పాణిగ్రహణము చేయనిమ్ము. (గణపతినిపూజించును.)

మాయ—ఆఁ ఆఁ! ఇదేమి యిట్లుచేయుచున్నారు! ముందీకాషాయవస్త్రములు మొదలైనవి తీసివేయుఁడు.

నిర్లో—ప్రియా! ఇవియన్నియుఁ దీసివేయుమనుచున్నావా? మంచిదే. అట్లే చేసెదను. దీనిలోనేమున్నది. వీనినుండి మిక్కిలి దుర్వాసనవేయుచున్నది.

చూడు. ఈసంచితో నాకింకేమి పని ? (పాఱవేయును) ఈచేతికఱ్ఱవలని లాభమేమి ? (పాఱవేయును) ఈమృగచర్మ మింకెందులకు ? (పాఱవేయును) ఈజపమాలతో నింకేమిలాభము (పాఱవేయును) ఈగంజాయి గొట్టమెందుకొఱకు ? (పాఱవేయును) వహ్వారే ! నిర్లోభరామా ! నీవిప్పుడు నిజముగా నిర్లోభుఁడవైతివి. నీవిప్పుడు బిచ్చమెత్తవు. విభూతి రాచుకొనవు. ప్రియా ! చూడుమిప్పుడు చక్కఁగానుంటినా ?

మాయ——నిస్సంశయముగాఁ జక్కఁగానున్నారు. కాని ప్రియా ! నీముక్కుమీఁద నేదోయున్నది. నేను దీసివేయుదునా ?

నిర్లో——అవును. ప్రియా ! ఏదోయున్నట్లున్నది. తీసివేయుము (దగ్గఱకువచ్చును)

మాయ——(కత్తితో ముక్కుకోసి పాఱిపోవును)

నిర్లో——హా ! హా ! హా ! దుష్టా ! నీవునశింతువుగాక ! సంచితోఁగూడ ముక్కుకోసికొనిపోయినది. అయ్యో ! దుర్భాగ్యము ! నిర్లోభరామా ! నీ బ్రదుకెంతకువచ్చినది! సంచి-ముక్కు-మాయ యీమూఁడును బోయినవి. దుర్మార్గురాలగు నీమాయను వెంటాడి పట్టుకొని గొంతుకపిసికి వేసెదఁగాక ! (పరుగెత్తును)

3. రంగము. బృందావనమార్గము.

ప్రవేశము-మంగళుఁడు-కృష్ణుఁడు.

కృష్ణు——మంగళా ! ఈప్రపంచమం దేమనుష్యుఁ డీశ్వరసంకీర్తనముచేయునో యతఁడే ధర్మపదముఁగాంచును. వానినిజూచి నామనస్సు శాంతిసుఖమందుచుండును. నాభక్తులయొద్ద నేనెప్పుడును మెలఁకువతోనుందును. నేను నాదాసులకు దాసుఁడనుసుమా !

మంగ——దేవా! ఇది మీమహాదయా విశేషము. అటుచూడుఁడు. బిల్వమంగళుఁ డిట్లేవచ్చుచున్నాఁడు.

కృష్ణు——(చూచి) అవునవును. కొంచము నేపావృక్షమూలమున నిల్చి వీనిచర్యలరయుదము రమ్ము. (కృష్ణుడు మంగళుఁడు చెట్టుచాటుననిల్చుచున్నారు)

బిల్వ——(ప్రవేశించి)

శా. శ్రీకిన్ సేవ్యము, మోక్షదాత బలికిన్ శేషాహిపుణ్యంబు, గం
గాకూలంకషతల్లి, చంద్రధరమున్ ఖ్యాతబృందారక
ప్రాకారంబగు నీపదాంబుజము దేవా! నీకృపావాప్తిచే
నాకున్ సర్వశరణ్యమయ్యెడిని కృష్ణా! దీనసంరక్షణా !

కృష్ణు——మంగళా బిల్వునిభక్తి యెట్టిదో తెలిసికొంటివా ?

మంగ——దేవా ! తెలిసికొనుచున్నాను.

బిల్వ——శా. కన్నుల్ కాయలుకాచె నిన్నుఁగన నాకాంక్షించుచున్నాఁడ,నో
యన్నా ! యెన్నఁడు నిన్నుఁజూచి పరిపూర్ణానందవారాశి ని
ష్పన్నస్వచ్ఛసుధారసంబుఁదమినాస్వాదింతు నీపావసం
ఛన్నంబైన మనుష్యజన్మమునఁ గృష్ణా ! దీనసంరక్షణా !

బిల్వ——అయ్యో ! ఆమురళీధరుని గన్నులార నెప్పుడుచూచెదనోకదా! ఇప్పటివఱకును నాకు బృందావనమార్గముఁజూపు దాతయెవ్వఁడును దొరకలేదు. తనతోడి గొల్లపిల్లలతో నాడుకొనుచు బృందావనమంతయు నానందనిలయముగాఁజేయు మురళీగానము చేయుచుండు నందనందనుని కడకుఁ బోవుదారిఁ దెలుపువారెవరును గన్పడలేదు. ధైర్యము వహించితిని. సాహసించితిని. కాని, ప్రతిఫలము దొరకలేదు. నేనెక్కడికేగిన నక్కడ నన్నుఁ బిచ్చివాఁడని యనుకొందురు. ఓకృష్ణా ! ఇవిసర్వముఁ దిలకించుచు నీ వుపేక్షించుచుంటివా ? నీవెప్పటికి నాకంటఁబడుదువో నాకుఁదెలియకున్నది. కాని జ్ఞాపకముంచుకొనుము. నన్నిట్లు నీవు బాధించినచో శాంతిసుఖమునందఁజాలవు. ఇప్పటివఱకు నాకేదారియు దొరకలేదు. బృందావనమెంతదవ్వుకలదో తెలియదు. ఎవరినడుగుదును ? ఓభూదేవీ ! ఆకృష్ణుఁడు నీయొడిలోనేయున్నాఁడు. ఆమదనమోహనుఁడు ఆవెన్నదొంగ-ఆగోపికాప్రియుఁడు-నీయొడిలోనేయున్నాఁడు. ఇదియంత యునీస్థానమే. ఆనవనీతచోరుఁడగు శ్రీకృష్ణుఁడు సకలజనపోషకుఁడగు శ్రీకృష్ణుఁడు నీవిచ్చిన పాలుత్రాగి పెరిఁగినాఁడు. నీకుమారుని దర్శనము నాకుఁజేయింపవా ? అయ్యో ! నాకంటె నీకంకరరాళ్లు చాలఁబుణ్యము చేసికొన్నవి. ఇవియెప్పుడును గోపీనాథుని చరణ పరిష్వంగము కలిగి యుండును.

కృష్ణు—మంగళా! పాపమాబిల్వమంగళు నూరడించిరమ్ము.

మంగ—(వచ్చి) సూరిదాసా! నమస్కారము!

బిల్వ—అయ్యా! నన్నీనామాంతరమునఁ బిల్చువారెవ్వరు?

మంగ—నేను బృందావన ప్రాంత వాసిని.

బిల్వ—అయ్యా! ధన్యుఁడను. మంచిసమయమున మనమిద్దఱమును గలిసికొంటిమి. ఆశ్యామసుందరుని మందిరమునకు నాకుమార్గముఁజూపించి పుణ్యముఁగట్టుకొనుము.

మంగ—సూరిదాసా! దేహమునిండ రక్తబిందువులు పొడమియున్నవి. దీనికేమి కారణము?

బిల్వ—ఇవి రక్తబిందువులుకావు. పుష్పములై నామొడలి నలంకరించుచున్నవి.

మంగ—అయ్యా! ఇప్పుడు మీరు బృందావనమునకా పోదలఁచుకొన్నది?

బిల్వ—అవునచ్చటికే కాని, ఆమదనమోహనుఁడెక్కడికిఁ దీసికొనిపోవునో తెలియదు.

మంగ—బృందావనమిక్కడికి బహుదూరమే!

బిల్వ—దూరభారములతో నేమిపని? అచ్చటికిఁబోవు టత్యంతావసరము.

మంగ—కాని, స్వామీ! మార్గమత్యంతకఠినము. మిక్కిలి దుర్గమము.

బిల్వ—దుర్గమమార్గమని భగవంతునియందు ప్రేమను బోఁగొట్టుకొనఁజాలను.

మంగ—అయ్యా! మూర్ఖుఁడవుకావలదు. కన్నులు లేనివాఁడవు. కష్టముల పాలయ్యెదవు.

బిల్వ—ఎన్నికష్ట పరంపరలు సంభవించినను సహించి స్వామిదర్శనము చేసెదను. వజ్రము సానకందీయఁబడి బహువిధములఁ బట్టఁబడి రంధ్రము చేయఁబడియుఁ గూడఁ దుదకు స్వామికిఁ గంఠహారమైనది. శ్రీకృష్ణుని చేతివేణువు తనశరీరమును జల్లులుపొడిపించుకొని యతని ముఖారవింద స్పర్శచే నిరంతరానందముఁ బొందుచున్నది.

మంగ—అయ్యా! మీమాట నిజమేకాని నామాటవినుఁడు. నేనొకగొల్లవాఁడను. నీవు బృందావనము పోవమానినచో నాతోఁగూడరమ్ము. నాయింటనేయుండి నాపిల్లలనాడించుచు హాయిగాఁ గాలముఁగడపుము. నీకు సర్వోపచారములును జేయించెదను. పాలు, పెరుగు, వెన్న మొదలగువానితో నిన్నుఁబెంచెదను.

బిల్వ—నాయనా! నీకు నాయందలి దయకువందనములు. నేను బృందావనము పోయి యచ్చట శ్రీకృష్ణునెత్తికొని యాడించెదను. శ్రీకృష్ణదర్శనము చేసిన కన్నులే కన్నులు. శ్రీకృష్ణుని స్మరించుటలో లీనమైన చిత్తమే నిర్మలచిత్తము. శ్రీకృష్ణునికీర్తించు జిహ్వయే జిహ్వ. బృందావనము పోవు పదములే పదములు. సుఖదుఃఖములందు సమానభావముఁగలిగి ధైర్యవంతుఁడనై యుందునేని యాకృష్ణుఁడే నన్ను బృందావనమునకుఁ దీసికొనిపోవును.

మంగ—సూరిదాసా! నీవు నేత్రహీనుఁడవు. నీకష్టము నేనుజూడలేకున్నాను. నామాటవినుము దుఃఖముల పాలుకాకుము. నీకొఱకా బృందావననాథుఁడెదురు చూచుచుండునా యేమి చెప్పుము!

బిల్వ—ఎవని దర్శించుటకై నేనింతదుఃఖమునకుఁ బాలగుచుంటినో వానినే వెళ్ళి యీసంగతియడుగుము. నామనస్సున నాశ్రీకృష్ణునిరూపము ప్రతిఫలించుచునే యున్నది. ఆమురళీధరుఁ డుత్సాహవంతుఁడై నా కన్నులయెదుటఁ దాండవమాడుచున్నాఁడు. ఆహా! ఓజగన్మోహనా! శ్రీకృష్ణ!

శా. కాళీయాహిఫణామణిచ్ఛటల లోకైకస్తుత్యపాదాబ్జముల్
కేళీలోలనటత్ప్రకాశమహిమన్ క్రీడింప నిగ్గాంచుచున్
నాళీకాస్యలు గోపసుందరులు సానందాత్మలై రెన్నఁడో
నాళీకాక్షుని గంటఁజూతునినుఁ గృష్ణా! దీనసంరక్షణా!

మంగ—సూరిదాసా! శ్రీకృష్ణుఁడు నీకుఁగన్పించుచున్నాఁడా? ఆహా! ఏమి నీయదృష్టము!

కృష్ణుఁడు—(ప్రవేశించి) గొల్లపిల్లఁడా! ఈసాధువును బాధింపకుము. సూరిదాసా! బృందావనమార్గము నేను జూపించెదనురమ్ము.

బిల్వ—ఆహాహా! ఈమనోహరవాణి యెవ్వరిదోకాని నాహృదయమున కత్యంతానందముఁ గూర్చినదికదా!

గీ. అంబుజాక్షుని మురళీరవానుకారి
యగుచునీకంఠనాదమత్యంతమధుర

ఫణితినా నీవుదోయిఁ బార్వణ మొనర్చి
ననఘచారిత్రుఁడితఁడేమహాత్ముఁడొకొ—

అయ్యా! నీవునన్ను బృందావనముఁ జేర్చినచో శ్రీకృష్ణుఁడు నీకు మేలుచేయును.

కృష్ణ—అట్లయిన నాచేయి బట్టుకొని రమ్ము పోవుదము. (చేయిచ్చుచున్నాఁడు)

బిల్వ—(చేయిపట్టుకొని) ఆహా! ఈకోమలహస్తము-ఈప్రియహస్తము-భగవానునిదిగాక మఱెవ్వరిదై యుండును. ఏమిమృదుత్వము! జన్మసాఫల్య మొందితిని. ఆహాహా!

మ. కరిఁ గాపాడిన హస్త మాద్రుపదరాట్కన్యామణీ మానమున్
బరి రక్షించిన హస్త మాశ్రితుల సంభావించు హస్తంబు సా
గరకన్యామృదుపాణి సంగ్రహణ సౌఖ్యం బొందు హస్తంబు, శ్రీ
హరిహస్తంబగుఁగాక! యింకెవరి దౌ హా! ధన్యుఁడన్ ధన్యుఁడన్ ॥

కృష్ణ—ఈయంధునకు మార్గముఁ జూపించుట నిష్ప్రయోజనము. ఇతఁడు మీహస్తమింక విడువఁడు.

మంగ—సూరిదాసా! నెమ్మదిగా నడువుము. కాలికి దెబ్బలుతగులును.

బిల్వ—ఇట్టిచాలదెబ్బలు నాకలవాటయినవి. శ్రీకృష్ణుని జ్ఞానరత్నము నాచేత నుండుటవలన నేనిట్టివానిని లక్ష్యపెట్టను.

కృష్ణ—సూరిదాసా! నీభక్తి నిశ్చలమైనది. భగవంతుఁడు నిన్ననుగ్రహించుఁగాక! ఇదియే తిన్ననిమార్గము. ఈమార్గమున నీవు పోవుదువేని బృందావనమునకుఁ జేరుదువు. ఇంక నాచేయివిడిచిపెట్టుము.

బిల్వ—ఈచేతిని విడిచిపెట్టుదునా? ఇట్టికోమలహస్తముఁ దుట్టతుదకుఁ బట్టుకొనఁజాలి విడిచిపెట్టఁగలనా? ఇట్లు చేసిన నాకంటె మూర్ఖుఁడింకొకఁడుండునా? నానుండి నీచేతు లేలవిడిపించుకొందువు? అనాథునకు సహాయమిచ్చియు మఱల నెందులకు విడిచిపెట్టఁ దలంచుచున్నావు? ఓవాసుదేవా! నీకొఱకై చాలఁగష్టములొందుచున్నాను. నీకరపల్లవస్పర్శయే నాకుఁ బరమానందసౌఖ్య మొసంగినది. మహాప్రవాహమునఁ గొట్టుకొనిపోవుచున్న నన్ను నీచేతులే యాపి రక్షించినవి. నీకారుణ్యమున గట్టుచేరుచున్నాను. ఇట్టితరుణమున నన్ను వదలిపెట్టి తప్పించుకొందువా?

మంగళు—మహాత్మా! నేనుజెప్పలేదా? ఇతఁడింతలో మిమ్ము విడుచువాఁడు కాఁడు. మీరు వీనికి మార్గముఁ జూపించి నిష్ప్రయోజనముగాఁ గాలహరణము చేసితిరి.

కృష్ణ—మంగళా! కొంచెము శాంతింపుము. సూరిదాసా! నీవు పొరపడుచున్నావు. నేనెవ్వఁడనని కొంటివో గాని నేనొక బీదగొల్లవాఁడను. ఈవనమందుఁ బశువులను మేపుకొనవచ్చినవాఁడను.

బిల్వ—అయ్యా! మీరు పశువులకాపరులని నేనెఱుంగుదును. మీరు పెక్కుమందలను మేపితిరి. పాలును వెన్నయుఁ జాలమెక్కితిరి. మీసుందరనయనారవిందముల కటాక్షములచేతనే గోపగోపికాజనంబులకుఁ దత్త్వార్థము బోధించితిరి. మీరట్టివారై పశువులకాపరుల మనుచున్నారు. అయినను నేను మీచేతినిమాత్రము విడువఁజాలను.

మంగ—అయ్యో! మీరిట్టిదుఃఖమునఁ బడుదురని నేను మొదటనే చెప్పియున్నాను.

కృష్ణ—సూరిదాసా! మైత్రిచేనైన జాలిచేనైనఁ జేయిచ్చినచో దానిని గోసివేయుమూర్ఖుఁ డెవ్వఁడైననుండునా? (చేతిని లాగుకొనుచున్నాఁడు)

బిల్వ—అయ్యో! మహానుభావా! నాపాలిటిభగవంతుఁడవైన నీవునన్ను విడిచిపెట్టితివా? దుర్బలుఁడనని యెఱిఁగియుఁ జేతిని విడిపించుకొంటివా? కానిమ్ము చేతిని విడిపించుకొంటివి గాని మనస్సునుండి విడిపించుకొని నీవెచ్చటికిఁ బాఱిపోఁగలవు?

కృష్ణ—సూరిదాసా! లేదులేదు. నిన్నెప్పుడును వదలిపెట్టలేదు. వదలిపెట్టను. నీవు నాకొఱకై వెదకులాడుచుంటివని నిన్ను వెదకికొనుచు నేనిచ్చటికి వచ్చితిని. (బిల్వమంగళునిచేయి తిరిగి పట్టుకొనును)

బిల్వ—దేవా! ధన్యుఁడను ధన్యుఁడను! ఎట్టికోమలహస్తము! ఎట్టియానందప్రదమైన హస్తము. (కృష్ణుని ప్రేమతోఁ గౌఁగిలించుకొనును)

కృష్ణ—సూరిదాసా! నన్ను దర్శించితివి కావున నింక విడిచిపెట్టుము.

బిల్వ—దేవా! నేఁడు తృప్తితీఱ నిన్ను దర్శించితిని. ఆహా! కృష్ణుఁడే నేను నేనే శ్రీకృష్ణుఁడు. సంస్కారములలో నంతిమసంస్కారమైనది. దుష్కార్యములనువహించు నావమునిఁగినది. మనస్సు సుందరస్వరూపామృతముచే

నిండినది. ఆహాహా! శ్రీకృష్ణలీలాసముద్రమునఁదేలి యాడుచున్నాను గదా!

సీ. కాళీయభోగి భో ఽ గములపైఁగజ్జెలు । ఘలుఘల్లురననా ఽ ఘనుఁడితండె,
గోవర్ధనంబెత్తి ఽ గోకులంబునుగావ । నెలకొన్నయాదవ ఽ తిలకమితఁడె,
పాంచాలి కతయ ఽ వస్త్రంబులిడి దీన । లోకమేలిన గాన ఽ లోలుఁడితఁడె,
బృందావనాశ్రిత ఽ బృందావనము సేయు । నార్తరక్షణపరా ఽ యణుఁడితండె

గీ. అంధునకునిన్నుఁగాంచు భా ఽ గ్యంబుఁగోరకె
ధన్యుఁడనుధన్యుఁడను యశో ఽ దాకుమార!
లేనిదేయది నీకృపా ఽ లేశమున్నఁ
గృష్ణ! శ్రీకృష్ణ! కృష్ణ! హ ఽ రీ! ముకుంద!

కృష్ణ—సూరిదాసా! నన్నింక విడిచిపెట్టి యీకట్టఁదీసికొనుము. దీనిసహాయమున నీవు సులువుగా బృందావనముఁ జేరుదువు.

మంగ—దేవా! వేణువునే యిచ్చుచున్నానా?

కృష్ణ—సూరిదాసా! నేను వెళ్ళెదను. నీవు నెమ్మదిగారమ్ము. (వేణువునిచ్చి నిష్క్రమించుచున్నాఁడు)

బిల్వ—(వేణువుఁదీసికొని) ఆహా! ఆమోహనాకారుఁడు స్వరయుక్తముగాఁ బాడు నీపిల్లనగ్రోవి సృష్టిని తను మేలుకొలుపుచున్నది. వానిపాటలో శాంతిసుఖమను ధారామృతము నిండియున్నది. ప్రేమతోనిండినపాట యతని పిల్లనగ్రోవినుండి వెలువడుచున్నది. ఆతనిపాట కోంకారము శ్రుతియైయున్నది. శ్రీకృష్ణునివేణువునుండి వెలువడిన గానమేగానము గాని తదితరముగానముకాదు. ఆహా! ఏమివేణుగానము!

మ. పశువుల్మేఁతలు మానుచుం బరవశ ఽ త్వంబొంద నానందహృ
ద్వశతం భోగికులంబు భోగములపై ఽ పైకెత్తి యాడంగ స
ర్వశరణ్యుండవు నీవుదేవ! మురళీ ఽ రావంబునం శ్రోతలన్
స్వశరీరంబులు మర్వఁజేసితివి కృ ఽ ష్ణా! దీనసంరక్షణా!

(నిష్క్రమించుచున్నాఁడు)

4. రంగము. వనము. పర్వతములు.

[బిల్వమంగళుఁడు పాడుచుఁ బ్రవేశించుచున్నాఁడు.]

బిల్వ—మ. గురునిందల్ పచరింపకుండ, నన్మృతో ఽ క్తుల్పల్కకుండంగ దు
ష్కర పాపంబొడిగట్టకుండ, ఖలసాం ఽ గత్యంబు లేకుండ నో
పరమాత్మా! కరుణింపవే నను భవ ఽ త్పాదాంబుజాతద్వయీ
స్మరణాసక్తునిజేసి యెల్లపుడుఁ గృ ఽ ష్ణా! దీనసంరక్షణా!

ఈశ్వరా! ఈతనువునుండి జీవములు వెడలునప్పుడు నీనామసంకీర్తనముఁ జేయుచు వెడలుఁగాక! యమునానదీ తటంబునఁ బుష్పకవిమానము సమీపముననుండఁగా నాప్రాణములు పోవుఁగాక! శ్రీకృష్ణా! కమలానాథా! నన్ను నీలోఁ జేర్చుకొనుము. నీదర్శనముచే నిరంతర ప్రమదంబొసంగుము. నీకు భక్తిపూర్వకముగా నమస్కరించుచున్నాను.

[సోమగిరి-మాయాందేవి-చింతామణి ప్రవేశించుచున్నారు]

సోమ—ఆహా! ఏమిది! సూరిదాసిచ్చటనే యున్నవాఁడు.

బిల్వ—స్వామీ! నమస్కారము.

మాయా—(బిల్వమంగళుని పాదస్పర్శచేసి) ప్రాణనాథా! నమస్కారము.

బిల్వ—లెమ్ము. సాధ్వీమణీ! నాపాదములపై నేలపడియెదవు?

మాయా—ఆర్యా! నాకుమీరు స్వామియుఁ బ్రాణాధారులునగుటచే మీ పాదములపైఁ బడినదానను.

బిల్వ—ఆప్రభుని పాదములఁబడుము. అందఱను దరింపజేయున దాపరమాత్ముఁడే. నీవెవ్వతెవో చెప్పుము.

మాయా—మీయొక్కదాసిని. మీభార్యయగుమాయను. మీభక్తిప్రభావము వలన నాదుఃఖములన్నియు నశించినవి. గురుకృపా విశేషమున నిరంతరమును శ్రీకృష్ణగానము చేయుచున్నదానను. (పాదములపైఁబడును.)

బిల్వ—మాయా! లెమ్ములెమ్ము. ఈపదవి నాకిచ్చినది నీసత్యచరితమే. నన్నుఁ బరమాత్మునితోఁ గలిపినది నీపాతివ్రత్యప్రభావమే. మాయా! నీవు ధన్యురాలవు. నిజముగ శ్రీకృష్ణభజనమునందు నీమనస్సు లీనమైన యెడల నిశ్చయముగ నేసుఖమునుబొందవు. గురువర్యా! మీతోనింకెవ్వరైననున్నారా?

సోమ—చింతామణికూడ నున్నది.

బిల్వ—ఏమి! చింతామణియా! నన్నుద్ధరించిన చింతామణియా! మాతా! చింతామణీ! ఎంతశ్రమపడి యిచ్చటికివచ్చితివి!

చింతా—మహాత్మా! నమస్కారము! నీదర్శన భాగ్యములభించుటచే మా కష్టములన్నియు గట్టెక్కినవి. మేముధన్యురాండ్రమైతిమి. సూరదాసా! మేమువచ్చునప్పటికి మీరెవరితోనో మాటాడుచుంటిరి. వారెవ్వరో తెల్పఁగలరా?

సోమ—నేనడుగఁబోవు ప్రశ్నచింతామణియే యడిగినది. సూరదాసా! ఎవరితోడనీవు మాటాడుచుంటివి?

బిల్వ—ప్రభువుతో మాటాడుచుంటిని. ఆ నందకుమారునితో ముచ్చటించుచుంటిని. అతఁడునాతోనవ్వుచుండును. నాతో మాటాడుచుండును. అత్యంతమధురమైన ఫలమును దినువానికి హృదయమున నానందమెట్లు కల్గునో యట్లే శ్రీకృష్ణనామామృతమును మనసారఁ ద్రాగువానికి బ్రహ్మానందసుఖముకల్గును. అతనిధ్యానమే ముక్తిప్రదానముచేయునది.

సోమ—సూరదాసా! ప్రభువిచ్చటికి దయచేసియుండెనా?

బిల్వ—గురువరా! ఆలీలామానుషస్వరూపుఁడు నిరంతరమును వచ్చుచుఁబోవుచునుండును. అంధుఁడనగు నాకుఁ గన్నులకుఁగట్టినట్లు కన్పించుచు వినోదము కల్పించుచుండును. ఆజగన్మోహన విగ్రహము-ఆసుందర మూర్తి-ఆనయనానందాద్భుతస్వరూపము-ఆహాహా! ఏమని నుతింతును! శ్రీకృష్ణా! మురళీధరా!

సోమ—సూరదాసా! ధన్యుఁడవు ధన్యుఁడవు. నీభక్తి ధన్యమైనది.

బిల్వ—గురువరా! నన్నిట్లు పొగడుటచే నాకపకారము చేసినవారగుచున్నారు. ఇదియంతయు గురుకృపావిశేషముకాదా?

సోమ—సూరదాసా! నీవిట్లనవలదు. నాకుఁగూడ భగవతుని దర్శనము చేయింపవా?

మాయా—ప్రాణేశ్వరా! ఈదినురాలనుగూడఁ దరింపఁజేసి రక్షింపరా?

చింతా—మహాత్మా! నన్నుఁగూడ ననుగ్రహింపుము. నీకుఁ జరణదాసినై నిష్కల్మషాత్మతోఁ గొల్చిన యీచింతామణి నుద్ధరింపుము.

బిల్వ—చింతామణీ! మఱచితి మఱచితి- ఓప్రబోధచింతామణీ! నీవేకదా నాకీప్రబోధ మొసంగినది! మీరందఱును నాకుఁబరమోపకారులు. మీకొరికనిరాకరింపఁగలనా? ఆపరమేశ్వరుఁడు నాప్రార్థనసుంగీకరించి మీకు దర్శన మొసంగకుండునా? శ్రీకృష్ణా! కమలామనోహరా! జగన్నాథా! ఎంతటిదయాశాలివి! ఎంతటియానందస్వరూపుఁడవు! ఈవెఱ్ఱిభక్తుని జూచినవ్వుచున్నావా? ఓదీననాథా! ఈయనాథులకు దర్శనమిమ్ము. నీవుమత్స్యరూపముననొకసారియుఁగూర్మరూపముననొకసారియు, నరసింహరూపముననొకసారియు, వరాహరూపముననొకసారియు గరుఁడుని విడిచిపెట్టి వట్టికాళ్ళతో భక్తులనురక్షించుటకై బైలుదేఱితివి. ఇదియంతయు భక్తులయందు నీకుఁగలవాత్సల్యముకాదా! అంధుఁడనైన నాకు దర్శనమిచ్చి యానందింపఁజేసిననీవు నాప్రార్థనముఁగీకరించి వీరికిఁగూడ బ్రసన్నుఁడవై నన్నురక్షింపుము. శ్రీకృష్ణా! యమునందనా! మురళీధరా!

మ. మది భక్తావళిమీఁద నుండునొకొ సం ప్రార్థించినన్ వచ్చి క
న్పడుటన్ నిల్తువు మోహనాకృతిని దా క్రాడ్రీ! వీరికిన్ గౌతుక
ప్రదమౌ నీదగుదర్శనంబు లభియింపం జేయుమా! నీకు మ్రొ
క్కెదఁ బ్రార్థించెద నాశ్రితార్తిహరణా కృష్ణా! జగన్మోహనా!

కృష్ణు—(వచ్చి) బిల్వమంగళా! సావధానుఁడవుకమ్ము!

అందఱు—(శ్రీకృష్ణదర్శనమునఁ బరమానందభరితులై చేష్టలుడిగియుందురు.)

బిల్వ—స్వామీ! బృందావనప్రభూ! సకలజగద్రక్షకా! భక్తులయందలి వాత్సల్యమున దర్శనమిచ్చితివి. ధన్యుఁడనైతిని. స్వామీ! ఇదియేమింతలోనే యిట్లుకన్పడుచున్నావు. నన్ననుగ్రహించి యథారూపుఁడవుకమ్ము.

అందఱును—శ్రీకృష్ణపరమాత్మకు జే! శ్రీకృష్ణపరమాత్మకు జే!

కృష్ణు—బిల్వా! అధీరుఁడవుకావలదు. నీవుప్రార్థించిన నేను రాకుందునా?

బిల్వ—స్వామీ! నీవునన్నుఁ బరీక్షించుచుంటివా యేమి యిట్లు కన్పించుచున్నావు.

కృష్ణు—భక్తా! నేనెట్లు కన్పించుచున్నాను? వికృతాకారుఁడను కాలేదుకదా!

బిల్వ—ఆహాహా! మహానుభావా! భక్తపరిశీలనస్వభావా!

మ. అమృతంబో విషమో యెఱుంగఁ బరమా। త్మా! నాటి నీమోహినీ
ప్రియవావేషము నాకుఁ గట్టికటఁ గ। న్పట్టున్ మహాభక్తి సం
భ్రమముం గొల్పుచు నేఁడు చిత్తపద సా। మ్రాజ్యంబునన్ బూజ్యమై
యమరేంద్రస్తుతపాద! ధన్యుఁడను కృ। ష్ణా! దీనసంరక్షణా!

కృష్ణ—బిల్వా! నేటికి నీవు సర్వబాధవిముక్తుఁడవై పరిపూర్ణుఁడ వైతివి. నీవు నాయంతరంగ భక్తులలో నగ్రగణ్యుఁడ వైతివి. నిన్నుఁ బూజించువారు కూడ నన్నుఁ బొందుదురు వత్సా! నీకింకేమియునఁ గావలయునా?

బిల్వ—దేవా! ఈజీవుఁ డెప్పుడు నీతో నుండి నిన్నుఁ జూచుచుండుటకు మాత్రము నాహృదయనేత్రములు విప్పుము. ఇదియే నాకు గావలసినది.

సోమ—కృపానాథా! బిల్వమంగళుని కారుణ్యమున సర్వమంగళ స్వరూపుఁడవగు నిన్నుఁ గన్నులార దర్శించితిమి. ఇప్పు డీదర్శనోత్సవము బిల్వమంగళునకుఁ గూడఁ బ్రసాదింప నేత్రదానము గావింపుము.

కృష్ణ—(బిల్వమంగళుని కన్నులపైఁ జేయి వెట్టును.)

బిల్వ—(కన్నులతోఁ గృష్ణుఁ జూచి) ఆఁ! ఏమీ! ఏమీ! నాకృష్ణుఁడే! నా కృష్ణుఁడే! (కృష్ణుని కౌఁగలించుకొనును.)

కృష్ణ—భక్తశిరోమణీ! బిల్వమంగళా! నీభక్తిస్నేహములకు మెచ్చి ప్రసన్నుఁ డనైతిని. నీయభీష్ట మింకొకటి కోరుకొనుము

బిల్వ—ఆహాహా! భగవంతుని యనంతకరుణా మహత్త్వము!

ఉ. ఎన్నితపంబులో సలిపి। యెన్నివ్రతంబులో యాచరించి యిం
కెన్నియొ సిద్ధులందవిలి। యెవ్వని మానులుఁ గాంచలేరొ యా
వెన్నుని వెన్నదొంగ, నర। విందదళేక్షణు జూడఁ గల్గితిన్
గన్నులనిండ నేఁడు, బిగి। కౌఁగిటఁ జేర్చితి నెంతపుణ్యమో!

శ్రీకృష్ణా! నాకింకేమి కావలయును. కావలసిన యోగరత్నము లభించినది. అయినను నీసంపూర్ణమైన కృష్ణావతారముఁ జూపి మమ్మానందింపఁ జేయుము.

కృష్ణ—(సంపూర్ణకృష్ణావతారముఁ జూపును.)

బిల్వ—ఆహాహా! శ్రీకృష్ణా! వాసుదేవా! ధన్యులము ధన్యులము!

మ. వరదా! సద్గుణపూర్ణ! సర్వసుకృత। ప్రారంభ! సర్వేశ్వరా!
మురళీగానవినోద! లోకవినుతా! । భూతప్రపంచావనా!

కరుణాసాగర! నిత్యసత్యచరితా! । కైవల్యలక్ష్మీప్రదా!
శరణార్థిన్ గృపఁ జూడు మ్రొక్కెదను। కృష్ణా! దీనసంరక్షణా!

[అందఱును సాష్టాంగ దండప్రణామము లొనర్తురు.]

కృష్ణ—(యథారూపుఁడగును) బిల్వా! మనమంగళుఁ డచ్చట నున్నాఁడు చూడుము.

బిల్వ—(చూచి) మహాత్మా! అతనికపచారమొనర్చి యుంటిని. అతనిని జూచుటకు సిగ్గగుచున్నది.

కృష్ణ—మంగళా! ఇటు రమ్ము.

మంగళుఁడు—(ప్రవేశించి శ్రీకృష్ణునకు సాష్టాంగనమస్కారము చేయుచున్నాఁడు)

కృష్ణ—(లేవదీయుచు) మంగళా! ఇప్పటికైనఁ బ్రపంచతత్త్వము బోధపడినదా!

మంగ—దేవా! అజ్ఞాన తమమంతరించినది. ఈశ్వరకారుణ్య మనుభవించుచున్నాను. నన్ను మన్నింపుఁడు సర్వమును నాకు బోధపడినది.

కృష్ణ—అట్లయిన మంగళా! ఇంకేమి నీకుఁ గావలయును.

మంగ—దేవా! మీసన్నిధానము లభించిన నాకేమి కావలయును! ఏమియు నక్కఱలేదు. ఇంకమీఁద భూమియం దిట్లు జరుగుఁగాక!

మ. వెలచానల్ కులవృత్తి నాంబరఁగు దు। ర్వృత్తిన్ విసర్జించి భ
ర్తలతో ధర్మనియుక్తి నెప్పుడురుగా। తత్ కాముకుల్ స్వీయకాం
తల దుఃఖాంబుధిఁ ద్రోయకుండుదురుగా। తన్ ధర్మమే సర్వదా
చెలఁగన్ గాత! ధరిత్రి సస్యవతియై। చెన్నారుతన్ నీకృపన్

కృష్ణ—తథాస్తు!

(తెర వాలును.)

గద్య. ఇది శ్రీభారతీ కరుణాలబ్ధ కవితాధోరేయ మోచర్లవంశ
పయఃపారావార రాకాసుధాకర సీతారామ
చంద్రతనూభవ హనుమంతరాయాభిధేయ
ప్రణీతంబైన ప్రబోధచింతామణి నాట
కంబున సర్వంబును బంచమాంకము
సమాప్తము.

1326

END OF
TITLE